

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-6-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 149 పేజీలు: 8+4 వెల: 6.50


ప్రకృతి సంపదకు ఈశాన్య భారతం పుట్టినిల్లు: ప్రధాని 5లో

కరాచీలో భీకర ఉగ్రదాడి: నలుగురు సైనికులు మృతి

## రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో ప్రారంభం

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా 'పల్స్ పోలియో' కార్యక్రమం ప్రారంభమైంది. ఐదేళ్లలోపు వయసున్న పిల్లలకు తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేస్తున్నారు. రాష్ట్రంలో 49.20 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు. రైల్వేస్టేషన్లు, బస్ స్టాండ్లు, విమానాశ్రయాలు, మార్కెట్లు వంటి రద్దీ ప్రదేశాల్లో పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాల్లో పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగుతోంది. ఆరోగ్యకరమైన సమాజ ఏర్పాటుకు రెండు పల్స్ పోలియోచుక్కలు అమృతం లాంటివని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. తణుకులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అధికారులతో కలిసి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. కృష్ణా జిల్లా పెడనలో బంటుమిల్లి బస్టాండ్‌నందు 'పల్స్ పోలియో' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రధాన కూడలిలో పల్స్ >>2

# ఉమ్మడి కుటుంబమే ముద్దు


ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమంలో చిన్నారికి చుక్కల మందువేస్తున్న సిఎం చంద్రబాబు

పిల్లల పెంపకంలో తండ్రి బాధ్యత తీసుకోవాలి

ఇప్పుడు సంతానం భారం కాదు.. సంపద

పిల్లలు ఎక్కువ ఉంటే ప్రభుత్వంనుంచి ప్రోత్సాహం

చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సిఎం క్యాంప్ కార్యాలయంలో పిల్లలకు పోలియో చుక్కలువేశారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి ఆప్యాయంగా మాట్లాడారు. పిల్లలను ఎత్తుకుని కొంతసేపు ఆడించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్నిరకాల టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పల్స్ పోలియో కార్యక్రమం అమలుకు చేసిన ఏర్పాట్లను కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో నేటి నుంచి మూడు రోజుల పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా 5 సంవత్సరాల లోపు ఉన్న సుమారు 49.20లక్షలమంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు.
వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన పిల్లల తల్లిదండ్రులుతో సిఎం చంద్రబాబు ఈ సందర్భంగా మాట్లాడారు. పిల్లల పెంపకం భారంగాఉంటుందా అని అడిగి తెలుసుకు >>2


ఆదివారం ప్రధాని మోడీకి "గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజాన్" అవార్డు ప్రదానం చేస్తున్న సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మిని

## ప్రధాని మోడీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం

'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజాన్'ను అందించిన అధ్యక్షుడు పాట్రిక్ హెర్మిని

**విక్టోరియా,జూన్ 28:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా సీషెల్స్ ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారమైన "గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజాన్"ను ప్రదానం చేసింది. హరిత భవిష్యత్తు కోసం ప్రధాని మోడీదార్శనికతను ఈ అవార్డు గుర్తించింది. ప్రస్తుతం ప్రధాని మోడీ మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్‌లో ఉన్నారు. ఆ దేశ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యటనలో భాగంగా ఆయన సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినితో సమావేశమయ్యారు. అంతకుముందు, ప్రధానికి స్టేట్ హౌస్‌లో గౌరవ వందనంలభించింది. ఈ సందర్భంగా, మేడ్ >>2

## బాంబులు దూస్తున్న ఇరాన్



### పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ జ్వాలలు

కువైట్, బహ్రెయిన్‌లోని యుఎస్ స్థావరాలపై ఇరాన్ దాడులు

ప్రపంచ పటంనుంచి ఇరాన్‌ను చెరిపేస్తాం: ట్రంప్ తీవ్ర హెచ్చరిక

**కువైట్ సిటీ, జూన్ 28:** పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు మరింత తీవ్రరూపం దాల్చాయి. తమ భూభాగంపై అమెరికా జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) సంచలన చర్యకు దిగింది. కువైట్, బహ్రెయిన్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బలగాలు ఆదివారం క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. ఈ ఆకస్మిక పరిణామంతో ఆ ప్రాంతంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా పక్కకుపోయి, ఉభయ దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధం మొదలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హార్ముజ్ జలసంధి సమీపంలో ఉన్న తమ క్షిపణి కేంద్రాలు, డ్రోన్ గిడ్డంగులు, తీరప్రాంత >>2



## టిటిడికి అనంత్ అంబానీ రూ. 27.5 కోట్ల భారీ విరాళం

ఆదివారం తిరుమలలో అనంత్ అంబానీకి స్వామివారి చిత్రపటం బహుకరిస్తున్న టిటిడి అధికారులు

25 ఎలక్ట్రిక్ బస్సులు సమర్పణ

టిటిడి గోశాల ఆధునీకరణకు సమ్మతి

**తిరుమల,జూన్ 28ప్రభాతవార్తప్రతినిధి:** పారిశ్రామికవేత్త అనంత్ అంబానీ ఆదివారం వేకువజామున తిరుమల శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. ఆలయంలోనికి చేరుకున్న అనంత్ సుప్రభాతసేవలో కలియుగదైవాన్ని దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, రిసెప్షన్ డిప్యూటీ ఇఒ భాస్కర్ >>2

## రొట్టెల పండుగకు జన ప్రభంజనం

5 లక్షల మంది పైగా విచ్చేసిన భక్తులు

ఉద్యోగం, వివాహం, సంతానం రొట్టెలకు డిమాండ్

భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన అధికారులు


ఆదివారం రొట్టెల పండుగకు భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త - కలెక్టరేట్ :** నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు మూడో రోజు భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. సుమారు 5 లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఎండ బాగా వున్నప్పటికీ భక్తుల రద్దీ కొనసాగింది. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజిత వేజెండ్ల, మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు >>2



## స్మార్ట్ కిచెన్లు చూసి ఓర్వలేని జగన్

వైఎస్సార్ కడప జిల్లాలో 5 స్మార్ట్ కిచెన్లు పెట్టాం: మంత్రి నారా లోకేష్

**విజయవాడ. జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** స్మార్ట్ కిచెన్ల ద్వారా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు రుచి, శుచి, శుభ్రతతో కూడిన భోజనం పెడుతుంటే జగన్ గారు ఓర్వలేకపోతున్నారని ఏపి ఐటి, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఆరోపించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఉన్నవారితోపాటు అదనంగా మహిళలు, పేదలకు ఉపాధి కల్పిస్తుంటే ఉసూరుమంటున్నారు. ఆదివారం ఆయన "ఎక్స్" వేదికగా స్మార్ట్ కిచన్ వ్యవస్థపై చేసిన విమర్శలకు స్పందిస్తూ మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లాలో ఐదు స్మార్ట్ కిచెన్లు పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాం. ఈ స్కూళ్ల పరిధిలో పనిచేస్తున్న 233 మంది కుక్‌కమ్‌హెల్పర్లు యథావిధిగా తమ విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేయబోతున్న మరో 33 స్మార్ట్ కిచెన్ల పరిధిలో ఏ ఒక్కరి ఉపాధికీ ఢోకాలేదు. పైగా స్మార్ట్ కిచెన్ల నిర్వహణ ద్వారా స్వయంశక్తి సంఘ మహిళలకు 38 మంది హెడ్ కుక్స్, 22 మంది అసిస్టెంట్ కుక్స్, 256 మంది హెల్పర్లు, సుమారు 76 మంది డ్రైవర్లకు అదనంగా ఉపాధి కల్పించబోతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేయబోయే స్మార్ట్ కిచెన్లతో ఉన్నవారితోపాటు అదనంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తుంటే ఎందుకు ఏడుస్తున్నారు జగన్ గారు? పేదలు బాగుపడితే చూడలేరా? స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుతో వేతనాలు చెల్లించలేదని జగన్ ఆరోపించిన వైఎస్సార్ కడప జిల్లాలో పనిచేస్తున్న మొత్తం 3,450 మంది కుక్‌కమ్‌హెల్పర్లు ఏప్రిల్ 2026 నెల వరకు గౌరవ వేతనాలు పూర్తిగా చెల్లించేశాం. మే నెలలో పాఠశాలలకు వేసవి సెలవుల కారణంగా గౌరవ >>2

## ఆందోళన బాటలో ఆర్టీసీ ఉద్యోగులు

7,8న ఆర్టీసీ పరిరక్షణ దినం

ప్రైవేటీకరణపై ఉద్యోగుల నిరసన

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిఎస్ ఆర్టీసీలో విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేట్ ఆపరేటర్లకు అవకాశం కల్పిస్తూ రూ.వేల కోట్లు విలువైన ఆర్టీసి డిపో స్థలాలను కూడా వారికి కట్టబెట్టడాన్ని నిరసిస్తూ ఉద్యోగులు మరోసారి నిరసనల బాట పట్టబోతున్నారు. దశల వారీగా ఆర్టీసీని ప్రైవేటుపరం చేయాలన్న ప్రభుత్వం ఆలోచనలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ చేస్తూ సంస్థ పరిరక్షణ, ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం, పిటిడి(ఆర్టీసి) ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న రెండవ దశ ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను ఇవాళ విజయవాడలో విడుదల చేశారు. విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఆర్టీసి ఉద్యోగసంఘాల జెఎసి సమావేశం జరిగింది. ఈ >>2

## 1నుంచి జిల్లాల్లో సిఎం పర్యటనలు

హీరో మోటోకార్ప్, జీరాంజీ, రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభోత్సవాలు

**విజయవాడ, జూన్28, ప్రభాతవార్త ప్రతినిధి:** సిఎం నారా చంద్రబాబు నాయుడు జూలై 1వ తేదీ నుంచి వరుసగా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఆయన పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. జిల్లా పర్యటనల్లో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యమాల్లో సిఎం పాల్గొననున్నారు. 1వ తేదీ పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం కోసం నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలో పర్యటించనున్నారు. అదే రోజు తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీ సిటీలో ద్విచక్ర వాహనాల సంస్థ హీరో మోటో కార్ప్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. దాదాపు రూ.750 కోట్ల పెట్టుబడులతో హీరో సంస్థ ఈ పార్ట్స్ సెంటర్ ను ఏర్పాటు చేస్తోంది. దీనికి శంకుస్థాపన చేయనున్నారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. 2వ తేదీ ఉదయం తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ ఆజీవికా మిషన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం తిరుపతి పట్టణంలో ప్రైవేటు హోటల్‌లో జరిగే జిఎస్‌డిపూ కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్ నకు హాజరవుతారు. >>2



## 22 రాష్ట్రాల్లో విస్తరించిన 'నైరుతి'

ఎపి, తెలంగాణలో భారీ వర్షాలకు అవకాశం

ఈశాన్యంలోనూ అధిక వర్షపాతం


వాతావరణ శాఖ అంచనా

**న్యూఢిల్లీ, జూన్ 28:** నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా దాదాపు 22 రాష్ట్రాల్లో విస్తరించాయి. మరింతగా విస్తరిస్తున్నందున తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఉరుములు కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) అంచనా వేసింది. ఐఎండి ప్రకారం, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు రుతుపవనాలు ఉత్తర అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు గుజరాత్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లోకి మరింతగా విస్తరించడానికి తోడ్పడుతున్నాయి. తెలంగాణ, కోస్తా ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, లక్షద్వీప్ లలో భారీ వర్షాలు కురిసే అవకాశంఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఉరుములతో కూడిన వర్షాలు, మెరుపులు, బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. కర్ణాటకలో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉండగా, అండమాన్, నికోబార్ దీవులలోని కొన్ని ప్రాంతాలలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులతో కూడిన ఉరుములతోకూడిన ఈదురు గాలులు సంభవించవచ్చు. అస్సాం, మేఘాలయ, ఉపహిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం సహా >>2

## మినీ వాహనాన్ని ఢీకొన్న లారీ

శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలో దుర్ఘటన, ముగ్గురు మహిళలు మృతి

**కవిటి (శ్రీకాకుళం జిల్లా), జూన్ 28 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం జమేదారిపుట్టుగ జాతీయ రహదారి సమీపంలో ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ముగ్గురు మహిళలు మృతి చెందిన వైనం చోటు చేసుకుంది. లారీ డ్రైవర్ మద్యం సేవించి వాహనం అతి వేగంగా నడపడమే ప్రధాన కారణంగా తెలియ వస్తోంది. కంచిలి మండలం మకరాంపురం ఆదివారం సంత నుంచి పనసకాయలోడుతో బరంపురం వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆదివారం సంత నుంచి పనస కాయలు కొని బరంపురం తరలించే క్రమంలో ఇచ్ఛాపురం ఎస్ఎన్ పేటకు చెందిన మద్దిలి తరిణమ్మ (62), కవిటి మండలం గుజ్జుపుట్టుగ గ్రామానికి చెందిన మురపాల పార్వతి (50) అలానే రాపాకపుట్టుగ గ్రామానికి చెందిన నర్తు పద్మమ్మ (60) మినీ వాహనంపై బరంపురం వైపు వెళుచుండగా వెనుక వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ >>2



ఆదివారం భారత్-సీషెల్స్ మధ్య అవగాహనా ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరుదేశాల విదేశాంగ మంత్రులు

# బాంబులు దూస్తున్న ఇరాన్

>> రాడార్ స్థావరాలపై అమెరికా జరిపిన దాడులకు సమాధానంగానే తాము ఈ సైనిక చర్య చేపట్టినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను కువైట్ వైమానిక రక్షణ వ్యవస్థలు మధ్యలోనే అడ్డుకోగా.. బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక కేంద్రాల పరిసరాల్లో భారీ అలజడి రేగింది. ఈ దాడుల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.
ఈ దాడుల అనంతరం ఇరాన్ నావికాదళం అమెరికాకు తీవ్ర హెచ్చరికలు చేసింది. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు 'నరకాన్ని చూస్తాయని' వ్యాఖ్యానించింది. అమెరికాయే మొదట శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, హార్ముజ్ జలసంధిలో తమ నిబంధనలను పాటించని నౌకలపై మరిన్ని కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇరాన్ గనుక ఇలాగే ఒప్పందాలను ఉల్లంఘిస్తూ పోతే వాషింగ్టన్ సైనికపరంగా ఈ కథను ముగించాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాంటి పరిస్థితి వస్తే ప్రపంచ పటంలో 'ఇరాన్ అనే దేశమే ఇకపై ఉనికిలో ఉండదు' అంటూ ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. హార్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న 'కికు' అనే అంతర్జాతీయ చమురు నౌకపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడికి ప్రతిచర్యగా అమెరికా సైన్యం దాడులు ప్రారంభించిది. అమెరికా వరుసగా రెండోరోజు కూడా ఇరాన్ స్థావరాలను ధ్వంసం చేయడంతో ఇచాన్ క్షిపణి దాడులకు దిగింది. ఈ పరిణమాలతో ఇరు దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం పొంచి ఉంది.

# స్మార్ట్ కిచెన్లు చూసి ఓర్వలేని జగన్

>> వేతనాలు చెల్లింపు ఉండదు. జూన్ నెల ఇంకా పూర్తి కాలేదు. మరి జగన్ ఎవరి బకాయిలు గురించి ఫేక్ ఆరోపణలు చేశారో చెప్పాలి. స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుతో విద్యార్థులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన, ప్రమాణాలకు అనుగుణమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. పేద పిల్లలకు మంచి భోజనం పెట్టడం, ఆరోగ్యం ఉండడం కూడా సహించలేకపోతే ఎలా అండీ జగన్ అంటూ వ్యాఖ్యానించారు స్మార్ట్ కిచెన్ల ప్రధాన ఉద్దేశ్యం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన, ప్రమాణాలకు అనుగుణమైన మధ్యాహ్న భోజనం అందించడమేనని మంత్రి వివరించారు. ఆధునిక వంటశాలల ద్వారా ఆహార నాణ్యత మెరుగుపడటం ఉంటుందని చెప్పారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా వారి విద్యాభ్యాసంపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో మరో రెండురోజులు వానలు

## మంగళగిరిలో 68.2మిమీ, రాజాంలో 52.5మిమీ వర్షపాతం నమోదు

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో ఆదివారం వివిధ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసాయి. సాయంత్రం 4 గంటల సమయానికి వాతావరణ సమాచారాన్ని అనుసరించి గుంటూరు జిల్లా మంగళగిరిలో 68.2మిమీ, విజయనగరం జిల్లా రాజాంలో 52.5మిమీ, గుంటూరు జిల్లా కాకుమానులో 51.5మిమీ, తాడేపల్లిలో 45.2మిమీ, ఎన్టీఆర్ జిల్లా కవులూరులో 41.5మిమీ, బాపట్ల జిల్లా భట్టిప్రోలు 39.9మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది.ఉత్తరాంధ్ర తీరప్రాంతం నుండి ఛత్తీస్‌గఢ్ మీదుగా మహారాష్ట్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.అంతర్గత కర్ణాటక నుండి రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమొరిన్ ప్రాంతం వరకు మరోక ద్రోణి విస్తరించి ఉందని పేర్కొన్నారు.దీని ప్రభావంతో మరో రెండు రోజులు మేఘావృతమైన వాతావరణంతో పాటు చెదురుమదురుగా మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
కోస్తాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలకు అవకాశంఉందని పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలకు అవకాశం ఉందన్నారు.ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలని హెచ్చరించారు.

# ఉమ్మడి కుటుంబమే ముద్దు

>> న్నారు. ఉద్యోగానికి, ఉపాధికి వెళుతున్న మహిళలు పిల్లల పెంపకంలో ఎలా సమన్వయం చేసుకుంటున్నారని అడిగారు. ఇంట్లో భర్త, మగవాళ్లు కూడా పిల్లల పెంపకంలో బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా సిఎం అన్నారు. పిల్లల్ని కని, పెంచడం, వారి అలనాపాలనా చూసుకోవడం తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదని అన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉంటే పిల్లల పెంపకంలో భాగస్వాములు అయ్యేవారని అన్నారు. పిల్లలను విలువలతో పెంచడంలో నాడు అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర కుటుంబ సభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించేవారని గుర్తుచేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని.. అలాంటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ రావాలని సిఎం చంద్రబాబు అన్నారు. సంతానాన్ని సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలని.. సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోందని సిఎం అన్నారు. అందుకే ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నామని సిఎం అన్నారు. ఈ విషయంలో ముందుగా తల్లిదండ్రులకు అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబుతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్స్ పోలియో ప్రారంభం

>> పోలియో సెంటర్‌లు ఉన్నాయన్నారు. పాయకరావుపేటలో హోంమంత్రి వంగలపూడి అనిత, నందిగామ, జగ్గయ్యపేటల్లో ప్రభుత్వ విప్‌లు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), ఏలూరు.,కాకినాడ, గుంటూరు, శ్రీకాకుళం, విజయవాడ, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పల్స్ పోలియో కార్యక్రమాలు జరిగాయి. మంత్రుల అచ్చెన్ననాయుడు, పి.శ్రీబాల వీరాంజనేయులు,గుమ్మడి సంధ్యారాణి, వాసంశెట్టి సుభాష్. కొండపల్లి శ్రీనివాస్.కందుల దుర్గేష్,నాదెండ్ల మనోహర్ తదితరలు ఆయా జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో సిఎం చంద్రబాబు భేటీ



ఆదివారం భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు.సీఎం వ్యక్తిగత కార్యాలయంలో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు లాస్ట్‌మైల్ ఇంటర్నెట్ సేవలను విస్తరించే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అలాగే రాష్ట్రంలో మొబైల్ టవర్ కనెక్టివిటీని పెంచేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ,
డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులను ప్రోత్సహించే అవకాశాలు, సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటు వంటి కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. మొబైల్ సేవల సంస్థలకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత మెరుగు పరిచే చర్యలపైకూడా అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి డిజిటల్ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.



ఆదివారం న్యూఢిల్లీలో రాష్ట్రీయ గ్రామీణ వికాస్ సమ్మేళన్'ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తదితరులు

# మోడీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం

>> ఇన్ ఇండియా ఫాస్ట్ ప్యాట్రోల్ వెసెల్ పీఎస్ లెస్‌ప్వార్‌తో పాటు ఆరు అంబులెన్స్‌లు, 10 యుటిలిటీ వాహనాలు, ఐదు లేజర్ రేడియల్ బోట్లను సీషెల్స్‌కు ప్రధాని మోడీ అందజేశారు. ఈ సహాయం సీషెల్స్ సముద్ర నిఘా సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది. అనంతరం ఇరు దేశాల నేతలు కలిసి సీషెల్స్ నేషనల్ బొటానికల్ గార్డెన్‌లో అరుదైన కోకో డి మెర్ మొక్కను నాటారు. ప్రధాని మోడీకి అంతర్జాతీయ పురస్కారాలు రావడం ఇదే తొలిసారి కాదు. ఈ యేడాది మే నెలలో ఆహార భద్రతకు చేసిన సేవలకు గాను ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ అత్యున్నత పురస్కారం అగ్రికోలా మెడల్ అందుకున్నారు. గతంలో 2018లో సియోల్ శాంతి బహుమతి, ఐక్యరాజ్యసమితి ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డులు కూడా ఆయనను వరించాయి.

# 22 రాష్ట్రాల్లో విస్తరించిన 'నైరుతి'

>> ఈశాన్య రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి హెచ్చరిక జారీ చేసింది. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ, బీహార్, హర్యానాలలో వడగాలుల పరిస్థితులు కొనసాగే అవకాశం ఉంది.

**జులై 4 వరకు తెలంగాణలో భారీ వర్షాలు**

రాబోయే ఏడు రోజులలో తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన గాలులు, ఈదురు గాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఐఎండి అంచనాల ప్రకారం, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, అక్కడక్కడా మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో గాలి వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు చేరవచ్చు. ఈ వాతావరణ పరిస్థితుల కారణంగా తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. ఆదివారం సంగారెడ్డిలో గరిష్ట ఉష్ణోగ్రత 28 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో 30.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్‌లో రాబోయే రోజుల్లో వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులతో పాటు ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. జులై 1 వరకు అడపాదడపా జల్లులు పడే అవకాశముంది. నగరంలోని కొన్ని ప్రాంతాలు, చుట్టుపక్కల ప్రాంతాలలో మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో చెదురుమదురుగా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# రూ. 27.5 కోట్ల భారీ విరాళం

>>అనంత్ అంబానీకి దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం ఆలయ పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు.స్వామివారి చిత్రపటం బహుకరించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఆయన టిటిడికి భారీ విరాళం ప్రకటించారు. దాదాపు 27.5 కోట్ల రూపాయలతో 25 ఎలక్ట్రిక్ బస్సులు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ఈ బస్సుల నిర్వహణ, డ్రైవర్ల జీతాలు కూడా తామే భరిస్తామని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెల్లడించారు. అనంతరం ఆలయం వెలుపల టిటిడి అధికారులతో మాట్లాడిన అనంత్ అంబానీ తిరుమలలో జరుగుతున్న సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. బస్సుల నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కూడా నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే రిలయన్స్ సంస్థ గుజరాత్ వంతారాలో నిర్వహిస్తున్న టిటిడి గోశాల ఆధునికీకరణకు అంగీకారం తెలిపారు. టిటిడి అధికారులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

# ఆందోళన బాటలో ఆర్టీసీ ఉద్యోగులు

>> సమావేశంలో జేఏసీ కమిటి తీసుకున్న నిర్ణయాల మేరకు రెండవ దశ ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను లిఖితపూర్వకంగా రేపు సిఎం, సిఎస్, రవాణామంత్రి, ఆర్టీసి ఎండి, ఇతర అధికారులకు అందించనున్నారు. ఇందులో జూలై 7, 8న రెండు రోజులు "ఏపీఎస్ ఆర్టీసీ పరిరక్షణ దినం" గా పాటిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి ఉద్యోగులందరూ డిమాండ్లతో కూడిన ప్రింటెడ్ బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తారు.జూలై 9 నుండి 18 వరకు ప్రజాప్రతినిధుల మద్దతు కోరే కార్యక్రమం నిర్వహిస్తారు. జూలై 19 నుండి 26 వరకు వినతిపత్రాలపై ఆర్టీసిలో ఉద్యోగులందరితో సంతకాల సేకరణ చేస్తారు. జూలై 27న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ల ద్వారా సీఎంకు ఉద్యోగుల సంతకాల సేకరణతో కూడిన వినతిపత్రాలను అందిస్తారు. జూలై 30న జేఏసీ రాష్ట్ర స్థాయి సమావేశం విజయవాడలో నిర్వహించి, మూడవ దశ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తారు.

# మినీ వాహనాన్ని ఢీకొన్న లారీ

>> మద్యం సేవించి అప్రమత్తంగా వాహనాన్ని నడిపే క్రమంలో మినీ వాహనానికి లారీ బలంగా ఢీకొంది. మినీ వాహనం విద్యుత్ స్తంభానికి ఢీకొని పక్కనే ఉన్న పొలాల్లో పడిపోయింది. తరినమ్మ, మురపాల పార్వతి, ఎన్ పద్మమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు గాయాల పాలయ్యారు. మిగిలిన వారిలో ఒకరు పరిస్థితి ఇబ్బందికరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బరంపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కవిటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 1నుంచి జిల్లాల్లో సిఎం పర్యటనలు

>> ఈ వర్క్ షాప్‌నకు నీతి ఆయోగ్ సభ్యులతో పాటు, పిఎం ఎకనమిక్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు హాజరవుతారు. రెండవ తేదీ రాత్రి తిరుపతిలోనే సిఎం బస చేస్తారు. 3వ తేదీ ఉదయం కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ప్రారంభించనున్నారు.
అనంతరం మూడు రోజుల పర్యటనలో భాగంగా అక్కడి నుంచి సిఎం చంద్రబాబు కుప్పం బయలుదేరి వెళతారు. 3 తేదీ నుంచి 5 వతేదీ వరకు సిఎం కుప్పంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. 5వ తేదీన అమరావతికి తిరిగి చేరుకుంటారు.

# తోతాపురి మామిడి రైతులకు కేంద్రం అండగా నిలవాలి

## 7.03 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లకు రూ.281 కోట్ల ఆర్థిక సహకారం ఇవ్వాలి

## మామిడి రైతుల కోసం ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం అమలు చేయాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 28, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని అధిగమించేందుకు చొరవ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సిఎం లేఖ రాశారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ పరిణామాలతో మ్యాంగో పల్ప్ ఎగుమతులు నిలిచిపోవడం, పరిశ్రమలు కొనుగోళ్లు నిలిపివేయడంతో మార్కెట్‌లో తోతాపురి ధరలు పడిపోయాయని లేఖలో పేర్కొన్నారు. మామిడి రైతులను ఆదుకునేందుకు కేంద్రం రూ.281 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి ఆ లేఖలో కోరారు. దేశంలోనే మామిడి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని, రాష్ట్రవ్యాప్తంగా 3.99 లక్షల హెక్టార్లలో సాగవుతూ 52.65 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందని చంద్రబాబు వివరించారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల్లో దాదాపు 91,011 హెక్టార్లలో తోతాపురి రకం సాగవుతోందని తెలిపారు. దీని ద్వారా 8.65 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తూ లక్షలాది రైతు కుటుంబాలకు జీవనాధారంగా ఉందని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుత సీజన్‌లో పెట్టుబడి వ్యయం పెరగడం, మార్కెట్ ధరలు కుప్పకూలడంతో మామిడి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని లేఖలో పరిస్థితిని వివరించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని 7.03 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి కొనుగోళ్లకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం అమలు చేస్తున్నట్టు సీఎం లేఖలో వెల్లడించారు. దీంట్లో భాగంగా కిలోకు అదనంగా రూ.4 చొప్పున మామిడి రైతులకు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ మేరకు పీడీపీఎస్‌కింద కేంద్రం మద్దతివ్వాలని... ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు జరిగే ఈ కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీంను అమలు చేసేలా చూడాలని కేంద్రమంత్రికి రాసిన లేఖలో ముఖ్యమంత్రి కోరారు.

# రొట్టెల పండుగకు జన ప్రభంజనం

>> మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

**కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం**

కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ఉద్యోగం, వివాహం, సంతాన రొట్టెలకు డిమాండ్ పెరిగింది. జిల్లా యంత్రాంగం పటిష్టంగా చేపట్టిన ఏర్పాట్ల పట్ల సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీస్ కంట్రోల్ రూం 24 గంటలు అనౌన్స్మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు. భక్తులు పోగొట్టుకున్న పర్సులను అందిస్తున్నారు. దీంతో పోలీసు కంట్రోల్ రూం సేవలను అందరూ శభాష్ అని మెచ్చుకుంటున్నారు.

**పారిశుధ్య సిబ్బంది సేవలు భేష్..**

దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదరాన్ని తొలగిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా శుభ్రపరుస్తున్నారు. దీంతో దర్గా పరిసరాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ నందన్, హెల్త్ ఆఫీసర్ చైతన్య ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

**వైద్య శిబిరాలను వినియోగించుకుంటున్న భక్తులు**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేక వైద్యులను, సిబ్బందిని బ్యాచ్‌ల వారీగా నియమించి 24 గంటలూ భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. మెరుగైన వైద్యంకోసం భక్తులను అంబులెన్స్‌లద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నారు. మూడురోజుల్లో సుమారు 3000 మంది పైగా భక్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత తెలిపారు.

**అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ..**

స్వర్ణాల చెరువులో ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. 24 గంటలూ అప్రమత్తంగా బోట్లు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచారు.

## వారం - వర్జ్యం

29-06-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
పౌర్ణమి తె.5.26, మూల తె.4.03
వర్జ్యం : రా.2.16-తె.4.03
దు.ము.12.37-మ.1.29,
2) మ.3.14-సా.4.06
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** శ్రమకు ఓర్చి మీవంతు సహాయం అందిస్తారు. ఉచిత సలహాలు ఇవ్వకండి. పొదుపు పథకాలు అంది వస్తాయి.

**వృషభం:** దూరమైన ఆప్తులు దగ్గరవుతారు సంతాన విద్యావరంగా అభివృద్ధి కనిపిస్తుంది. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు.

**మిథునం:** అన్యాక్రాంతమైన భూములు, ఇవ్వవలసిన ఋణాలు మొదలయిన విషయాలన్నీ మీకు అనుకూలంగా ఉంటాయి.

**కర్కాటకం:** సంతాన క్షేమం పురోభివృద్ధి సాధిస్తారు. కాలానుగుణంగా ప్రవర్తించడమే విజయానికి మార్గమని గుర్తించండి.

**సింహం:** ప్రముఖులతో చర్చలు సాగిస్తారు. ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** క్రెడిట్‌కార్డు, పాస్‌పోర్టు వంటివి ఇతరులకు అప్పగించవద్దు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**తుల:** పొలము, స్థిరాస్తుల తాలూకు ధనము చేతికి వస్తుంది. తప్పుడు లెక్కలు, అబద్ధములు మీ దృష్టికి వస్తాయి.

**వృశ్చికం:** సన్మానాలు, సత్కారాలతో హడావిడిగా కాలం గడుపుతారు. నరఘోష అధికమవుతుంది. బంధువుల కలయిక.

**ధనుస్సు:** కుటుంబంలో ఏర్పడే స్పర్థలు చిన్నపాటి వివాదాలు సర్దుకుంటాయి. దీర్ఘకాలిక సమస్యలను మాత్రం కాలానికి వదిలివేస్తారు.

**మకరం:** ఎంత సాధించినా ఇంకా సాధించాలనే తృప్తి లేని ధోరణి మానసిక ప్రశాంతతను దూరం చేస్తుంది.

**కుంభం:** ఆదర్శప్రాయంగా జీవితం గడపాలనుకొని అందుకు తగిన విధంగా ప్రణాళికలు రూపొందించుకుంటారు.

**మీనం:** ప్రభుత్వ సంబంధమైన చిక్కులను అతియుక్తిగా తప్పించుకోగలుగుతారు. వాహనాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కూరగాయలు వ్యాన్ బోల్తా

## 10 మందికి తీవ్రగాయాలు

**వరదయ్యపాలెం, జూన్ 28 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం చిన్నపాండురు వికెఆర్ కాలనీ వద్ద కూరగాయలు వ్యాన్ బోల్తా పడి 10 మందికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. సత్యవేడు మండలంకు చెందిన వారు కూరగాయలు వ్యాన్‌లో సంతకు వెళుతుండగా ప్రమాద శాత్తు చిన్నపాండురు వి కె ఆర్ కాలనీ దగ్గర బోల్తా పడిపోయింది. అందులో వున్న 10 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు.
గాయపడిన వారిలో చెన్నై హాస్పిటల్‌లో 6 మంది, తిరుపతి రుయా హాస్పిటల్‌లో ముగ్గురు వ్యక్తులు చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. కాయగూరల వ్యాపారం చేసేందుకు సంతకు వెళ్లి ప్రమాదానికి గురైన వారిలో ఈశ్వరన్ (50), కంసాల (40), పాండియన్ (41), మురళి (49), వేండ (45), నాగభూషణమ్మ (60), గోపి (50), వసంతమ్మ (65),వనిత (46)లు వున్నారు. వారిలో ఆందోళన కరంగా వున్న వారిలో ఈశ్వరన్ (50), కంసాల( 40), పాండియన్ (41),మురళి (49), వేండ(45),వనిత (46)లు ఉన్నట్టు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం దిగ్భ్రాంతి చెందారు. ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌కి చరవాణి ద్వారా సమాచారం తెలిపారు.

# 'స్మార్ట్ కిచెన్స్'పై ఆరోపణలన్నీ నిరాధారం



## • స్పష్టతను ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్మార్ట్ కిచెన్స్ విధానంపై వస్తున్న ఆరోపణలను ఏపీ ప్రభుత్వం ఖండించింది. ఈ మేరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. పభుత్వం ప్రతిపాదిస్తున్న స్మార్ట్ కిచెన్లపై కొందరు రాజకీయ స్వార్థంతో చేస్తున్న ఆరోపణలు ముమ్మాటికీ అవాస్తవం, ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర మాత్రమేనని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేసింది. విద్యార్థుల ఆరోగ్యమే పరమావధిగా స్మార్ట్ కిచెన్స్ లక్ష్యం ఏర్పాటు అని ప్రకటనలో వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులకు మరింత సమర్థవంతంగా, అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించే ఏకైక సంకల్పంతోనే ప్రభుత్వం స్మార్ట్ కిచెన్స్ విధానాన్ని పరిశీలిస్తోంది. ఆధునిక సాంకేతికతను జోడించి విద్యార్థుల ఆరోగ్య భద్రతను మెరుగుపరచడం ప్రభుత్వ బాధ్యతని ప్రకటనలో ప్రభుత్వం వివరించింది.

**కార్మికుల తొలగింపు లేదు, ఉపాధికి పూర్తి భద్రత:** స్మార్ట్ కిచెన్ల పేరుతో వంట కార్మికులను తొలగిస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదు. ఎక్కడా, ఒక్క కుక్‌ను కూడా తొలగించడం లేదు. దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న దాదాపు 85 వేల మంది అక్కచెల్లెమ్మల సేవలను ప్రభుత్వం పూర్తిగా గౌరవిస్తుంది. వారి సంక్షేమానికి, ఉపాధి భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. కార్మికుల పొట్ట గొట్టే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు.

**జీతాల బకాయిలపై స్పష్టత:** మధ్యాహ్న భోజన కార్మికులకు ఇప్పటికే ఈ ఏడాది ఏప్రిల్ నెల వరకు జీతాలను/ గౌరవ వేతనాలను పూర్తిగా చెల్లించడం జరిగింది. సాంకేతిక కారణాల వల్ల నిలిచిన మిగిలిన స్వల్ప బకాయిలను కూడా త్వరితగతిన విడుదల చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు సమకూర్చింది. అతి త్వరలోనే ఈ నిధులు కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయి. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన దాదాపు రూ.350 కోట్ల పైచిలుకు బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం విజయవంతంగా విడుదల చేసింది. ఈ నిధులలో పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల జీతాలతో పాటు, విద్యార్థులకు అందించే గుడ్లు, చిక్కీలు, శానిటరీ నాప్‌కిన్ల వెండర్లకు సుదీర్ఘకాలంగా ఇవ్వాల్సిన బకాయిలు కూడా కలిసి ఉన్నాయి; దీనితో లబ్ధిదారులందరికీ పెద్ద ఉపశమనం లభించింది.

**రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం వద్దు:** విద్యార్థులకు మేలు చేసే సంస్కరణలను, కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే చర్యగా చిత్రీకరించడం శోచనీయం. రాజకీయ ఉనికి కోసం, ప్రజల్లో అభద్రతా భావాన్ని సృష్టించడానికి చేస్తున్న ఇలాంటి నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మవద్దు. విద్యార్థులకు సురక్షితమైన, పోషకాహారం అందించడంతో పాటు అటు మధ్యాహ్న భోజన కార్మికుల సంక్షేమాన్ని, వారి హక్కులను కాపాడటానికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా పునరుద్ఘాటిస్తున్నాము. కార్మికులు ఎలాంటి ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తెలిపింది.

# పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

## బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత



**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుతో కలిసి మధురానగర్‌లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేసి మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ పోలియో నిర్మూలనకు ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తమ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశయాలకు అనుగుణంగా, భావితరాల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. సుమారు రూ.6.5 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని అన్ని సచివాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మొబైల్ పోలియో బూత్‌ల ద్వారా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చిన్నారికి రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ అందించి, ఆంధ్రప్రదేశ్‌ను సంపూర్ణ పోలియో రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోలియో రహిత భారతదేశ నిర్మాణమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పోలియో నిర్మూలనపై విస్తృత ప్రచారం నిర్వహించి, తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలియో పూర్తిగా నిర్మూలన కావడం ప్రభుత్వాల సమిష్టి కృషి ఫలితమని, ఈ మహమ్మారి మళ్లీ ప్రబలకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే పల్స్ పోలియో కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వానికి అధికారం ఒక అలంకారం కాదని, ప్రజాసేవ అనే బాధ్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రజలకు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రి సద్వినియోగం చేసుకుని తమ చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో డిఎమ్ అండ్ హెచ్ఒ జె.ఇందుమతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రీతి అభిషా, జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి బి.శరత్ బాబు, జిల్లా హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.నవీన్ కుమార్, రోటరీ క్లబ్‌కు చెందిన వై.పార్థసారథి, కె.మధు, మధురానగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



## జలవిహారంలో సేదదీరిన పద్మావతిదేవి

**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మ వార్షిక తెప్పోత్సవాల్లో ఆదివారం సాయంత్రం పద్మసరోవరంలో సిరులతల్లి పద్మావతిదేవిగా తెప్పపై విహరించి భక్తులకు దివ్యదర్శనం ప్రసాదించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తికి పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకం జరిపారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేసి, తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, ఆలయ డిప్యూటీ ఇఒ పి. హరీంద్రనాథ్, ఎవిఎస్ఒ రాధాకృష్ణ, సూపరింటెండెంట్‌లు సురేష్, రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చలపతి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# తిరుమలలో 5,255 మంది పిల్లలకు పోలియో చుక్కలు



**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్త పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయం వద్ద పల్స్ పోలియో కార్యక్రమాన్ని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ప్రారంభించారు. పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. టిటిడి ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ఎస్.కుసుమ కుమారి ఆధ్వర్యంలో తిరుమలలో 25 ప్రాంతాలలో పల్స్ పోలియో కేంద్రాలు పనిచేశాయి. శ్రీవారి ఆలయంతో కలిపి 21ప్రాంతాలలో భక్తులకు, 4ప్రాంతాలలో స్థానికులకు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అశ్విని ఆసుపత్రి, జియన్‌సి, ఆర్‌టిసి బస్టాండ్, సిఆర్ఓ, పిఏసి 1, 2, ఎమ్‌బిసి 34, వైకుంఠం 1, 2, హెల్త్ ఆఫీసు, ఎటిసి, మేదరమిట్ట, వరాహస్వామి, రాంభగీచ అతిథి గృహాలవద్ద, శ్రీవారి ఆలయం లోపల, కల్యాణకట్ట, బాలాజీ నగర్, టిటిడి ఉద్యోగుల డిస్పెన్సరి ఎస్.వి. హైస్కూల్, పాపావినాశనం, అలిపిరి కాలినడక మార్గంలో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో కలిపి మొత్తం 5,255 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

## తిరుమల సమాచారం



### స్వర్ణకవచంలో శ్రీభూసమేత మలయప్ప

**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి ఆలయంలో ఆగమోక్తంగా మూడు రోజులు జరిగిన జ్యేష్ఠాభిషేకం ఆదివారం శాస్త్రోక్తంగా ముగిసింది. చివరిరోజు ఆదివారం ఉభయదేవేరులతో కలిసి మలయప్ప స్వామి బంగారు కవచంలో పునః దర్శనమిచ్చారు. మళ్లీ జ్యేష్ఠాభిషేకం వరకు సంవత్సరం పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచంతోనే ఉంటారు. ఉదయం మలయప్పస్వామి ఉభయదేవేరులతో కలిసి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహా శాంతి హోమం నిర్వహించారు. మలయప్ప స్వామికి, దేవేరులకు స్నపనతిరుమంజనం చేపట్టారు. అనంతరం స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవలో స్వామి, అమ్మవార్లు బంగారు కవచంలో దర్శనమిచ్చారు. ఆ తరువాత ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు సదాశివరావు, జానకిదేవి, సుచిత్ర ఎల్లా, డిప్యూటీ ఇఒ లోకనాథం, అర్చకులు పాల్గొన్నారు.

# అన్ని రంగాలలోనూ ఎపి అగ్రగామి

## • అమరావతి నిర్మాణం వేగంగా పూర్తికావాలి: మంత్రి దుర్గేష్

**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** విజన్ ఉన్న నేత, సిఎం చంద్రబాబునాయుడు, డి.సిఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలోనూ అగ్రగామిగా దూసుకుపోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. అత్యంత నిష్ఠతో చాతుర్మాస దీక్షను స్వీకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీక్ష ఎటువంటి విఘ్నాలు లేకుండా, నిరాకంటంగా, దిగ్విజయంగా పూర్తికావాలని ఏడుకొండలస్వామినివేడుకున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, ప్రజల శ్రేయస్సు కోసం ఆయన పడుతున్న తపన, చేస్తున్న కృషి సంపూర్ణంగా సఫలీకృతం కావాలని, అందుకు ఆ భగవంతుని కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. మన ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా, అత్యంత వేగం పుంజుకుని, ప్రజలందరి ఆకాంక్షలకు ప్రతిరూపమైన అద్భుత రాజధానిగా త్వరలోనే సాకారం కావాలని స్వామివారి పాదాల చెంత ప్రార్థించినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర సంక్షేమం, ప్రజా రాజధాని నిర్మాణంపై శ్రీవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని ఆశిస్తున్నానన్నారు. ఆదివారం ఉదయం నిడదవోలు జనసేన నాయకులతో కలిసి తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం ఉదయం ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



# భక్తజనసంద్రంగా కాణిపాకం ఆలయం



**కాణిపాకం, జూన్ 28 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి ఆలయం భక్తుల రద్దీతో కాణిపాకం కిటకిటలాడింది. సాధారణంగా ఆలయంలో వారాంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శుక్ర, శని, ఆదివారాలు వరుస సెలవు రోజులు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. ఈమేరకు గత నాలుగు రోజులుగా ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అలాగే ఆలయ క్యూలైన్లు వద్ద భక్తులకు దేవస్థానం తరపున ఉచితంగా మజ్జిగ, త్రాగునీరు, సాంబారు అన్నం అందించారు. దీనితో పాటు వేసవి ఉపశమన చర్యల్లో భాగంగా కూలైన్లు వద్ద కూలర్లును ఏర్పాటు చేశారు.

# ఏడుకొండలస్వామీ... ఎక్కడున్నావయ్యా!

## - వెంకన్న దర్శనానికి కిలోమీటర్లు క్యూలు



**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** దాదాపు 1.50లక్షల మందికి పైగా భక్తులు తిరుమలకు తరలిరావడంతో ఆదివారం కూడా కొండంతా భక్తజనంతో నిండిపోయింది. శనివారం రాత్రికే సామాన్య భక్తులు శ్రీవారి దర్శనం కోసం 28 గంటలపైగా నిరీక్షించాల్సి వచ్చింది. ఆదివారం ఉదయానికి మరింతమంది భక్తులు దేశం నలుమూలల నుండి భారీగా తరలిరావడంతో ఐదు కిలోమీటర్లు దూరం క్యూలైన్లు వ్యాపించాయి. చంటిపిల్లలు, చిన్నారులతో పెద్దలతో, వృద్ధ భక్తులు గోవింద నామస్మరణతో క్యూలైన్లలోనే పడిగాపులు కాస్తున్నారు. ఆదివారం ఉదయానికి కూడా బాటగంగమ్మ ఆలయం వరకు భక్తుల లైన్లు వ్యాపించాయి. శనివారం అర్ధరాత్రి వరకు 85,582మంది భక్తులకు మహాలఘులో శ్రీవారి దర్శనం చేయించారు. 4.66లక్షల లడ్డూలు అమ్మకాలు జరిగాయి. కానుకల రూపంలో హుండీకి రూ.3.72 కోట్ల ఆదాయం చేకూరింది. ముందే ఊహించిన టిటిడి అధికారులు ఒక పథకం ప్రకారం వ్యూహాత్మకంగా ముందుగానే శ్రీవారి సేవకులను సిద్ధంచేసి వెలుపల క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, కాఫీ, పాలు అందించినా క్యూలైన్లలోనికి చేరుకోలేని భక్తులు ఖాళీస్థలాల్లో, కాటేజీల ప్రాంతాల్లో నిరీక్షించడం కనిపిస్తోంది. వీరికి కనీస సౌకర్యాలు అందక అవస్థలు పడుతున్నారు. ఇదే నేపథ్యంలో అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి క్షణకాల దర్శనం కోసం రోజుకు లక్షలాదిమంది భక్తులు దేశం నలుమూలల నుండి తరలివస్తున్నారు. వచ్చిన ప్రతి భక్తునికి సంతృప్తికర దర్శనమ్ కల్పించే మాట ఎలా ఉన్నా అనూహ్యంగా భారీగా భక్తులు తరలివస్తే ఆలయం వెలుపల కిలోమీటర్లు దూరం క్యూలైన్లు బారులు తీరి భక్తులు గంటల తరబడి నిరీక్షిస్తుండటం పరిపాటిగా మారింది. వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం సాధారణ రోజుల్లోనే లక్షమంది వరకు భక్తులు కొండపైకి వస్తే వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62 కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కో కంపార్టుమెంట్‌లో 400మంది లెక్కన 25వేల మంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఆ తరువాత వచ్చిన సామాన్యభక్తులు ఏటిసి, నారాయణగిరి ఉద్యానవనాల మీదుగా శిలాతోరణం, బాటగంగమ్మ ఆలయం, గోగర్భమ్ డ్యామ్ వరకు విస్తరించిన క్యూలైన్లలో నుండి ఆలయంలోనికి చేరుకోవాల్సి ఉంది. అదేగాక 60వేల మంది భక్తులు దాటితే ఇక క్యూలైన్లు చాంతాండంత దూరం వ్యాపిస్తాయి. సర్వదర్శనానికి రద్దీరోజుల్లో, వారాంతం రోజుల్లో ఏకంగా 30 గంటలు నిరీక్షించాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వేల కిలోమీటర్లు దూరం నుండి ఇష్టదైవమ్ దర్శనానికి వస్తున్న భక్తులకు వెలుపల క్యూలైన్లలోనే దేవుడు కనిపిస్తుంటాడు. ఈ విధానం లో మార్పు తీసుకువచ్చి సామాన్య భక్తులకు క్యూలైన్లు చేరువచేయడం ప్రస్తుతం టిటిడి అధికారులకు ఉన్న తక్షణ కర్తవ్యం. టిటిడి అధికారులు భక్తులు సంయమనం పాటించాలని, దర్శనం సమయం వచ్చేవరకు ఓపికతో ఉండాలని ప్రసార సాధనాల ద్వారా ప్రచారం చేయడం పరిపాటిగా మారింది. 18, 24గంటలు వరకు క్యూలైన్లలోకి రావద్దని విజ్ఞప్తి చేస్తుంటారు. అయితే ప్రత్యామ్నాయం మాత్రం ఆలోచన చేయడంలేదు.

### క్యూలైన్లు కుదింపు పై అధ్యయనం ఏదీ!?:

ఏడుకొండలవాడా నామస్మరణతో తిరుమలకు వస్తున్న సామాన్యభక్తులు ఆలయాన్ని చేరుకునేందుకు కిలోమీటర్లు దూరం విస్తరించిన క్యూలైన్లలో అవస్థలు తప్పడంలేదు. వైకుంఠమ్ కంపార్టుమెంట్లు నిండితే ఇక సామాన్యభక్తులు ఎక్కడ నుండి వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవాలనేది అర్థంకాని ప్రశ్నగా మారింది. ఇప్పటికీ తిరుమలేశుని దర్శనం కోసం టిటిడి అధికారులు రోజువారీగా ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలు, కాలినడక భక్తులకు దివ్యదర్శనమ్ దర్శనాలు, సామాన్యభక్తులకు సర్వదర్శన టైమ్‌స్లాట్ దర్శనాలు, సాధారణ సర్వదర్శనం దర్శనాలు అమలవుతున్నాయి. ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్లు లేని భక్తులు నేరుగా తిరుమలకు వస్తే గతంలో వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్ వద్ద క్యూలైన్లలో నుండి భక్తులు ఆలయంలోనికి చేరుకునే విధానం ఉండేది. ఇప్పుడు సామాన్య భక్తులు ఈ దరిదాపుల్లోకి కూడా రావడం లేదు. తిరుమలలో సులభంగా భక్తులు ఆలయంలోనికి చేరుకునేందుకు వీలుగా వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం అవసరమనేది భక్తుల నుండి వస్తున్న సూచనలు. 2014వ సంవత్సరంలోనే వైకుంఠమ్ 1కు సమీపంలో ఏటిసి వద్ద ప్రత్యేక ప్రవేశ దర్శనాల కాంప్లెక్స్‌ను, కాలినడక భక్తులకు దివ్యదర్శనం కాంప్లెక్స్‌కు అప్పటి టిటిడి ఇఒ డాక్టర్ సాంబశివరావు ముందుచూపుతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రెండు విధానాల్లో టిక్కెట్లు ఉన్న భక్తులు నేరుగా ఈ కాంప్లెక్స్‌ల వద్దకు చేరుకుని ఆలయంలోనికి వెళ్ళేవారు. అయితే ఇప్పుడు ఈ విధానం అమలు కాకపోగా కిలోమీటర్లు బారులుతీరిన క్యూలైన్లు సామాన్యభక్తుల ఓపికను పరీక్షించేలా టిటిడి అధికారులు వ్యవహరిస్తున్నారు. అధికారులు తమదైన రీతిలో విధానాల్లో మార్పులు తీసుకుంటూ సామాన్యభక్తులకు దర్శనంలో చుక్కలు చూపిస్తున్నారనేది విమర్శలు.

### వెంకన్న దర్శనానికి 24గంటలు

### నేడు విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

వరుసగా మూడురోజులు సెలవులు రావడం, వారాంతంతో మూడురోజులుగా తిరుమల భక్తజన సంద్రంగా మారింది. ఇష్టదైవమ్ దర్శనానికి భక్తులు భారీగా చేరుతున్నారు. ఆదివారం ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల బాటగంగమ్మ ఆలయం వరకు ఐదు కిలోమీటర్లు క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 24గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి పదిగంటల పైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. టైమ్‌స్లాట్ భక్తులకు పదిగంటల సమయం పడుతోంది. గదులు దొరకని భక్తులు ఆరుబయట, పార్కుల్లో, షెడ్లలో తలదాచుకుని విశ్రాంతి పొందుతున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 49వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 30వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. భక్తులు భారీగా తిరుమలకు చేరుకోవడంతో గదులు దొరక్క అవస్థలు తప్పడం లేదు. తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా ఉండటంతో అలిపిరి సెక్యూరిటీ తనిఖీ కేంద్రం వద్ద తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. భారీ రద్దీ వేళ ఒకేసారి వేలాది ప్రైవేట్ వాహనాలు అలిపిరి సెక్యూరిటీ చెక్ పోస్టు వైపు దూసుకురావడంతో, కపిలతీర్థం, లీలామహల్ బైపాస్ రోడ్లపై భారీ వాహనాల సందడి నెలకొంది.

# జులై ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు రూ.2711.79 కోట్లు విడుదల

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా జులై నెలలో 62,19,648 మంది పించన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసేందుకు రూ.2711.79 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలయింది. జులై 1వ తేదీ ఉదయం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఈ పెన్షన్లు పంపిణీ చేస్తామని, కొత్తగా మంజూరైన 7,792 మంది వితంతు లబ్ధిదారులకు జులై 1న పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం రూ.3.12 కోట్లను విడుదల చేసినట్టు మంత్రి తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు పెన్షన్ల కోసం ఈ నెల విడుదల చేసిన నిధులతో కలుపుకుని రూ.68,598.44 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని, నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నిధులను ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారులకు అందిస్తోందని మంత్రి కొండపల్లి తెలిపారు.

# దుర్గమ్మకి బంగారు ఆభరణాల కానుక



**ఇంద్రకీలాద్రి, జూన్ 28 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీ దుర్గమ్మకి విజయవాడకు చెందిన కొండవీటి ఈశ్వరరావు, మాధవి దంపతులు రు.5లక్షల విలువైన బొట్టు, భూలాకి, నత్తులను చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు ఆదివారం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**వేదోక్తంగా సూర్యఉపాసన:** దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా ఆదివారం సూర్య ఉపాసన జరిగింది. పండితులు వేదమంత్ర పఠనాలను గావిస్తూ శ్రీ స్వామివారికి పూజాదికాలు నిర్వహించారు. ఆదిత్య హృదయం, ద్వాదశాదిత్య మంత్రరాజం, అరుణపారాయణ, సూర్యాష్టకం, సూర్యస్తుతి పఠనలు గావిస్తూ సూర్యనమస్కారాలు సమర్పించారు. పూజాదికాలనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.



**నేడు గిరిప్రదక్షిణ:** శ్రీ దుర్గమ్మ వేంచేసియున్న ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షణ ఈనెల 29న సోమవారం ఉదయం 5.55 గంటలకు ప్రారంభవుతుందని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. పౌర్ణమి పర్వదినాన ఘాట్‌రోడ్డు వద్ద వున్న శ్రీ కామధేను అమ్మవారి ఆలయం వద్దనుండి గిరి ప్రదక్షిణ ప్రారంభమై కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితార, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా శ్రీ మల్లిఖార్జున మహా మండపమునకు చేరుకుంటుందన్నారు.

**భక్తుల విరాళాలు:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు రవీంద్రభారతి విద్యాసంస్థ చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ రు.1,11,111ల విరాళాన్ని ఆదివారం అందించారు. అలాగే దుర్గమ్మ ఆలయాభివృద్ధి కోసం ఆదివారం తెనాలికి చెందిన అట్లూరి బాపూజి రు.2,01,116ల విరాళం ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మని రాజ్యసభ ఎంపి లింగమనేని రమేష్ దర్శించుకున్నారు.

**దుర్గమ్మ ఆలయంలో పిల్లలకు పోలియోచుక్కలు:** దుర్గమ్మ ఆలయంలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమం జరిగింది. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ స్వయంగా పలువురు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.



వార్త

నువ్వు చెప్పిన ప్రతి దానికి తలాడించేవాడు తెలివి తక్కువ వాడైనా అవ్వాలి లేదా నీ భరతం పట్టేవాడైనా అయి ఉండాలి.

- జేమ్స్ టైల్

# పంచాయతీలను నిర్వీర్యం చేయొద్దు!

జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధించే దిశలో అడుగులు వేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పాలకపెద్దలు ఏనాటినుంచో చెప్తున్నా ఆచరణకు వచ్చేసరికి అవి కాగితాలకే మిగిలిపోతున్నాయి. స్వాతంత్య్రంవచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగానే ఉంది. వాస్తవంగా గ్రామస్వరాజ్యం గురించి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఎందరోనాయకులు ఇవే మాటలు చెప్తూనే ఉన్నారు. వాటి పటిష్టతే తమ ధ్యేయమని పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్నారు. వాటికి కేటాయించిన నిధులు, విధులు అప్పగిస్తామని ఎప్పటి కప్పుడు హామీ ఇస్తూనే ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవంగా చూస్తే గ్రామ సర్పంచులకు ఒక వ్యూహంప్రకారం ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చారు. అధికారంలేని ఉత్సవ విగ్రహాలుగా మార్చేందుకు ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమవంతు కృషి చేస్తున్నారని చెప్పొచ్చు. చివరకు స్వతంత్రంగా చీపురు కట్టకొనలేని దురదృష్ట పరిస్థితి తెచ్చి పెట్టారు. ఒకనాడు సర్పంచులకు ఉన్న ప్రాధాన్యత నేడు కానరావడం లేదనేది కాదనలేని వాస్తవం. ఇందుకు వారూ వీరు అనే దానికంటే ఎవరు అధికారంలో ఉన్నా పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారనే చెప్పక తప్పదు. గ్రామస్థాయిలో ఎన్నో కమిటీలను పెట్టి సర్పంచులను పక్కకు పెట్టారు. వారి ప్రమేయం లేకుండానే, వారికి తెలియకుండా ఎన్నో కార్యక్రమాలు గ్రామాల్లో జరిగే పరిస్థితి తీసుకువచ్చారు. ఒక రకంగా చెప్పాలంటే సర్పంచులకు సమాంతరంగా పదవులు సృష్టించారు. ఇలాంటి చర్యలతో ఉన్న ప్రాధాన్యత కూడా తగ్గిపోయింది. నేతల వాగ్దానాలతో ఏదో సాధించాలని సమాజానికి ఏదో చేయాలని నూతనోత్సహంతో ఎందరో యువకులు గత ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నో వ్యయప్రయాసలకులోనై సర్పంచులయ్యారు. అప్పట్లో గ్రామాభివృద్ధికి తాముచేసిన వాగ్దానాలు తీర్చేందుకు నడుం కట్టారు. ఈచట్టాల వలలో తాము ఏమీ చేయలేమనే విషయం అర్థంకావడానికి వారికి చాలాకాలం పట్టింది. అయితే గ్రామప్రజలకు తాము చేసే వాగ్దానాలు పూర్తి చేసేందుకు తలతాకట్టు పెట్టి అప్పోసొప్పో చేసి కొన్ని గ్రామాల్లో పనులు పూర్తిచేశారు. అయితే బిల్లులు ఎంతకూ రాకపోవడం, ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి, ఇంకొకపక్క అప్పులు, వడ్డీలు పెరిగి, మరొకపక్క గ్రామస్తుల నుండి తలవంచుకోలేక డజన్ మందికిపైగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. ఈ పరిస్థితుల్లో 2024 జనవరి 31తో వారి పదవీకాలం పూర్తయి మాజీ సర్పంచులైపోయారు. ఆలస్యంగానైనా ఎన్నికలు జరగడంతో కొత్తసర్పంచులు పదవులను అధిష్టించారు. మాజీ సర్పంచుల పరిస్థితి గురించి పట్టించుకునే వారే లేకుండాపోయారు. ముఖ్యంగా ప్రజాభివృద్ధికి వ్యయం చేసిన డబ్బు రాకపోవడం, వారుపడుతున్న వేదన అంతా ఇంతా కాదు. ఎప్పటికి బిల్లులు వస్తాయో చెప్పేవారు లేరు. అంతా అగమ్యగోచరంగా తయారయింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉస్నాబాద్ మండలం మహమ్మాదాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన సర్పంచుగా ఉన్న సమయంలో గ్రామాభివృద్ధి కోసం చివరకు మామిడితోట విక్రయించి వచ్చిన డబ్బు, మరికొన్ని అప్పులుచేసి అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ డబ్బులు ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెప్తున్నారు. ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ సర్పంచులు కరీంనగర్, ఉస్నాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఇప్పటికీ మరెందరో మాజీ సర్పంచులు తాము చేపట్టిన ప్రజాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి బిల్లుల కోసం కాలు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగడం పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకనాడు పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచులు అంటే ఎంతో గౌరవ మర్యాదలుండేవి. భారత దేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర ఉంది. చంద్రగుప్తుడి కంటేముందు నుంచి గ్రామాలు, గ్రామ వ్యవస్థ అమలులో ఉన్నట్లు ఆధారాలున్నాయి. అప్పుడు కూడా గ్రామసభలుండేవి. గ్రామసభల నిర్ణయమే కీలకం. వాటి నిర్ణయాలకు ఆనాటి రాజరికవ్యవస్థ ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేది. అలా ప్రాచీనకాలం నుండి గ్రామవ్యవస్థ ఏదోఒక రూపంలో మనదేశంలో కొనసాగుతూనే ఉన్నది. 1882లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్ రిప్పన్ స్థానిక సంస్థలకు ప్రతిపత్తి కల్పించారు. గాంధీ మహాత్ముడు ప్రవచించిన గ్రామస్వరాజ్యం లక్ష్యంలో స్థానిక సంస్థ పటిష్టత అన్నది ఒక ముఖ్యాంశం. భారత రాజ్యాంగంలో కూడా స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు ఇవ్వడానికి, ప్రభుత్వం చర్యలుతీసుకోవాలని స్పష్టంగా సూచించారు. 1952 నుంచి ఎన్నోకమిటీలు, మరెన్నో అధ్యయనాలు, మార్పులు, చేర్పులు ఈ పంచాయతీరాజ్ వ్యవస్థలో చేశారు. కానీ సర్పంచులకు రాజ్యాంగం కల్పించినఅధికారాలు ఇవ్వడానికి మాత్రం పాలక పెద్దలకు మనసు ఒప్పడం లేదు. రానురాను పంచాయతీరాజ్ వ్యవస్థను నామమాత్రంగా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎన్నిమార్పులు చేర్పులుచేసుకుంటున్నా, ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎందరు నేతలు మారినా అధికార వికేంద్రీకరణ మాత్రం ఆది నుంచి అధికారంలో ఉన్నపెద్దలు మోకాలొడ్డుతూనే ఉన్నారు. ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది లాంటిది. అందులో సర్పంచులు కీలకం. రాష్ట్రాలు మరిన్ని అధికారాలు కావాలని కేంద్ర ముందు గావుకేకలు పెడుతున్న నేతలు స్థానిక సంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వకపోవడం అత్యంత దురదృష్టకరం.



జీవితంలో సంతృప్తి పడటం నేర్చుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. అది చేతకాని వ్యక్తి దు:ఖానికి గురవుతూనే ఉంటాడు.

జార్జ్ ఇలియెట్


జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు. ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.

స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



## బంగారు గని యువతకు ఉపాధి

కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారు గని ప్రారంభం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. నిర్ధారిత బంగారు నిల్వలు ఉన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి కేంద్రంగా ఎంపిక చేయడం దూరదృష్టితో తీసుకున్న నిర్ణయంగా చెప్పవచ్చు. ఈ ప్రాజెక్ట రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిచ్చే అవకాశాన్ని కల్పిస్తుంది. అయితే ఈ ప్రాజెక్ట విజయాన్ని కేవలం బంగారం ఉత్పత్తితోకాకుండా, స్థానిక యువతకుకల్పించే ఉపాధి అవకాశాలతో కూడా అంచనా వేయాలి. జొన్నగిరి, పరిసర ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని యువతకు పారదర్శకంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే విశ్వాసం కల్పించడం అవసరం. ప్రాసెసింగ్ యూనిట్లలో ఉద్యోగాలు పొందాలంటే మైనింగ్ టెక్నాలజీ, ఖనిజ శుద్ధి, యాంత్రిక నిర్వహణ, విద్యుత్‌వ్యవస్థలు, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. దీనికోసం ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## రికార్డులు బ్రేక్

టెస్ట్ క్రికెట్‌లో ఒకప్పుడు అత్యధిక పరుగులు సాధించిన రికార్డు గవాస్కర్ పేరుమీద ఉండేది. ఆరికార్డును సచిన్ టెండూల్కర్ బ్రేక్ చేశాడు. సచిన్ రికార్డును విరాట్ కోహ్లి బ్రేక్ చేశాడు. 16ఏళ్ల వయసులో క్రికెట్ ఆడటం మొదలు పెట్టిన వారు టెండూల్కర్. 15ఏళ్లకే మైదానంలో అడుగు పెట్టి క్రికెట్ ఆడినవారు వైభవ్ సూర్యవంశి. టెన్నిస్, బాట్‌మెంటన్, బాక్సింగ్ ఇలా ఏఆటలోనైనా ఒకరి రికార్డును మరొకరెవరో బ్రేక్ చేస్తూనే ఉన్నారు. రికార్డులు అనేవి ఎప్పుడూ ఒకరి పేరు మీదేఉండవు. క్రీడల్లోనైనా, రాజకీయాల్లో నైనా, విద్య, వైద్యరంగాల్లోనైనా.

- శాస్త్రి, హైదరాబాద్

## ఎవరైతేమాకేంటి?

చిన్న జంతువైన కుందేలు అడవికి రాజైన సింహాన్ని తన తెలివితో బోల్తా కొట్టిస్తుంది. ఐకమత్యంతో పావురాలు వేటగాడి బారి నుంచి తప్పించుకుపోతాయి. బలమైన సర్పంపై చీమల దండు దాడి చేసిచంపి పడేస్తాయి. ఒక మనిషిని ఈగ ముప్పుతిప్పలుపెట్టి పగతీర్చుకున్నట్లు ఒక సినిమాలో చూపించారు. సమయస్ఫూర్తి, ఐకమత్యం, తెలివితేటలు ఉపయోగిస్తే మనిషేకాదు అతి చిన్న ప్రాణులు, పక్షులు కూడా తాము అనుకున్నవి సాధించగలవు.

- మిథునం, హైదరాబాద్

## చెప్పడానికే నీతులు

ఒక వ్యక్తి గాంధీ వద్దకు వచ్చి మావాడు బెల్లం ఎక్కువగా తింటున్నాడు నేను ఎంత చెప్పినా వినటం లేదు, మీరు చెబితేనన్నా వింటాడేమోనని మీ వద్దకు తీసుకొచ్చాను అన్నాడు. అప్పుడు గాంధీ ఆ వ్యక్తిని వారం రోజుల తరువాత రమ్మని పంపించాడు. వారం తరువాత వచ్చిన వ్యక్తి వెంట ఉన్న అతనితో బెల్లం ఎక్కువగా తినటం మంచిది కాదు ఆరోగ్యం పాడవుతుంది అందుకే నువ్వు బెల్లం తినటం ఈ రోజు నుంచే మానేసేయ్‌అన్నారు. ఈమాట అప్పుడే చెప్పేస్తే పోయేదికదా అంటే బెల్లం తినే అలవాటు నకూఉంది ఆ అలవాటు మానుకోవడానికి నాకు వారం రోజులు పట్టింది అని అన్నారు. ఈ రోజుల్లో ఇలాంటివారు నూటికొకరైనా ఉంటారా? నీతులు చెప్పేవారు నీతి సూక్తులు ఇతరులకే కాదు తమకు కూడా వర్తిస్తాయని గర్తించాలి.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

## కాంగ్రెస్‌పై కక్ష

జాతీయ విద్యామండలి వారు తొమ్మిదవ తరగతిలో 1975 లో ఇందిరాగాంధీ పెట్టిన ఎమర్జెన్సీ పై ఒక పాఠం పెట్టారు. ఇందిరాగాంధీ దుర్మార్గం అయిందని, కాంగ్రెస్ పాలన ఇలా ఉంటుందని విద్యార్థులకు చెప్పేందుకే బీజేపీ పాలకులు ఈ అంశము చేర్చారు. చాలా సంతోషం. కాంగ్రెస్ మీద కక్షతో ఇది పెట్టారు అని దేశ ప్రజల భావన. ప్రభుత్వాలు విద్యార్థులకు శాస్త్రీయమైన అంశాలను బోధించాలి. కానీ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత మతపరమైన, అశాస్త్రీయమైనఅంశాలనుపాఠ్యాంశాలుగాపెడుతుంది. ప్రోత్సహిస్తుంది. ప్రతిపౌరుడుఇలాంటివాటికివ్యతిరేకంగా పోరాడాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## శాంతి పవనాలు వీచేనా?

ఎట్టకేలకు హర్మూజ్ తెరుచుకుంది. ఉద్రిక్తతలు తగ్గాయి. గత కొదినద నెలలుగా పశ్చిమాసియా దేశాల యుద్ధం కారణంగా చాలా మంది కంటికి కునుకు లేకుండా గడిపారు. అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై అమానుషంగా విరుచుకుపడడంతో ప్రపంచ దేశాలు ఆందోళనలో పడ్డాయి. అధ్యక్షుడు ట్రంప్ ఒంటెద్దు పోకడలకు అగ్రదేశంలోనే నిరసనలు తారాస్థాయికి చేరాయి. మనదేశం దిగుమతి చేసుకుంటున్న గ్యాస్, పెట్రోలియం, ఎరువులు, ఇంధన సరఫరాలతో నౌకల రాకపోకలు పెరుగుతుండడం శుభసూచకం. ఎన్నిసార్లు ఎదురుదెబ్బలు తగిలినా మారని దేశాలు చాలా వరకు ఉన్నాయి.

-ఆర్. వెంకటేష్ చరణ్, బెంగళూరు

# జనాభాలో ఎక్కువ..ప్రగతి ప్రమాణాల్లో తక్కువ

'పౌరస్పృహ' సివిక్ సెన్స్ ఒక ఉద్యమంగా మారినప్పుడే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది. దేశం అభివృద్ధి చెందాలంటే పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. పాలితులు తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే పరువు పోయేది మనదే. నష్టం జరిగేది సమాజానికే. అందుకే కనీస 'పౌరస్పృహే ప్రగతికి తొలి మెట్టు' హక్కులు, బాధ్యతలు రెండు కళ్ల లాంటివి. వీటి నుంచి పాలకులకు, పాలితులకు మినహాయింపు లేదు. నేటి నుంచే మనం పౌరస్పృహతో మెలుగు దాం. ప్రశ్నించే పౌరులుగా, బాధ్యతగల భారతీయులుగా ఎదుగుదాం. అప్పుడు మాత్రమే జనాభాలోనే కాదు, ప్రగతి ప్రమాణాల్లోనూ ప్రపంచానికి ఆదర్శంగా నిలుద్దాం.


మేకిరి దామోదర్

భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. యువశక్తి, సహజ వనరులు, మేథో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నాయి. అయినప్పటికీ విద్య, ఆరోగ్యం, పారిశుద్ధం, రహదారి క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణ, ప్రశ్నించే స్వేచ్ఛ, అవినీతి నిర్మూలన, బాధ్యతాయుత పాలన, పౌర బాధ్యత వంటి అనేక ప్రగతి ప్రమాణాల్లో మనం ఆశించిన స్థాయికి చేరుకోలేకపోతున్నాం. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, పాలితుల నిర్లక్ష్యమూ అంతే. అందుకే ఈ పరిస్థితిని 'తిలా పాపం తలా పిడికెడు' అని చెప్పవచ్చు. ప్రజాస్వామ్యంలో పాలకులు, పాలితులు ఒకే రథానికి రెండు చక్రాలు. ఒకరు బాధ్యత తప్పినా, మరొకరు తమ విధిని విస్మరించినా సమాజం వెనుకబడుతుంది. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు, పౌర స్వేచ్ఛతోపాటు, ప్రతి పౌరుడి బాధ్యతాయుతమైన ప్రవర్తన కూడా అంతేముఖ్యం. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ పాలకుల, పాలితుల అత్యంత ప్రధాన బాధ్యత. ఇదే సమిష్టి ప్రగతికి మార్గదర్శి. ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో చాలా హామీలు మరుగున పడిపోతాయి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే కొందరు పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల మొదటి కర్తవ్యం. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయరాదు. అంతేకాదు జాగ్రత్తగా వినియోగించాలి. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపైక్రమం తప్పకుండా సమాధానం చెప్పాలి. ప్రజల సమస్యలను వినాలి. అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడాలి. పాలనలో జవాబుదారీ తనం లేకపోతే ప్రజల్లో విశ్వాసం తగ్గిపోతుంది. అభివృద్ధి మందగిస్తుంది. కాబట్టి మంచి పాలనకు రాజకీయ నాయకులు ప్రజల పట్ల నిబద్ధతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యాన్ని ఓటు తో పాటు, ఎన్నికైన ప్రభుత్వాల (నాయకుల) జవాబుదారీతనమే బలాన్ని చేకూర్చుతోంది. పాలకులను విమర్శించడం సులభం. కానీ మన బాధ్యతలను మనం ఎంతవరకు నిర్వర్తిస్తున్నామో కూడా ప్రశ్నించుకోవాలి. రోడ్లపై చెత్త వేయడం, ఎక్కడపడితే అక్కడ మూత్ర విసర్జన చేయడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం



చేయడం, క్యూలను పాటించకపోవడం, పన్నులు ఎగవేయడం వంటి చర్యలు మన సమాజంలో తరచూ కనిపిస్తున్నాయి. శుభ్రమైన దేశం కావాలని కోరుకునే మనమే చెత్తను రోడ్లపై పడేస్తే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది?. ప్రమాదాలు తగ్గాలని ఆశించే మనమే ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే భద్రత ఎలా పెరుగుతుంది?. ప్రభుత్వ ఆస్తులు ప్రజల సొత్తే అని తెలుసుకున్నా వాటిని నిర్లక్ష్యంగా చూస్తే నష్టం చివరకు ప్రజలకే కదా!. పౌరస్పృహ అనేది పెద్ద పెద్ద ప్రసంగాల్లో ఉండేది కాదు. అది మన రోజువారీ ప్రవర్తనలో కనిపించాలి. ఇంటి ముందు శుభ్రత పాటిం చడం, చెత్తను నిర్దిష్ట ప్రదేశంలో వేయడం, ట్రాఫిక్ నియమాలను గౌరవించడం, నీటిని పొదుపుగా వాడడం, చెట్లను కాపాడడం, ప్రజా ఆస్తులను సంరక్షించడం ఇవన్నీ మంచి పౌరుడి లక్షణాలు. స్వేచ్ఛ అంటే మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం కాదు? మన హక్కులను కాపాడుకుంటూనే, ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా ప్రవర్తించడమే. బాధ్యతతో కూడిన స్వేచ్ఛే నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతి. ప్రజాస్వామ్యంలో ప్రజలు కేవలం ఓటర్లు మాత్రమే కాదు దేశ నిర్మాణంలో భాగస్వాములు. ఎన్నికల రోజున ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరిశీలించడం, తప్పులను ఎత్తిచూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడి బాధ్యత. అదే సమయంలో ప్రశ్నించే హక్కుతో పాటు బాధ్యతాయుతమైన ప్రవర్తన కూడా అవసరం. 'ప్రభుత్వం చేయాలి' అనే భావనతో మాత్రమే సరిపోదు. 'నేను ఏమి చేయగలను?' అనే ఆలోచన కూడా ఉండాలి. సమాజంలోని ప్రతి వ్యక్తి తన బాధ్యతను నిర్వర్తించినప్పుడే అభివృద్ధి వేగవంతమవుతుంది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలను పరిశీలిస్తే అక్కడి ప్రజల్లో ఉన్న క్రమశిక్షణ, పౌరస్పృహ, చట్టాల పట్ల గౌరవం ప్రధాన కారణాలుగా కనిపిస్తాయి. అక్కడ శిక్షల భయం కంటే బాధ్యతాభావమే ఎక్కువగా పనిచేస్తుంది. మన దేశం కూడా అదే దిశగా అడుగులు వేయాలి. పిల్లలలో చిన్నప్పటి నుంచే పౌర బాధ్యతలను పెంపొందించాలి. కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి మంచి పౌరులను తయారు చేయాలి. మీడియా, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు కూడా ఈ విషయంలో చైతన్యం కల్పించాలి. 'పౌరస్పృహ' సివిక్ సెన్స్ ఒక ఉద్యమంగా మారినప్పుడే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది. దేశం అభివృద్ధి చెందాలంటే పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. పాలితులు తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే పరువు పోయేది మనదే. నష్టం జరిగేది సమాజానికే. అందుకే కనీస 'పౌరస్పృహే ప్రగతికి తొలి మెట్టు' హక్కులు, బాధ్యతలు రెండు కళ్ల లాంటివి. వీటి నుంచి పాలకులకు, పాలితులకు మినహాయింపు లేదు. నేటి నుంచే మనం పౌరస్పృహతో మెలుగు దాం. ప్రశ్నించే పౌరులుగా, బాధ్యతగల భారతీయులుగా ఎదుగుదాం. అప్పుడు మాత్రమే జనాభాలోనే కాదు, ప్రగతి ప్రమాణాల్లోనూ ప్రపంచానికి ఆదర్శంగా నిలుద్దాం. ●

# కృత్రిమ వనాలే పర్యావరణ సంరక్షణకు మార్గం


కింజరాపు అమరావతి

మన దేశం ప్రస్తుతం ఒక తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు ఎండలు మండిపోతుంటే మరోవైపు భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతున్నాయి. దేశంలో దాదాపు 96 మిలియన్ హెక్టార్ల భూమి అంటే మూడో వంతు భూభాగం వివిధ కారణాల వల్ల నిస్సారంగా మారి చవిటి నేలలుగా మారుతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో తీవ్రమైన నీటి ఎద్దడి, ఊపిరాడని కాలుష్యం ముంచుకొస్తాయి. జాతీయ అటవీ విధానం ప్రకారం దేశ మొత్తం భూభాగంలో 33శాతం అడవులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం అది కేవలం 21.73 శాతానికే పరిమితమైంది. మనం నిర్దేశిత లక్ష్యం కంటే చాలా వెనుకబడి ఉన్నాం. తగినంత విస్తీర్ణంలో అడవులు లేకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణం. దీనికి తక్షణ విరుగుడుగా ఆధునిక సాంకేతికతను మానవ ప్రయత్నాన్ని జోడించి, యుద్ధప్రాతిపదికన 'కృత్రిమ వనాలను' సృష్టించడం ఒక్కటే మన ముందున్న ఆచరణాత్మక మార్గం. మొక్కల పెంపకానికి, వనాల సృష్టికి మధ్య ఉన్న వ్యూహాత్మక వ్యత్యాసాన్ని గమనించాలి. ఇళ్ల ముందు, రోడ్ల పక్కన మొక్కలు నాటడం అనేది ఒక వ్యక్తిగత అలవాటు మాత్రమే. కానీ కృత్రిమ వనం అంటే ఒక నిర్దిష్ట ప్రణాళికతో సహజ పద్ధతిలో ఒక స్వయంసమృద్ధ అడవిని నిర్మించడం. ఇందులో కేవలం చెట్లు మాత్రమే ఉండవు. స్థానిక నేల స్వభావానికి సరిపోయే విభిన్న రకాల దేశీయ వృక్షాలను ఎంపిక చేస్తారు. అవి ఒకదానికొకటి తోడ్పడుతూ పెరిగేలా దట్టంగా నాటుతారు. కొద్ది కాలంలోనే ఇది పక్షులు, కీటకాలు, చిన్న జీవులకు నిలయంగా మారి, ఒక సహజ అడవిలా రూపాంతరం చెందుతుంది. చైనా హరిత ప్రాజెక్ట్ ద్వారా 35 మిలియన్ హెక్టార్ల ఎడారి భూమిని పచ్చని వనాలుగా మార్చింది. జపాన్, ఆఫ్రికా వంటి దేశాలు కూడా ఇదే వ్యూహంతో అద్భుతమైన విజయాలు సాధించాయి. మరి ఇంతటి సాంకేతికత అపారమైన మానవ వనరులు ఉన్న మన దేశం ఈ తరహా భారీ కృత్రిమ వనాల నిర్మాణంలో ఎందుకు ఆశించిన ఫలితాలను సాధించలేకపోతోందో అంతర్మథనం చేసుకోవాలి. మన దేశంలో పర్యావరణ స్పృహ లేకపోవడం సమస్య కాదు. చేస్తున్న ప్రయత్నాల్లో దీర్ఘకాలిక ప్రణాళిక లోపించడమే అసలు సమస్య. ఏటా వర్షాకాలంలో కోట్ల సంఖ్యలో మొక్కలు నాటుతున్నా అందులో ఎన్ని చెట్లుగా మారుతున్నాయనే దానికి సరైన నిఘా లేదు. కేవలం కాగితాల మీద సంఖ్యలు చూపించే రొటీన్ కార్యక్రమాల వల్లే మనం అంతర్జాతీయ స్థాయిలో పటిష్టమైన మార్పును తీసుకురాలేకపోతున్నాం. ప్రస్తుతం ఉన్న అటవీ శాఖకు స్మగ్లింగ్ అడ్డుకోవడం, వన్యప్రాణుల రక్షణ వంటి ఎన్నోఇతర బాధ్యతలు ఉన్నాయి. అందువల్ల, దేశవ్యాప్తంగా కృత్రిమ వనాలను అమలు చేయడానికి 'ప్రత్యేక జాతీయ యంత్రాంగం' ఒకదాన్ని ఏర్పాటు చేయాలి. దీనికి కేంద్ర ప్రభుత్వం భారీ బడ్జెట్ కేటాయించడంతో పాటు, ప్రతి రాష్ట్రం తప్పకుండా ఇందులో భాగస్వామ్యం కావాలి. నిర్దేశిత కాలంలో లక్ష్యాలను అందుకోకపోతే సంబంధిత అధికారులు జవాబుదారీ వహించేలా చట్టబద్ధమైన నిబంధనలు ఉండాలి. ఈ వ్యవస్థకు 'కృత్రిమ వనాల అభివృద్ధి' తప్ప మరో రెండవ లక్ష్యం ఉండకూడదు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పర్యావరణ సంక్షోభం మన ఆర్థిక వ్యవస్థను, సామాన్యుడి జీవనాన్ని ఒకేసారి దెబ్బతీస్తోంది. వాతావరణ మార్పుల వల్ల ఏటా రైతులు సగటున 20 నుండి 25శాతం వరకు పంట దిగుబడిని నష్టపోతున్నారు. మరోవైపు కాలుష్యం వల్ల వచ్చే రోగాల కారణంగా సామాన్యుడి సంపాదనలో సగానికి పైగా వైద్య ఖర్చులకే హారతవుతోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం సైతం ప్రతి ఏటా బడ్జెట్‌లో దాదాపు 90 వేల కోట్ల రూపాయల కంటే ఎక్కువ మొత్తాన్ని కేవలం ప్రజారోగ్యం, వైద్యపథకాల కోసమే కేటాయించాల్సి వస్తోంది. ఈనష్టాలన్నింటినీ అధిగమించడానికి కృత్రిమ వనాల ఏర్పాటు ఒక అద్భుతమైన మార్గంగా నిలుస్తుంది. ఈ వనాల సృష్టి కేవలం పర్యావరణాన్ని కాపాడటమే కాదు, దేశ ఆర్థిక రంగానికి సరికొత్త ఊపును ఇస్తుంది. వేల ఎకరాల్లో అడవులను నిర్మించే క్రమంలో భూమిని సిద్ధం చేయడం, మొక్కల పెంపకం, నిర్వహణ వంటి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది కొత్త ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. భవిష్యత్తులో ఈ వనాల ద్వారా లభించే కలప రహిత అటవీ ఉత్పత్తులు, ఔషధ మొక్కలు, తేనె వంటి వాటి ద్వారా స్థానిక పరిశ్రమలు వృద్ధి చెందుతాయి. అంతేకాకుండా, గ్లోబల్ స్థాయిలో కార్బన్ క్రెడిట్స్ మార్కెట్ ద్వారా దేశానికి భారీగా విదేశీ పెట్టుబడులు వస్తాయి. ఈ క్రమంలో ప్రజల పాత్ర అంటే కేవలం పెరట్లో మొక్క నాటడం కాదు. పౌర సమాజంగా, స్వచ్ఛంద సంస్థలుగా ఏర్పడి ఈ వనాలను అసాంఘికశక్తులు, పశువుల బారి నుండి కాపాడే పర్యవేక్షకులుగా బాధ్యత తీసుకోవాలి. మన దేశానికి ఇప్పుడు కావాల్సింది పర్యావరణ నినాదాలు కాదు. పక్కా ప్రణాళికతో కూడిన కృత్రిమ వనాల నిర్మాణం. ●

# భాషపై పట్టు అభ్యసనకు ఆయువుపట్టు


మల్లాడి శ్రీనగేష్

విద్యార్థులు తమ వయసు, తరగతి స్థాయి సామర్థ్యాలు సాధించడానికి ప్రతి సబ్జెక్టు చదవడానికి అవగాహన రావడానికి భాష దానిని క్షుణ్ణంగా చదవడం అనివార్యం. అనగా ప్రతి సబ్జెక్టులోనూ భాషను మనం ప్రధానంగా చూడాలి. అనగా చదువు మాతృభాషలో వున్నా ఆంగ్ల భాషలో వున్నా ఆ భాషపట్ల పిల్లలకు పట్టుఉండాలి. ఈపట్టుకు తొలిమెట్టు యనే ప్రాథమికస్థాయి నుండి మౌలిక భాషలో కనీససామర్థ్యాలను సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి. అందుకు కావలసిన వసతులను, వనరులను, వినూత్న విద్యార్థులకు స్నేహపూరిత వాతావరణంలో అభ్యసనను అందించడానికి పాఠశాల యాజమాన్యాలు కృషి చేయాలి. కోవిడ్కన్నా ముందు తర్వాత కూడా పాఠశాల విద్యార్థులు తరగతి స్థాయి విద్యాసామర్థ్యాలు సాధించలేకపోతున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే విద్యార్థులభవిష్యత్తు క్లిష్ట తరమోతుందని అనేకఅధ్యయనాలు వెల్లడిస్తునే వున్నాయి. అందుకే పాఠశాల యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఈదిశగా ప్రయత్నాలు ముమ్మరం చేయకపోతే బాలల బంగారు భవిష్యత్తు చిక్కుల్లో పడుతుందనేది వాస్తవం. విద్యాహక్కు చట్టం 2009 ద్వారా ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి పాఠశాలల నమోదు పెరిగింది తద్వారా నాణ్యమైన విద్యాప్రణాళికల్లో భాగంగా మౌలికసదుపాయాలు, ఉపాధ్యాయుల నియామకం చట్టబద్ధంగా కల్పించాల్సిన అవసరాలను గుర్తించాం. అక్షరాస్యత అంటే తెలియని కుటుంబాలలో బడివైపు చూడని, ఆర్థిక సాంఘిక పరిస్థితుల వలన బడిమానేసిన పిల్లలను అక్కున చేర్చుకొనేలా విద్యాహక్కు చట్టాన్ని 2010 నుండి అమలు చేస్తున్నాం. నాణ్యమైన తరగతులను నిర్మించడానికి నూతన విద్యావిధానం 2020ను కూడా రూపొందించుకున్నాం. కానీ ప్రతి విద్యార్థిలోనూ అభ్యసనాలేమి కనిపిస్తూనేఉంది. తరగతి వారీ సామర్థ్యాలు సాధించలేక సతమతమోతూనేవున్నారు. 5వ తరగతిలో ప్రవేశించినప్పటికీ 2వ తరగతి పాఠ్యంశాలను కూడా చదవలేని లేదా కనీస గణిత సామర్థ్యాలను సాధించలేని విద్యార్థుల పరిస్థితిని మనంతెల్లారాచూస్తూనే. మూడవతరగతిలో 10మందిలో 6 మంది విద్యార్థులు చిన్న కథలను కూడా చదవలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇదే పరిస్థితి అన్నితరగతుల్లోనూ పునరావృతం అవుతుంటే, ఆకోవకు చెందిన విద్యార్థులు చదువు కాలమంతా ఒక విషవలయంలో చిక్కుకుపోవడం అనివార్యమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈపరిస్థితులకు ప్రధాన కారణం ప్రాథమిక స్థాయిలో పునాది కొరవడడమా లేక సిలబస్పైపే పాఠశాలలు పరుగులెత్తడమాయనేది విశ్లేషించుకోవాలి. ఈమధ్యనేఎన్.సి.ఆర్.టి నిర్వహించిన సర్వే ప్రకారం సుమారు 75శాతం మంది 9వ తరగతి విద్యార్థులు చిన్నచిన్న కాన్సెప్టను కూడా అర్థం చేసుకోని దుస్థితిలో ఉన్నారు. సుమారు 47 శాతం 3వ తరగతి విద్యార్థులు చిన్నకథను కూడా చదివి అర్థం చేసుకోలేని స్థితిలో వున్నారు. 36 శాతం మంది విద్యార్థులు కూడికలు కూడా చేయలేకపోతున్నారు. 6 వ తరగతిలో సుమారు 34శాతం మంది స్థానికసంస్థలు, మార్కెట్,



ఇతర సంస్థల పనిగురించి కుడా తెలియపరచలేకపోయారు. 9వ తరగతి విద్యార్థులు సుమారు 55 శాతంమంది సోషల్ స్టడీస్‌లో రాజ్యాంగం గురించి, వాటి సూత్రాలు జాతీయ ఉద్యమాల గురించి వెల్లడించలేని పరిస్థితిలో వున్నారు. ఇక తెలుగు రాష్ట్రాలు పరిశీలిస్తే తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో 9వ తరగతిలో 17వ స్థానంలో, 6వ తరగతిలో 26వ స్థానంలోఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఎవరికైనా అవగతమయ్యేది, విద్యార్థికి చదవడం, విషయాన్ని అర్థం చేసుకోవడంలో ముందుంటే తద్వారా అభ్యసనా సామర్థ్యాలు సాధించంచడం చాలా సులభమని, దీనితో బాటు గణితంలో కనీసం చతుర్విధ ప్రక్రియలు సాధించడంలో ప్రవేశం ఉంటే విద్యార్థి ప్రగతి సులభతరమోతుందనేది వాస్తవం. ప్రతివిద్యార్థికి పూర్వ ప్రాథమిక స్థాయి నుండి పునాది ఏర్పరచాలి. పునాది కొరవడితే బాలల భవిష్యత్తు సమస్యల వలయంలో చిక్కుకుంటుంది. పిల్లలు భాషపై పట్టు సాధించినప్పుడే మిగతా సబ్జెక్టులపై తగిన ఫలితాలు చాలా సులభంగా సాధించగలుగుతారు. ప్రాథమిక విద్యలో అభ్యసనమంటే భాషపై తగిన పట్టు కలిగి ఉండడమేయని జాతీయ విద్యాచట్రం 2005 వక్కాణించింది. ఈ పునాదులపైనసే పిల్లల మానసిక అభివృద్ధి ఆధారపడి ఉంటుంది .విద్యార్థులు చదవడం అంటే ధారాళంగా చదవడం, చదివిన దానిని అర్థం చేసుకొని తన సొంత మాటల్లో చెప్పడం ప్రతిస్పందించడం తప్పనిసరి. ఈవిధంగా విద్యార్థికి భాషలో ఎక్కువ సామర్థ్యాలు సాధించడానికి భాషాభ్యాసానికి అవసరమైన అదనపు సామాగ్రి, బాలలసాహిత్యం, వార్తపత్రికలు, మాగజైన్లు చదివేలా విద్యార్థులను తప్పక ప్రోత్సహించాలి. ఈప్రక్రియ చదువులో ముందంజ వేయడానికి, వ్యక్తిగత అభివృద్ధికి విజ్ఞాన ప్రపంచంలో ఎన్నో కొంగ్రొత్త విషయాలను ఆకళింప చేసుకొని మెరుగైన భవిష్యత్తును గడించడానికి అవసరమైన విషయ విశ్లేషణ, సమస్యాత్మక విషయాలను పరిష్కరించే పరిజ్ఞానం, తనకుతాను ఎదగడానికి పత్రికలు గ్రంథాలయాలో అందుబాటులో వున్న పుస్తకాల పఠనం ఎంతో ఉపకరిస్తుంది. విద్యార్థి తన పాఠ్యంశాలకే పరిమితం కాకుండా ,గ్రంథాలయ పుస్తకాల పఠనం, పుస్తకసమీక్ష ఇవన్నీ నిత్యజీవితంలో అంచెంచెలుగాఎదగడానికి వెసులుబాటు కల్పించాలి. అయితే పిల్లలు పుస్తక పఠనచేయడానికి, తరచూ తాను చదివిన లేదా నేర్చుకున్న విషయాలను చర్చించడానికి, తెలియపరచడానికి ఉపాధ్యాయులు, తలిదండ్రులు, తగిన అవకాశాలను పిల్లలకు ఏర్పరచాలి. స్క్రీన్ చదువులు మొబైళ్లపై ఆధారపడుతున్నారు. పుస్తకాలను తాకి, పేజీలు తిప్పి విషయాన్ని అవగాహన చేసుకుంటూ చదివే ప్రక్రియకనుమరుగైపోయింది. దీనివలన కంటికి అలసట, ఒత్తిడి, అవసరమైన పాఠ్యంశాలపైనే దృష్టిసారించడం వంటి మార్కుల వేటలో పిల్లలు పాఠ్యంశాల పరిధి దాటి ప్రపంచాన్ని చూడలేకపోతున్నారు, చదవలేకపోతున్నారు, అంటే పిల్లల చదువును పాఠ్యప్రణాళిక స్థాయివరకే పరిమితం చేయడం జరుగుతున్నది. అదనంగా గ్రంథాలయ పుస్తకాలు చదవడం పాఠ్యప్రణాళికకు మించి పరిజ్ఞానం కోసం జీవననైపుణ్యాల మెరుగుదలను పెంపొందించే పుస్తక సామాగ్రి అందుబాటులో ఉండకపోవడం ఉన్నప్పటికీ వినియోగంలో సమయాభావం, ఇవన్నీ వెరసి పిల్లల అభ్యసనకు అవరోధాలు ఏర్పడ్డాయి. కారణాలేమైనప్పటికీ విద్యార్థులు తమ వయసు, తరగతిస్థాయి సామర్థ్యాలుసాధించడంలో బాగా వెనుకబడి వున్నారు. డిజిటల్ యుగంలో మొబైల్, టెలివిజన్‌వైపు తక్కువ సమయాన్ని కేటాయించేలా తలిదండ్రులు తమపిల్లలను చైతన్యపరచాలి. తద్వారా పిల్లల్లో పఠనాశక్తిని పెంపొందిందించడం ద్వారా అభ్యసనా సామర్థ్యాలతో ప్రగతి సాధించడం సుసాధ్యమోతుంది. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ప్రకృతి సంపదకు ఈశాన్యభారతం పుట్టినిల్లు

## మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జూన్ 28:** భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాలు ప్రకృతి సంపదకు, పర్యావరణ హితమైన జీవనశైలికి పుట్టినిల్లు. ఈ క్రమంలోనే పర్యావరణ పరిరక్షణ కోసం అక్కడి ప్రజలు సాగిస్తున్న విశేష కృషిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా పరిచయం చేశారు. ఆదివారం మన్‌కీబాత్ 135వ కార్యక్రమంలో అస్సాంలోని అరుదైన హర్గిలా పక్షి సంరక్షణ, అలాగే మేఘాలయలోని జీవన వేర్ల వంతెనల విశిష్టతను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. సమాజంలో ఉన్న అపోహలను తొలగిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడం ఎలాగో ఈ రెండు అంశాలు నిరూపిస్తున్నాయని ప్రధాని మోడీ ప్రశంసించారు. హర్ అంటే ఎముకలు, గిలా అంటే మింగడం అని అర్థం. ఈ పక్షులు ఎముకలను కూడా సునాయాసంగా మింగేయగలవు. సుమారు 1.5 మీటర్ల ఎత్తు, వింతైన రూపం కారణంగా వీటిని చూసి ప్రజలు భయ పడేవారు. అస్సాంలో కనిపించే అరుదైన హర్గిలా పక్షి సుదీర్ఘకాలంగా స్థానిక ప్రజల మూఢనమ్మకాలకు, భయాం దోళనలకు బలవుతూ వచ్చిందని మోడీ అన్నారు. నిజానికి పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచడంలో, చనిపోయిన జంతువుల అవశేషాలను తొలగించడంలో ఈ పక్షులు అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి. అయి నప్పటికీ, వీటి మనుగడను గుర్తించని స్థానికులు హర్గిలా పక్షుల గూళ్లు ఉన్న చెట్లను కూడా క్రూరంగా నరికివేసేవారు. కేవలం అజ్ఞానం వల్లే ఒక ఉప యోగకరమైన పక్షిజాతి వినాశనం అంచుకు చేరుకుందని ప్రధాని వివరించారు. ఈ గడ్డు పరిస్థితుల్లో ఆ పక్షుల రక్షణ కోసం జీవశాస్త్రవేత్త పూర్ణిమ దేవి బర్మన్ నడుం బిగించారు. సమాజంలో బలంగా నాటుకుపోయిన ఈ మూఢ నమ్మకాలను తొలగించాలని ఆమె గట్టిగా సంకల్పించారు. ఇందులో భాగంగా స్థానిక మహిళలను ఏకంచేసి, శాస్త్రీయ దృక్పథంతో వారికి అవగాహన కల్పించారు. పూర్ణిమ దేవి బర్మన్ చూపిన బాటలో నడిచిన మహిళలు క్రమంగా ఒక పెద్ద ఉద్యమంగా రూపాంతరం చెందారు. అలా ఏర్పడిందే ఈనాటి పర్యావరణ రక్షక దళం హర్గిలా ఆర్మీ. నేడు వేలాది మంది గ్రామీణ మహిళలు ఈ పక్షులను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. అస్సాం స్ఫూర్తిదాయక పక్షిసంరక్షణ ఉదంతాన్ని వివరించిన అనంతరం ప్రధాని మోడీ మేఘాలయ పర్వత శ్రేణులలోని అపురూపమైన జీవన వేర్ల వంతెనల వైపు దృష్టి సారించారు. మేఘాలయ అంటేనే మేఘాల నిలయమని, అక్కడి ప్రజల ఆత్మీయత పర్యాటకులను ఎప్పటికీ ఆకట్టుకుంటుందన్నారు. అయితే వీటన్నింటికంటే ఎంతో ప్రత్యేకమైనవి అక్కడి స్థానిక గిరిజనులు నిర్మించే సహజసిద్ధమైన వంతెనలని చెప్పారు. ఇవి కేవలం కొద్దిరోజుల్లోనో లేదా కొద్ది సంవత్సరాల్లోనో కట్టేవి కాదని, వీటి తయారీ వెనుక దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ,పట్టుదల దాగి ఉన్నాయని ప్రధాని వివరించారు.

**మట్టి వినాయక ప్రతిమలనే వాడాలి:** సెప్టెంబరులో వస్తున్న వినాయకచవితికి మట్టితో చేసి న విగ్రహాలను మాత్రమే వినియోగించాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా, బియా వ్రాకు చెందిన మహిళల కృషని ప్రధాని ప్రత్యే కంగా ప్రశంసించారు. తమ పరిసరాల్లో పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను చూసి నిరాశ చెంద కుండా, ఆ మహిళలు స్వయంగా రంగంలోకి దిగి ప్లాస్టిక్ వ్యర్థాలను, ఖాళీ బాటిళ్లను సేకరించడం ప్రారంభించారని ఆయన వివరించారు. ఈ ప్లాస్టిక్‌ను ఈకోబ్రిక్స్‌గా మార్చి, బహిరంగ ప్రదేశాలను సుందరీకరించడానికి ఉపయోగిస్తున్నారని, గత కొద్దినెలల్లోనే వందలకిలోల ప్లాస్టిక్ రీసైక్లింగ్ జరిగిందని మోడీ సంతోషం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కాలుష్యానికి కారణమైన ప్లాస్టిక్, నేడు నగర సౌందర్యానికి చిహ్నంగా మారడం ఆ మహిళల కృషికి నిదర్శనమని ప్రధాని కొనియాడారు. నీటినిపొదుపు చేద్దాం క్యాచ్ దరెయిన్ ప్రకృతిని కాపాడుకోవడంలో భాగంగా,కొనసాగుతున్న క్యాచ్ ద రెయిన్‌ప్రచారంలో ప్రజలందరూ భాగ స్వాములుకావాలని ప్రధాని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మోడీ దేశ ప్రజలను కోరారు.




## బంగారం కొనవద్దన్న పిలుపునకు అద్భుత స్పందన

### ప్రజలకు ప్రధాని మోడీ కృతజ్ఞతలు

బంగారం కొనుగోళ్లపై దేశ ప్రధాని మోదీ మరోసారి స్పందించారు. తన 135వ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు తాను ఇచ్చిన పిలుపునకు సామాన్య ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా, దేశ ఆర్థిక స్థిరత్వం కోసం విలాసవంతమైన ఖర్చులు, ముఖ్యంగా బంగారం కొనుగోళ్లను కొంతకాలం వాయిదా వేసుకోవాలని మోడీ చేసిన విజ్ఞప్తిని ప్రజలు బాధ్యతాయుతంగా స్వీకరించారని వెల్లడించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు మోడీ కృతజ్ఞతలు చెప్పారు విదేశీ పర్యటనలను వాయిదా వేసుకోవడం, ఇంధన ఆదా కోసం సొంత వాహనాల వినియోగాన్ని తగ్గించు కోవడం వంటి చర్యలను ప్రజలు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారని మోడీ తెలిపారు. ఈ సానుకూల ధోరణి దేశ విదేశీ మారక నిల్వలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని పేర్కొన్నారు. బంగారం, ఇంధనం వంటి అత్యవసర దిగుమతులపై భారం తగ్గించడంద్వారా రూపాయి విలువను సుస్థిరం చేయాలనేదే ఈ ప్రయత్నం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ప్రధాని విజ్ఞప్తి తర్వాత మార్కెట్లో గణనీయమైన మార్పులు కూడా వచ్చాం. 10న 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,53,140 ఉండగా, ఆదివారం నాటికి అది రూ. 1,39,873కి పడిపోయింది. అదేవిధంగా కేజీ వెండి ధర రూ. 2,62,350 నుంచి రూ. 2,16,541కి తగ్గింది. ఈ స్వల్ప వ్యవధిలోనే బంగారం ధర రూ. 13,267, వెండి ధర రూ. 45,809 మేర తగ్గడం విశేషం.



## అమర్‌నాథ్ యాత్రకు సహకరించాలి

### ముస్లిం సంఘాల నేతలతో లెఫ్టినెంట్ గవర్నర్ సమావేశం

**శ్రీనగర్, జూన్ 28:** హిందువులు పవిత్రంగా భావించే అమర్‌నాథ్ యాత్ర మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఈ యాత్రకు కాశ్మీరీ ముస్లిం నేతలతోపాటు పౌర సంఘాల నేతలు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ యాత్ర విజయవంతం కావాలని వారంతా ఆకాంక్షించారు. తాము ఈ యాత్రికుల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని అన్నారు. యాత్ర సజావుగా సాగేందుకు యాత్రికులకు సహకారం అందించేందుకు అన్ని విధాల సహకరిస్తామని వారు స్పష్టం చేశారు. ఆదివారం శ్రీనగర్‌లో అమర్‌నాథ్ యాత్ర పుణ్య క్షేత్ర బోర్డ్ చైర్మన్, జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి కాశ్మీర్ ముస్లిం నేతలతోపాటు పౌర సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో పాల్గొని అమర్‌నాథ్ యాత్రకు మద్దతు ప్రకటించిన వారిపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రశంసలు కురిపించారు. వారంతా ఆధ్యాత్మిక సంప్రదాయ సంరక్షకులని, దేశ రక్షకులని అభివర్ణించారు. తరతరాలుగా ఈ అమర్‌నాథ్ యాత్ర ఆధ్యాత్మిక వారసత్వంగా కొనసాగుతోందన్నారని గుర్తు చేశారు. ఈ యాత్రకు మరోసారి భక్తులను స్వాగతించడానికి తాము సిద్ధమవుతున్నామని తెలిపారు. అలాంటి తరుణంలో మీ మార్గదర్శనం, సహకారం కోసం మీలో ప్రతి ఒక్కరి కోసం తాను ఎదురు చూస్తున్నానని తెలిపారు. ప్రతి యాత్రికుడు గౌరవం, భద్రతతోపాటు తాము కూడా ఈ ప్రాంతానికి చెందిన వారమనే భావన పెంపొందేలా చూడటంలో మీ పాత్ర అత్యంత కీలకమని ఈ సందర్భంగా లెఫ్టినెంట్ గవర్నర్ సిన్హా వ్యాఖ్యానించారు. తమ హోటళ్లలో బస చేసే అమర్‌నాథ్ యాత్రికుల నుంచి వసూలు చేసే ఛార్జీల్లో 30 శాతం తగ్గిస్తామని హోటల్ యజమానులు ప్రకటించారు. వారు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. జులై 3న ఈ యాత్ర ప్రారంభం కానుంది. ఆగస్టు 28వ తేదీతో ఈ యాత్ర ముగియనుంది. ఈ యాత్ర కోసం ప్రభుత్వం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. భద్రత కోసం పోలీసులు, సైన్యం తోపాటు 670 కంపెనీల పారా మిలిటరీ బలగాలను మోహరించనుంది.

## కేంద్ర మంత్రికి రూ.99లక్షలు పైగా సబ్సిడీ..

**న్యూఢిల్లీ,జూన్ 28:** కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయమంత్రి భగీరథ్ చౌదరి రాజస్థాన్‌లో తన దోసకాయల సాగు కోసం రూ.99 లక్షలకుపైగా మొత్తాన్ని సబ్సిడీగా పొందారు. ఈ రాయితీని ఆయన తాను ఉపాధ్యక్షునిగా పని చేస్తున్న బోర్డునుంచే పొందడం విశేషం. ఒక ఆంగ్లపత్రిక ప్రచురించిన వివరాల ప్రకారం కూచామన్ జిల్లా, పీహ్ గ్రామంలో నేషనల్ హార్టికల్చర్ బోర్డ్(ఎన్‌హెచ్‌బీ), వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వం వారి సహాయంతో అనే బోర్డు కలిగిన ఒక విస్తారమైన వ్యవసాయ క్షేత్రం ఉంది. దానిపై లబ్ధిదారుని పేరు దగ్గర మిస్టర్ భగీరథ్‌చౌదరి అని, సబ్సిడీ మొత్తం 50శాతం అంటే రూ.99, 60,000 అని స్పష్టంగా రాసి ఉంది. గత ఏడాది దేశవ్యాప్తంగా అమోదం పొందిన 467 ప్రాజెక్టులలో మంత్రి ప్రాజెక్టు ఒకటి కావడం విశేషం. కేంద్ర మంత్రికి రాయితీ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తిన వేళ భగీరథ్ చౌదరి మాట్లాడుతూ తాను మంత్రి కాకముందే తన దోసకాయల సాగు ప్రాజెక్టు కోసం ప్రభుత్వ పథకం కింద రూ.99.03 లక్షల సబ్సిడీని పొందినట్లు తెలిపారు. ఈ విషయంలో తానేమీ దాచలేదని, తనపై వస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. కాగా ఈ ఉదంతంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా సోషల్‌మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ధర్మం ఇంటి నుంచే మొదలవుతుందంటారు. కానీ బీజేపీకి మాత్రం సబ్సిడీ ఇంటి నుంచే మొదలవుతుందని వ్యాఖ్యానించారు. మంత్రి చేపట్టిన ప్రాజెక్టు వ్యయం రూ.1.99 కోట్లు. ఇందులో లబ్ధిదారు వాటా రూ. 49.8 లక్షలు. మంత్రి ఈ ప్రాజెక్టు కోసం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.1.49 కోట్లు రుణం తీసుకున్నారని ఆ వార్తకథనంలోఉంది ఈ ఉదంతంపై మంత్రి కార్యాలయ సహాయకుడు స్పందిస్తూ, ఈ ప్రాజెక్టు వివరాలను త్వరలోనే ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు.




## ఈ యేడాదే బంగ్లాదేశ్‌కు వెళ్లిపోతా: మాజీ ప్రధాని షేక్ హసీనా



**న్యూఢిల్లీ,జూన్ 28:** రెండేళ్ల క్రితం బంగ్లాదేశ్ లో తలెత్తిన జెన్ జీ తిరుగుబాటు తర్వాత దేశం వదిలి భారత్ కు తరలివచ్చేసిన మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పటి నుంచీభారత్‌లో ప్రవాసంలో ఉంటున్నారు. తాను ప్రధానిగా ఉన్నప్పుడు భారత్ లో సానుకూల సంబంధాలు నెరిపిన చరిత్ర ఉన్న హసీనాను మన ప్రభుత్వం శరణార్థిగా పరిగణించి ఆశ్రయం ఇచ్చింది. బంగ్లాదేశ్ లో ఆమెపై పలు కేసులు ఉన్నా, వాటి విచారణ కోసం ఆమెను అప్పగించాలని అక్కడి ప్రభుత్వం కోరినా భారత్ మాత్రం పట్టించుకోలేదు. అయితే హసీనా ఇప్పుడు స్వదేశం తిరిగి వెళ్లడంపై క్లారిటీ ఇచ్చారు. తాను ఈ ఏడాదే స్వదేశానికి తిరిగి వెళ్లిపోతానని తాజాగా ఇచ్చిన టివి ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు. తన పార్టీ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక శక్తి అని ఆమె స్పష్టం చేశారు. మైనారిటీలపై ఎలాంటి దాడి అయినా బంగ్లాదేశ్ స్వాతంత్రంపై దాడితో సమానమని హసీనా తేల్చి చెప్పారు. దేశవ్యాప్త నిషేధాన్ని ధిక్కరిస్తూ అవామీ లీగ్ తాజాగా తన 77వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ సందర్భంగా డజన్ల కొద్దీ కార్యకర్తలు అరెస్టు అయ్యారు. తన తిరుగు ప్రయాణం అనేది వ్యక్తిగత ఆశయానికి సంబంధించిన విషయం కాదని, ఇది బంగ్లాదేశ్ ప్రజల రాజకీయ హక్కులు, ప్రజాస్వామ్య పునరుద్ధరణ, చట్ట పాలన, మన విముక్తి పోరాట స్ఫూర్తి వంటి అత్యంత కీలకమైన అంశాలతో ముడిపడి ఉందని టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో హసీనా తెలిపారు. తాను అధికారం కోసం రాజకీయాలు చేయ నని, బంగ్లాదేశ్ ప్రజల సంక్షేమం కోసం, సోనార్ బంగ్లా (సువర్ణ బంగ్లా)ను నిర్మించాలన్న జాతిపిత బంగాబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ కలను సాకారం చేయడం కోసం రాజకీయాలు చేస్తానని తెలిపారు. తనకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పు న్యాయమైనది కాదన్నారు.

## లోహ్‌గఢ్ కోటలో కేతన్ హత్య సీన్ రీకన్‌స్ట్రక్షన్



**పూణె,జూన్ 28:** మహారాష్ట్రలోని పూనేకు చెందిన వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసు విచారణలో ప్రధాన నిందితురాలు సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి ప్రస్తుతం పోలీసు కస్టడీలో విచారణ ఎదుర్కొంటున్నారు. దీనిలో భాగంగా సియా గోయల్‌ను పోలీసులు ఆదివారం ఉదయం 6.30 గంటలకు లోహగఢ్ కోటకు తీసుకువచ్చారు. పర్వతంపైనున్న ఈ కోట నుంచే కేతన్‌ను సియా తోసేసి చంపేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హత్యకు సంబంధించిన వివరాల్ని సేకరించేందుకు పోలీసులు కోట వద్ద సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. సియాను తీసుకెళ్లి అక్కడ ఆమెఎలా హత్య చేసిందో వివరంగా తెలుసుకున్నారు. ఈ సీన్ రీక్రియేషన్‌లో భాగంగా మనిషిని పోలిన ఒక బొమ్మను కూడా పోలీసులు పర్వతంపైనుంచి తోసేశారు. ఇక, పోలీసు కస్టడీలో విచారణలో సియా, చేతన్‌లు కీలక విషయాల్ని తెలిపారు. కేతన్ హత్యకు ముందు లోహగఢ్ కోటలో మర్డర్ రిహార్సల్స్ కూడా చేసినట్లు తేలింది. హత్య చేయడానికి కొద్ది రోజుల ముందు ఇద్దరూ కోటకు వెళ్లి ఏ ప్రదేశం నుంచి తోసేస్తే ఈజీగా చంపవచ్చు అనేది పరిశీలించారు. అనేక ప్రదేశాల్ని పరిశీలించి, అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నారు. అతడిని తోసేసిన తర్వాత అది హత్యలా కాకుండా ప్రమాదంగా అనిపించేలా ఏ జాగ్రత్తలు తీసుకోవాలో ముందే ప్లాన్ చేశారు. కేతన్ హత్య అనంతరం పోలీసులు విచారణలో అడగబోయే ప్రశ్నలు ఏంటి వాటికి ఏం సమాధానంచెప్పాలో కూడాముందుగానే సిద్ధమయ్యారు. హత్య చేసే విధానాల గురించి గూగుల్‌లో, యూట్యూబ్‌లో సెర్చ్ చేశారు. సియా, చేతన్ కలిసి చాలా పకడ్బందీగా హత్యకు ప్లాన్ చేశారు.




### రాజకీయాలంటే పార్ట్‌టైమ్ బాధ్యతలు కాదు

#### రాహుల్‌పై మాజీ రాష్ట్రపతి ప్రణబ్ కుమార్తె చురకలు

**న్యూఢిల్లీ,జూన్ 28:** మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠా ముఖర్జీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయాలంటే కొద్ది రోజులు ప్రజల్లో ఉంటూ,మళ్లీ మాయమయ్యే వ్యవహారం కాదని, రాజకీయం 24 గంటలు, ఏడాది పొడవునా కొనసాగే ఫుల్‌టైమ్ బాధ్యత అని ఆమె అన్నారు. ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 2014లో రాహుల్ గాంధీ కాంగ్రెస్ ముఖ్య నేతగా ఉన్నప్పటి నుంచి పార్టీ వరసగా ఎన్నికల్లో ఓటములు చవిచూస్తోందని, ఇది ఆయన నాయకత్వ వైఫల్యంగా భావించాల్సిందే అని పేర్కొన్నారు.

## 'కన్యత్వం' పోతే బాధితురాలిని తప్పుబట్టలేం




### అత్యాచార కేసులో అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు

#### నిందితుడు 10రోజుల్లోపు లొంగిపోవాలని ఆదేశం

**ప్రయాగ్‌రాజ్, జూన్ 28:** అత్యాచార బాధితురాలి వాంగ్మూలం విశ్వసనీయంగా ఉన్నట్లయితే, ఆమె హైమెన్ (కన్యత్వ పొర) చిరిగిపోయి ఉండటం అనే కారణంతో నిందితుడికి 'సందేహ ప్రయోజన్న' లభించదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. అత్యాచారం అనేది ఒక చట్టపరమైన పదం తప్ప వైద్యపరమైన పదం కాదని కూడా కోర్టు పేర్కొంది. 1982లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి, అత్యాచార నేరస్తుడికి 1983లో విధించిన శిక్షను (నేర నిర్ధారణ, మూడేళ్ల జైలు శిక్ష) కోర్టు సమర్థించింది. క్రీడలు, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, గుర్రపు స్వారీ, కఠినమైన శారీరక శ్రమ లేదా ప్రమాదవశాత్తు జరిగే గాయాల వంటి వివిధ కారణాల వల్ల హైమెన్ చిరిగిపోయే అవకాశం ఉందని జస్టిస్ సంతోష్ రాయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. కొంతమందికి పుట్టుకతోనే హైమెన్ రంధ్రం కలిగి ఉండటం లేదా అసలు లేకపోవడం వంటివి జరుగుతాయని, మరికొందరిలో అది చాలా సాగే గుణం కలిగిఉంటుందని కోర్టు పేర్కొంది. కాబట్టి, ఇటువంటి వైద్యపరమైన అంశాలు బాధితురాలి విశ్వసనీయమైన వాంగ్మూలాన్ని అధిగమించలేవని కోర్టు అభిప్రాయపడింది. అత్యాచారం సాధారణంగా రహస్య వాతావరణంలో జరుగుతుందని, అంటే స్వతంత్ర ప్రత్యక్ష సాక్షులు దొరికే అవకాశం ఆచరణలో దాదాపు ఉండదని కూడా కోర్టు నొక్కి చెప్పింది. రాకేష్ అప్పటికే బెయిల్‌పై ఉన్నాడు. జూన్ 23నాటి తన తీర్పులో, హైకోర్టు ఆ దోషిబెయిల్ బాండ్లను తక్షణమే రద్దు చేసింది. తన శిక్షలో మిగిలిన భాగాన్ని అనుభవించడానికి 10 రోజుల్లోగా విచారణ కోర్టు (ట్రయల్ కోర్టు) ముందు లొంగిపోవాలని అతన్ని ఆదేశించింది.

## పెళ్లికి తిరస్కరించిందని మహిళపై దాడి, ఇంటికి నిప్పు

### నిందితుడు అరెస్టు

**భువనేశ్వర్, జూన్ 28:** ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో ప్రేమ ప్రతిపాదనను తిరస్కరిం చినందుకు ఒక వ్యక్తి మహిళ ఇంటికి నిప్పు పెట్టడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. నిందితుడిని అరెస్టు చేశామని, తదుపరి విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన సుందర్‌గఢ్ జిల్లాలోని బిస్రా బ్లాక్ పరిధిలోని ఒక గ్రామంలో జరిగింది. ప్రాథమిక విచారణ ప్రకారం, నిందితుడు ఆ మహిళ పట్ల తీవ్ర వ్యామోహం పెంచుకున్నాడు. ఆమె తన వివాహ ప్రతిపాదనను తిరస్కరించడంతో దాడికి పాల్పడ్డాడు. ఆమె గదిలో నిద్రిస్తుండగా, నిందితుడు కిటికీ గుండా పెట్రోల్ పోసి,ఆమెను చంపాలనే ఉద్దేశంతో నిప్పు పెట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. మంటలు చెలరేగడానికి కొద్ది క్షణాల ముందు నిందితుడు రజత్ కిరోను కిటికీ దగ్గరచూసినట్లు బాధితురాలి తండ్రి జెనా టోప్పో ఆరోపించారు. వివాహ ప్రతిపాదనను తిరస్కరించినప్పటి నుండి కిరో తన కుమార్తెను పలుమార్లు వేధించాడని కూడా ఆయన తెలిపారు. మహిళ ఆర్త నాదాలు విని, మంటలను గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని, కాలిపోతున్న ఇంటి నుండి ఆమెను రక్షించి రూర్కెలాలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు తీవ్రమైన కాలిన గాయాలయ్యాయని (సుమారు 40 శాతం వరకు అని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి), ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. పోలీసులు శాస్త్రీయ పరిశోధన బృందంతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించారు. నిందితుడికి ఆ మహిళ పట్ల ఉన్న వ్యామోహమే ఈ దాడికి కారణమని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. "నిందితుడిని అరెస్టు చేశాము. అతన్ని కోర్టులో హాజరు పరుస్తాము. తదుపరి విచారణ కొనసాగుతోంది" అని పోలీసులు తెలిపారు.



## కరాచీలో భీకర ఉగ్రదాడి

### నలుగురు సైనికులు మృతి

#### ఆరుగురు ఉగ్రవాదులు కూడా ఖతం

**కరాచి,జూన్ 28:** పాకిస్థాన్‌లోని అతిపెద్ద నగరమైన కరాచీలో శనివారం భీకర ఉగ్రదాడి జరిగింది. నగరంలోని సింధ్ రేంజర్ల స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడి, కాల్పుల ఘటనలో నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమవగా, మరొకరిని సజీవంగా పట్టుకున్నారు. కరాచీలోని గులిస్తాన్‌ఎజౌహార్ ప్రాంతంలో ఉన్న సింధ్ రేంజర్ల ప్రధాన కార్యాలయంపైకి ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో దూసుకొచ్చారు. స్థావరాన్ని ఢీకొట్టి వాహనాన్ని పేల్చివేసిన వెంటనే, మిగిలిన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. అప్రమత్తమైన భద్రతా బలగాలు వెంటనే ఎదురుదాడికి దిగడంతో ఆ ప్రాంతం మొత్తం కాల్పుల మోతతో దద్దరిల్లింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక పోలీసు బలగాలు, కమాండోలను రంగంలోకి దించారు. ఈ దాడికి తామే బాధ్యులమని తెహ్రీక్‌ఎతాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) నుంచి విడిపోయిన జమాత్‌ఉల్‌అహ్రార్ అనే ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది. పాకిస్థాన్‌లో భద్రతా బలగాలపై ఇటీవలి కాలంలో దాడులు పెరిగిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈదాడిపై సింధ్ ముఖ్యమంత్రి సయ్యద్ మురాద్ అలీషా తీవ్రంగా స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, కూంబింగ్ నిర్వహిస్తు న్నాయి. ఈ ఘటనలో సామాన్య పౌరులెవరూ గాయపడలేదని అధికారులు ప్రాథమికంగా తెలిపారు.

## 15వేల మందిని చంపే టార్గెట్‌తోనే క్యాప్సూల్స్ తెచ్చా..

### మొహర్రం వేడుకల్లో పట్టుబడిన నిందితుడు వెల్లడి



**ముంబయి,జూన్ 28:** మహారాష్ట్ర రాజధాని ముంబైలో మొహర్రం ఊరేగింపు సందర్భంగా భారీ విషాదం త్రుటిలో తప్పింది. ఊరేగింపులో పాల్గొన్న వారికి విషపూరిత క్యాప్సూల్స్ పంపిణీ చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి సుమారు 14,900 క్యాప్సూల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు క్యాప్సూల్స్‌ను నొప్పి నివారణ మాత్రలు, రోగనిరోధక శక్తిని పెంచే మందులని చెప్పి ప్రజలకు అందజేశాడు. ఆ క్యాప్సూల్స్‌లో జింక్ ఫాస్ఫైడ్ అనే అత్యంత విషపూరిత రసాయనం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ రసాయనం సాధారణంగా ఎలుకల మందులో ఉపయోగిస్తారు. ఈ క్యాప్సూల్స్ తీసుకున్న 11 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే సకాలంలో హాస్పిటల్‌లో చేర్చడంతో ప్రాణాలతో బయటపడ్డారు. తాను సుమారు 15 వేల మందిని చంపాలనుకున్నట్లు నిందితుడు ఫయాజ్ ప్రేమ్‌జీ చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. అతడు ముందుగానే 30 వేల ఖాళీ క్యాప్సూల్స్, 50 కిలోల జింక్ ఫాస్ఫైడ్ ఆర్డర్ చేసినట్లు దర్యాప్తులో బయటపడింది. అతడి ఉద్దేశం, ఈ ఘటన వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ భారీ ప్రమాదాన్ని ముగ్గురు మహిళా వాలంటీర్లు పసిగట్టి అడ్డుకోగలిగారు. నిందితుడు అనుమానాస్పదంగా క్యాప్సూల్స్ పంచుతుండటాన్ని గమనించిన వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం లౌడ్‌స్పీకర్ ద్వారా ప్రజలకు ఆ క్యాప్సూల్స్ తీసుకోవద్దని హెచ్చరికలు జారీ చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నిందితుడు ముందుగా ఒకరోజు హోటల్‌లోనే ఉండి ఈ క్యాప్సూల్స్ తయారు చేసాడని దర్యాప్తులో అంగీకరించాడు.


## త్రిశూర్‌లో సింథటిక్‌డ్రగ్స్ ముఠా అరెస్టు..

### 308 గ్రాముల ఎంఎండిఎ స్వాధీనం

**త్రిశూర్,జూన్ 28:** కేరళలోని త్రిస్సూర్ జిల్లాలో భారీ ఎత్తున సింథటిక్ డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఇద్దరు మహిళలు సహా మొత్తం ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 308 గ్రాముల నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో పట్టుబడిన అతిపెద్ద డ్రగ్స్ కేసుల్లో ఇది ఒకటని అధికారులు తెలిపారు. వాణియంపార ప్రాంతంలో యాంటీ నార్కోటిక్ స్పెషల్ యాక్షన్ ఫోర్స్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఈముఠా వ్యవహారం బయటపడింది. పాలక్కాడ్ నుంచి వస్తున్న స్విఫ్ట్ కారును ఆపి సోదా చేయగా, అందులో ఉన్న ఒక మహిళ తన రహస్య భాగాల్లో రెండు గ్రాముల ఎండీఎంఏను దాచి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో కారులోని షిఫాస్, విద్య, జిష్ణు, శ్రీలక్ష్మిలను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిని విచారించగా, ఈ నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు షిఫాస్ ఇంట్లో సోదాలు చేయగా మరో 18 గ్రాముల డ్రగ్స్ లభించాయి.

## సంక్షిప్త వార్తలు

### జపాన్‌లో మళ్లీ భూకంపం: రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రత



**టోక్యో, జూన్ 28:** జపాన్‌లో మరోసారి భూకంపం సంభవించింది. ఆదివారం ఉదయం మళ్లీ భూమి కంపించింది. ఆ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.1గా నమోదైంది. అమోరి ప్రిఫెక్చర్ సమీపంలో 40 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు జపాన్ వాతావరణ విభాగం (జెఎంఎ) వెల్లడించింది. కాగా గత కొన్ని రోజులుగా పలు దేశాలను భూకంపాలు వణికిస్తున్నాయి. ఈ ప్రకృతి విపత్తు ఇటీవల వెనుజులాలో భారీ విధ్వంసాన్ని సృష్టించి విషాదాన్ని మిగిల్చింది. వెనుజులాలో భూకంపం సంభవించిన సమయంలోనే జపాన్‌లో 7.2 తీవ్రతతో భూకంపం వచ్చింది. మళ్లీ కొద్ది రోజుల వ్యవధిలో ఇలా రెండోసారి ప్రకంపనలు రావడంపై జపాన్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది.

### 13యేళ్ల బాలికపై 5 రోజుల్లో 30మంది అత్యాచారం


**న్యూఢిల్లీ, జూన్ 28:** రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో 13యేళ్ల బాలికపై 30 మందికి పైగా వ్యక్తులు ఐదు రోజుల పాటు అత్యాచారం చేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ లైంగిక దాడి ఘటనలు పలు హోటళ్లలో జరిగినట్లు చెబుతున్నారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం, ఇంటి నుండి అదృశ్యమైన బాలికను ఒక రిక్షా డ్రైవర్ హోటల్ యజమానికి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మైనర్ బాలిక లైంగిక దోపిడీలో మరికొందరు హోటల్ నిర్వాహకులు కూడా ప్రమేయం కలిగి ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. బాధిత బాలిక ఫిర్యాదుతో పలువురు హోటల్ యజమానులు, నిర్వాహకులను అరెస్టు చేశారు.

### రాజధానిలో రాహుల్ కనిపించడంలేదంటూ పోస్టర్లు..




**న్యూఢిల్లీ,జూన్ 28:** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ కలకలం రేగింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కనిపించడం లేదు అంటూ ఆదివారం ఢిల్లీలోని పలు కీలక ప్రాంతాల్లో వెలిసిన పోస్టర్లు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. రాహుల్‌గాంధీ తాజా విదేశీ పర్యటనను లక్ష్యంగా చేసుకుని అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య సాగుతున్న పొలిటికల్ వార్‌లో ఈ పరిణామం సరికొత్త మలుపు తిప్పింది. ఢిల్లీలోని ఫిరోజ్‌షా రోడ్డుతో పాటు పలు ప్రధాన కూడళ్లలో రాహుల్ గాంధీ ఫొటోతో కూడిన మిస్సింగ్ పోస్టర్లు ప్రత్యక్షమయ్యాయి. అయితే ఈ పోస్టర్లను ఎవరు అంటించారనేది ప్రస్తుతానికి స్పష్టంగా తెలియరాలేదు.

### ప్రొఫెల్లర్ తగిలి ట్రైనీ పైలట్‌కు గాయాలు..



**లక్నో, జూన్ 28:** శిక్షణలో భాగంగా విమానం నడిపిన మహిళా ట్రైనీ పైలట్ ల్యాండింగ్ తర్వాత ఇంజిన్ ఆన్‌లో ఉండగానే కిందకు దిగింది. దీంతో తిరుగుతున్న ప్రొపెల్లర్ ఆమె వెనుక భాగానికి తగలడంతో గాయపడింది. ఆ మహిళను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఈనెల 26న కాన్పూర్‌లోని చకేరి విమానాశ్రయంలో గార్గ్ ఏవియేషన్‌కు చెందిన ట్విన్ ఇంజిన్ విమానంలో మహిళా ట్రైనీ పైలట్ రాత్రిపూట శిక్షణ పొందింది. ఆమెతో పాటు ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్ కూడా అందులో ఉన్నారు.

### పార్టీగుర్తు ఫోర్జరీ చేశారంటూ టిఎంసి లీగల్‌సెల్ ఫిర్యాదు



**కోల్‌కత్తా,జూన్ 28:**పశ్చిమ బెంగాల్‌లో అధికా రాన్ని కోల్పోయిన అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు తీవ్రమయ్యాయి. ఇప్పటికే పార్టీ రెండుగా చీలింది. మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బయటికి వెళ్లి పోయారు. అసలు టీఎంసీ ప్రతిపక్ష హోదా సైతం కోల్పోయింది. ఎన్నికలు ముగిసిన నెల రోజుల్లోపే తృణమూల్ మొత్తం కూడా చెల్లా చెదురైంది. పార్టీ అధినేత్రి మమత బెనర్జీ, ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ సహా పార్టీ సీనియర్లు కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిణామాల మధ్య మమత బెనర్జీ తాజా ఎత్తుగడవేశారు. పార్టీ అధికారిక గుర్తును ఫోర్జరీ చేయడంతో పాటు, పేరును దుర్వినియోగం చేస్తూ కొందరు నేతలు ప్రైవేట్‌గా సమావేశాలు నిర్వహించారనే అంశాన్ని తెర మీదికి తెచ్చారు. ఈ క్రమంలో పార్టీ లీగల్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.




# రిజిస్ట్రేషన్లలో ప్రైవేటు భాగస్వామ్యం

• పిపిపి పద్ధతిలో సేవా కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనపై అభ్యంతరాలు

• ప్రజల వివరాల గోప్యతపై అనుమానాలు • పూర్తిగా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్

**నూజివీడు, జూన్ 28 ప్రభాతవార్త:** రిజిస్ట్రేషన్ల శాఖ ప్రతిపాదించిన 'సేవా కేంద్రాల'పై విముఖత వ్యక్తమవుతోంది. వీటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో నిర్వహిస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించడాన్ని చాలామంది వ్యతిరేకిస్తున్నారు. దళారుల బెడద లేకుండా, పారదర్శకంగా సేవలు అందించడానికి వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్నారు. అయితే స్థిరాస్తుల కొనుగోళ్లు, విలునామాలు, వారసత్వ ఆస్తుల పంపిణీ వివరాలు వంటివి ఆయా వ్యక్తులు గోప్యంగా ఉండాలని భావిస్తారు. ఇలాంటి వ్యవహారాలను నమోదువేసే బాధ్యతను పిపిపిలో ఏదో ఒక సంస్థకు అప్పగించడమేమిటనే ప్రశ్న వినిపిస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దళారుల ప్రమేయం లేకుండా ఎవరి డాక్యుమెంట్ వారు రాసుకోవడానికి 'పబ్లిక్ డేటా ఎంట్రీ (పిడిఇ) విధానం అమలు చేస్తోంది. అక్కడ దరఖాస్తు తీసుకొని ఆస్తి వివరాలు, సరిహద్దులు, కొనుగోలుదారు, అమ్మకందారు పేర్లు రాస్తే సరిపోతుంది. రెడీమేడ్ డాక్యుమెంట్ సిద్ధం అయిపోతుంది. తగిన ఫీజు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది. ఇప్పుడు కొత్తగా సేవా కేంద్రాలు ఏర్పాటుచేస్తే, అక్కడ దళారుల ప్రత్యక్షం కారని గ్యారంటీ ఏమీ లేదు. దీనికి ఫీజులు కాకుండా అదనపు రుసుము రూ.2 వేలు చెల్లించాలని అంటున్నారు. డాక్యుమెంట్ రైటర్లను కక్షిదారులు వ్యక్తిగత సహాయకుడిగా నమ్మి అతడికి వివరాలన్నీ చెప్పి రాయించుకుంటారు. అదే ప్రభుత్వం ఏర్పాటుచేసిన మనిషి (సంస్థ) అనగానే అన్ని విషయాలు చెప్పలేని పరిస్థితి ఉంటుంది. పైగా ఇప్పుడు ఆస్తి కొనుగోలు చేసినా, అమ్మినా డాక్యుమెంట్లో రాసే ధర వేరు. బయట వారికి ఇచ్చే ధనం వేరు. ఇది బ్లాక్ అండ్ వైట్లో ఉంటుంది. ఇది జగమెరిగిన సత్యం. అటువంటివన్నీ సేవా కేంద్రాల్లో చర్చించలేని, ప్రశ్నించలేని అంశాలు. పారదర్శకత అని చెప్పినా అక్కడ పాటించ లేని అంశాలన్నీ ఉంటాయి. పిపిపి అనగానే ఏదో ఒక సంస్థ కాంట్రాక్టు తీసుకుంటుంది. వారికి సంబంధించిన వ్యక్తులను సేవా కేంద్రాల్లో పెడతారు. వారు సక్రమంగా విధులు రిజిస్ట్రేషన్లో ప్రైవేటు భాగస్వామ్యం నిర్వహిస్తారని చెప్పలేం. సమర్పించిన ఆస్తుల వివరాలు వేరే వ్యక్తులకు చేరవేయకుండా ఉంటారని విశ్వసించలేము. పాస్‌పోర్టు సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ వ్యవహారాలను నడపాలని ప్రభుత్వం ముందు నుంచి భావిస్తోంది. పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో వ్యక్తిగత సమాచారం మాత్రమే ఉంటుంది. ఆధార్, వేలిముద్రలు, ఐరిస్, సర్టిఫికెట్ల పరిశీలన వరకు మాత్రమే అక్కడి సిబ్బంది పరిమితమవుతారు. మిగిలినవన్నీ పాస్‌పోర్టు కార్యాలయం చూసుకుంటుంది. రిజిస్ట్రేషన్ల విషయానికి వస్తే కోట్ల రూపాయల వ్యవహారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు థర్డ్ పార్టీకి సమర్పించాలి. వారి ద్వారా అవి సబ్ రిజిస్ట్రార్లకు వెళతాయి. అక్కడి నుంచి క్లియరెన్స్ వస్తేనే రిజిస్టర్ చేస్తారు. డాక్యుమెంట్ రాయడానికి, ఆయా పత్రాలు తీసుకోవడానికి రూ.2 వేలు ఫీజు కట్టాలని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో విశ్వసనీయత ఉండదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. సేవా కేంద్రం ఏర్పాటుచేస్తే అక్కడ రోజుకు కనీసం 50 డాక్యుమెంట్లు తీసుకున్నా ఒక్కో డాక్యుమెంటుకు రూ.2 వేలు చొప్పున రోజుకు లక్ష రూపాయల ఆదాయం అధికారికంగా వారికి వస్తుంది. పిపిపిలో కాకుండా ప్రభుత్వమే వీటిని నిర్వహిస్తూ, అక్కడ న్యాయశాస్త్రం చదివిన వారిని కనీసం కాంట్రాక్టు విధానంలో తీసుకున్నా బాధ్యతగా పనిచేస్తారు. అందరికీ నమ్మకం ఏర్పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 298 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా సొంత భవనాలు లేవు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అద్దె కూడా సక్రమంగా చెల్లించలేకపోతున్నారు. కార్యాలయాలకు అవసరమైన ఫర్నిచర్లు, ప్రింటర్లు, ఇతర సామాగ్రి కూడా సరిగ్గా ఇవ్వడం లేదు. ఇటువంటి పరిస్థితిలో మరో భవనం తీసుకొని సేవా కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది.

## పివి నరసింహారావు దార్శనికుడు: సిఎం



**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత మాజీ ప్రధాని, దివంగత పివి నరసింహారావు 105వ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. పివి నరసింహారావు దేశానికి చేసిన సేవలను ప్రశంసించారు. క్లిష్ట సమయంలో దూరదృష్టితో ఆలోచించి దేశాభివృద్ధికి తోడ్పడ్డారని, భావి తరాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

**పివి నరసింహారావు మహనేత: సిఎం చంద్రబాబు**

"భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు 105వ జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నా. దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి, దూరదృష్టితో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. భారత అభివృద్ధి దిశను మార్చిన మహనేతగా ఆయన చిరస్మరణీయులు. పివి దార్శనిక నాయకత్వం, దేశాభివృద్ధికి చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆ మహనీయుడి పుణ్యస్మృతికి మరోసారి వినమ్ర నివాళి" అంటూ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

**ఆర్థికవేత్తగా ఎన్నో సంస్కరణలు: మంత్రి లోకేశ్**

"ప్రధానమంత్రిగా, ఆర్థికవేత్తగా ఎన్నో సంస్కరణలను అమలులోకి తీసుకు వచ్చి దేశాభివృద్ధికి విశేషకృషిచేసిన భారతరత్న పివి నరసింహారావు జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నా. రాజనీతిజ్ఞుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచిన పివి నరసింహారావు తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణం. పివి జయంతి సందర్భంగా రాష్ట్రానికి, దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకుందాం" అంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

**పివి గొప్ప రాజనీతిజ్ఞుడు: డి.సిఎం పవన్ కళ్యాణ్**

"భారతరత్న పివి నరసింహారావు జయంతి సందర్భంగా నా హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నా. భారతదేశపు అత్యంత దార్శనిక రాజనీతిజ్ఞుల్లో ఒకరు, అసాధారణ పండితుడు పివి నరసింహారావు. ఆయన నాయకత్వం మన దేశ చరిత్ర గమనాన్ని మార్చేసింది. కీలక సమయంలో ఆయన ధైర్యం, దూరదృష్టి, చారిత్రాత్మక ఆర్థిక సంస్కరణలు భారతదేశ వృద్ధికి, ప్రపంచ స్థాయిలో దాని స్థానానికి కొత్త మార్గాలను తెరిచాయి. పివి అద్భుతమైన మేధస్సు, పరిపాలనా నైపుణ్యం, జాతీయ ప్రగతి పట్ల అచంచలమైన నిబద్ధత శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ఆయన స్ఫూర్తి ప్రతి భారతీయుడిని నిబద్ధతతో దేశానికి సేవ చేయడానికి ప్రేరేపిస్తూనే ఉండాలని ఆశిస్తున్నా" అని డి.సిఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ప్రాచీన కళలను పరిరక్షించాలి

• ముగిసిన జాతీయ సంగీత నృత్యోత్సవాలు




**తిరుపతి, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి మహతి కళాక్షేత్రం వేదికగా జరుగుతున్న శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ – రాయలసీమ రంగస్థలం జాతీయస్థాయి జానపద సంగీత, నృత్య పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఆదివారం నిర్వహించిన పోటీల్లో వివిధ కళా బృందాలు ప్రదర్శించిన సంప్రదాయ కళారూపాలు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన చప్పట్లతో ప్రశంసలు అందుకున్నాయి. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి ‌, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ డాక్టర్ జి ఎస్ ప్రసాద్, రామలింగేశ్వర స్వామి గుడి చైర్మన్ దొడ్డ రెడ్డి మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొని విజేతలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆధునిక వినోద మాధ్యమాల ప్రభావంతో కనుమరుగవుతున్న కళలను పరిరక్షించడం, ప్రోత్సహించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కళలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని, వాటిని భావితరాలకు అందించేందుకు ఇలాంటి జాతీయస్థాయి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. గత 35 సంవత్సరాలుగా తిరుపతిని వేదికగా చేసుకుని నిరంతరాయంగా జాతీయస్థాయి సంగీత, నృత్య, జానపద పోటీలను నిర్వహిస్తూ కళాకారులకు ప్రోత్సాహం అందిస్తున్న రాయలసీమ రంగస్థలం సేవలను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న సంస్థ చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి రాజాతో పాటు నిర్వాహక బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాబృందాలు తమ అద్భుతమైన జానపద సంగీత, నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

## తిరుపతి ఇఎస్ఐ ఆస్పత్రిని బలోపేతం చేయండి

• సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు



**తిరుపతి, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామికంగానూ, వివిధ రంగాల్లోనూ వేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతి జిల్లాలోని తిరుపతిలోని ఇఎస్ఐ ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి పరచాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నర్సింగరావు కోరారు. వేలాదిగా పెరుగుతున్న వలస కార్మికులు, రాయలసీమ జిల్లాల అవసరాలు దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలోని ఇఎస్ఐ ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న నర్సింగ్ సిబ్బంది సంఖ్యను, హౌస్ కీపింగ్ కార్మికుల సంఖ్యను గణనీయంగా పెంచాలని నర్సింగరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ నర్సింగ్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, తిరుపతి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షుడు జయచంద్ర, తిరుపతి నగర అధ్యక్షురాలు పి.బుజ్జి, కె.వేణుగోపాల్, ఎస్.శంకర్‌తో కూడిన సిఐటియు బృందం తిరుపతిలోని ఇఎస్ఐ ఆసుపత్రిని సందర్శించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, కార్మికులతో పలకరించి సమస్యలను తెలుసుకున్నారు. ఇఎస్ఐ ఆసుపత్రిలోని కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎపిఎస్‌పిడిసిఎల్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎపిఎస్‌పిడిసిఎల్) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల ప్రక్రియ జూన్ 30 నుంచి ప్రారంభం కానుంది. ఈ నియామక ప్రక్రియలో మొత్తం 135 ఖాళీలను భర్తీ చేయనున్నారు. వీటిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) 125 పోస్టులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (సివిల్) 6 పోస్టులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (టెలికాం) 4 పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత విభాగాల్లో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బిఇ లేదా బిటెక్ (ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్, సివిల్ ఇంజినీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. వయస్సు 2026 జులై 1 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బిసి, ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది. ఈ అర్హతలు కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో జులై 20 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు కింద అప్లికేషన్ ప్రాసెసింగ్, కామన్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ నిర్వహణ కోసం రూ.1,000 చెల్లించాలి. ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు రెండేళ్ల ప్రొబేషన్ కాలంలో నెలకు రూ.75,000 కన్సాలిడేటెడ్ వేతనం చెల్లిస్తారు. అనంతరం రెగ్యులర్ పే స్కేల్ రూ.86,245 నుంచి రూ.2,08,915 వరకు వర్తిస్తుంది.

# కేశినేని సోదరుల ప్రచ్ఛన్న యుద్ధం

• చిన్నిపై నాని భూకబ్జా ఆరోపణలు • తెలంగాణ సిఎంకు బహిరంగ లేఖ • నాని లేఖపై చిన్ని వ్యంగ్యాస్త్రాలు





**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ రాజకీయాల్లో అన్నదమ్ముల సవాళ్ళు, ప్రతి సవాళ్ళు కొనసాగుతున్నాయి. తాజాగా మాజీ ఎంపి, వైసిపి నేత కేశినేని శ్రీనివాస్(నాని) తన సోదరుడు, ప్రస్తుత విజయవాడ టిడిపి ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) లక్ష్యంగా సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ శివార్లలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు చిన్ని ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోషల్ మీడియా వేదికగా ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ భూకబ్జా యత్నాన్ని తక్షణమే అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు హైదరాబాద్ నగర శివారులోని ప్రగతినగర్, షంషిగూడ ప్రాంతంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు (టిజిఐఐసి) చెందిన 112.72 ఎకరాల భూమి ఉంది. దీనిని ఐటీ పార్క్ కోసం కేటాయించారు. అయితే, ఈ అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎంపి కేశినేని చిన్ని, ఆయన బినామీగా వ్యవహరిస్తున్న మెసర్స్ ఎక్సెల్లా ప్రాపర్టీస్ అనే సంస్థ అక్రమంగా చేజిక్కించుకోవాలని చూస్తున్నాయని కేశినేని నాని తన లేఖలో ఆరోపించారు. ఈ భూమిపై ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు ఆదేశాలు, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) ఆంక్షలు అమల్లో ఉన్నాయని, ఈ కీలక విషయాలను దాచిపెట్టి మోసానికి పాల్పడుతున్నారని నాని పేర్కొన్నారు. ఈ వాస్తవాలను మరుగునపరిచి, సుప్రీంకోర్టులో ఒక మోసపూరిత రాజీ ఒప్పందాన్ని చూపి ప్రభుత్వ భూమిని కొట్టేయాలని కుట్ర చేస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. గతంలో జిల్లా కలెక్టర్ సమర్పించిన అఫిడవిట్ ప్రకారం ఈ భూమిపై ప్రైవేటు వ్యక్తులకు ఎలాంటి హక్కులు లేవని (జీరో ప్రైవేట్ టైటిల్) స్పష్టంగా ఉన్నప్పటికీ, అక్రమార్కులు రాత్రికి రాత్రే ఆక్రమణలు మొదలుపెట్టారని నాని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కేశినేని నాని కోరారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు అడ్వకేట్ జనరల్ ద్వారా న్యాయస్థానాల్లో జోక్యం చేసుకుని, ఈ అక్రమ భూ బదలాయింపును నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' యంత్రాంగాన్ని వెంటనే రంగంలోకి దించి, ఇప్పటికే మొదలైన అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. నకిలీ పత్రాలు, మోసపూరిత ఒప్పందాలతో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న ఎంపి కేశినేని చిన్ని, ఆయన బినామీలు, సూత్రధారులపై తక్షణమే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

**చాల్లే.. ఇక పక్కకు వెళ్ళి ఆడుకో: ఎంపి కేశినేని శివనాథ్:** మాజీ ఎంపీ నానిపై తెలుగుదేశం ఎంపీ కేశినేని శివనాథ్ వ్యంగ్యాస్త్రాల సంధించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నాని రాసిన లేఖపై చిన్ని తీవ్రంగా స్పందించారు. ఈర్ష్య, ద్వేషం, కసి, పగతో నాని నిత్యం రగిలిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఆదివారం విజయవాడలో కేశినేని శివనాథ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్ని మీడియాతో మాట్లాడారు. ఇంతకుమించి దిగజారవు అనుకున్న ప్రతిసారి నాని ఇంకా ఇంకా దిగజారుతూనే ఉన్నారని శివనాథ్ సెటైర్లు గుప్పించారు. రేవులో తాడిచెట్టు మాదిరిగా పెరిగాడని, కానీ కొంచెమైనా ఇంగిత జ్ఞానం మాత్రం లేదని వ్యంగ్యంగా అన్నారు. ప్రధానికి, రాష్ట్రపతికి ఇరువురు ముఖ్యమంత్రులకు తనపై నాని ఫిర్యాదు చేశారని చెప్పుకొచ్చారు. ఇక మిగిలింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పుతిన్, కిమ్, కెఏ పాల్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. నాని వల్ల ఏం కాదని, పక్కకెళ్లి ఆడుకో అని కేశినేని శివనాథ్ విమర్శలు గుప్పించారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

• రచయితల పుస్తకాలు ఎక్కువ కొనుగోలు చేసేలా చర్యలు • వచ్చే నెలలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శ్రీకారం • రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

• సందర్శన యాత్రను జెండా ఊపి ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ




**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి అతిపెద్ద సెంట్రల్ లైబ్రరీ నిర్మాణ పనులకు జులైలో శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. కవులు, రచయితల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయాల సందర్శన యాత్ర జరిగింది. తొలుత ఈ బస్సు యాత్రను సివిల్ కోర్టుల వద్ద ఉన్న విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గ్రంథాలయం వద్ద ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాల ప్రాశస్త్యాన్ని నేటి తరం వారికి తెలియజేసే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఇటువంటి యాత్ర చేపట్టడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని సహాయ సహకారాలు రచయితలకు అందజేసేందుకు తానెప్పుడు సిద్ధంగా ఉంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విబిఎఫ్ఎస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అధ్యక్షతన ప్రారంభ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రచయితల పుస్తకాల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తానని హామీ ఇచ్చారు. అమరావతిలో సకల సౌకర్యాలతో విశాలమైన సెంట్రల్ లైబ్రరీ నిర్మాణ పనులకు జులైలో శంకుస్థాపన చేస్తామని రెండేళ్లల్లో పూర్తిచేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని వివరించారు. గ్రంథాలయాల ప్రస్తుత స్థితి మార్పు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచంద్, సాహితీవేత్తలు గుమ్మా సాంబశివరావు, వేముల హజరత్తయ్య గుప్తా, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మయ్య, తదితరులు పాల్గొని ప్రసంగించారు. యాత్ర ఉద్దేశాలను ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాశ్ సభకు వివరించారు. ఈ సందర్భంగా చెన్నాప్రగడ శర్మ రచించిన కవిత్వం కురిసింది కవితా సంకలనం, ఎం.ఎస్.వి. ప్రసాద్ రచించిన ఆవకాయ్ శతకం, ఎస్.ఆర్.పృథ్వి రచన ఆరుద్ర సప్తతి ఉత్సవం పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం బస్సుల్లో కవులు, రచయితలు బయలుదేరి నగరంలోని ఠాగూర్ గ్రంథాలయం, రామ్మోహన్ లైబ్రరీ, హనుమంతరాయ గ్రంథాలయం, సర్వోత్తమ గ్రంథాలయాలను సందర్శించి వాటి విశిష్టతలను అక్కడ పుస్తకాలను పరిశీలించారు. ముగింపు వేడుకల్లో పలువురు పాల్గొని వారి సందేశాలను ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం తరపున ప్రభుత్వ ఉగాది పురస్కార విజేత గబ్బిట దుర్గాప్రసాద్‌ను సత్కరించారు. అతిథులు, కవులు, రచయితలకు సంస్థ పక్షాన ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమాలను సంఘ ప్రతినిధులు నానా, సోమేపల్లి వశిష్ట, శర్మ సీహెచ్. రాజశేఖర్ పాణిగ్రాహి, కోపూరి పుష్పాదేవి, చింతా లక్ష్మీసుజాత, వేలూరి సుధారాణి తదితరులు పర్యవేక్షించారు.

## పోలియోపై విజయం శాశ్వతం కావాలి: కలెక్టర్ లక్ష్మీశా



**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త:** మన దేశం పోలియోపై సాధించిన విజయం శాశ్వతం కావాలంటే తల్లిదండ్రులు అందరూ తమ ఐదేళ్ళలోపు చిన్నారులకు పోలియో నివారణ చుక్కల మందులు వేయించాలని ఎన్టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా కోరారు. విజయవాడలోని అయోధ్యనగర్ పిహెచ్‌సిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని చిన్నారులకు చుక్కల మందు వేసి కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా లక్ష్మీశా మాట్లాడుతూ పోలియోరహిత సమాజాన్ని శాశ్వతంగా కొనసాగించే కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్టిఆర్ జిల్లా వ్యాప్తంగా పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిల పరిధిలో 966 పోలీయో కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందన్నారు. 4,274 మంది వ్యాక్సినేటర్‌లు, 104మంది రూట్ సూపర్‌వైజర్లు పాల్గొంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లవద్ద 35 ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా పోలియో నివారణ చుక్కల మందు వేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం చుక్కలమందు వేయించకపోతే సోమ, మంగళవారాల్లో ఆరోగ్యసిబ్బంది ఇంటివద్దకే వచ్చి చిన్నారులకు పోలియో నివారణ చుక్కలమందు ఇస్తారని చిన్నారులందరికీ చుక్కలమందు వేయించాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో డియంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతిదేవి, డాక్టర్ చిలకపాటి రామ్‌చంద్, డాక్టర్ శ్వేత, తదితరులు, అరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

## ఉండవల్లి ఘటనలో వైసిపి నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపి నేతల నిన్నటి అమరావతి పర్యటనలో రౌడీషీటర్లు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో టిడిపి కార్యాలయంపై దాడి చేసిన వారే శనివారం రైతులపై దాడి, కవ్వింపు చర్యల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. పోలీసు కానిస్టేబుల్‌పై దాడి వెనకా ఆ రౌడీ బ్యాచే ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత రాళ్ల దాడికి పాల్పడి రైతుల్ని రెచ్చకొట్టింది వైఎస్సార్సీపి వెంట వచ్చిన రౌడీషీటర్లే అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో టిడిపి ఆఫీస్‌పై దాడికి పాల్పడిన చైతన్య శనివారం వైఎస్సార్సీపి నేతల వెంటా ఉన్నట్లు ఇప్పటికే పోలీసులు గుర్తించారు.

**3 కేసులు నమోదు:** గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని సహా పలువురు నేతలపై కేసులు నమోదు చేసారు.

పోలీసుల నివేదికల ప్రకారం, తాడేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి అంబటి రాంబాబుపై ఒక కేసు నమోదైంది. అలాగే, తాడేపల్లి తెలుగు విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాయపూడి కిరణ్ ఫిర్యాదుతో మరికొన్ని కేసులు నమోదు చేశారు. అంబటి రాంబాబు, పేర్ని నానితో పాటు లేళ్ల అప్పిరెడ్డి, పనుగంటి చైతన్య, వేమారెడ్డి తదితరులు నిందితుల జాబితాలో ఉన్నారు. వీరితో పాటు రైతులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా కూడా వైసిపి నేతలపై కేసులు నమోదు చేశారు.

మరోవైపు, వైసీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైతులపై పోలీసులు కౌంటర్ కేసు నమోదు చేశారు. ఈ పరిణామాలతో తాడేపల్లి ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరుపక్షాల నుంచి అందిన ఫిర్యాదులపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమం జరగనుంది. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు 89777 16661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.

సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఇ: డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు 'డయల్ యువర్ ఎస్ఇ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 94906 15721 నంబర్లకు ఫోన్‌చేయాల్సి ఉంటుంది.

## ప్రైవేటు విద్యాసంస్థల దోపిడికి అడ్డుకట్టేయండి

• ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్



**చిత్తూరు(హెల్త్), జూన్ 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల దోపిడికి అడ్డుకట్ట వేయడానికి విద్యార్థులు పోరాటం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. చిత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ చిత్తూరు జిల్లా ప్లీనరీ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఏకైక సంస్థ ఎస్ఎఫ్ఐ ఒక్కటే అన్నారు. దేశంలో మతోన్మాత బిజెపి ప్రభుత్వం విద్యను కాషాయికరణ చేసి విద్యను భవిష్యత్ తరాలకు దూరం చేయడానికి ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ పనిచేస్తూ దేశ వ్యాప్తంగా బలోపేతం అవుతున్నదన్నారు. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి సత్వరం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు భగత్‌రవి, ఎస్ఎఫ్ఐ నాయకులు బాలసుబ్రమణ్యం, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.



# యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం

## • ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

**కావలి (నెల్లూరు), జూన్ 28, ప్రభాతవార్త:** యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి వ్యక్తం చేశారు. రామచంద్రాపురంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంటు ఎంత ఉపయోగపడుతాయని తెలిపారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిసానతయని తెలిపారు. నేటి యువత మొబైల్స్‌కు పరిమితం అవుతున్నారని తెలిపారు. క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తొందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్తాయిల్లో రాణించేలా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించి స్నేహభావంతో పాల్గొనాలని సూచించారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మద్యానికి డబ్బులివ్వలేదని భార్యను కడతేర్చిన భర్త

## • అనంతపురం జిల్లా మంగంపల్లిలో ఘటన

**శెట్టూరు:, జూన్ 28 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా శెట్టూరు మండలం మంగంపల్లి గ్రామంలో ఆదివారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు, మద్యం మత్తు కలిసి ఓ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టాయి. మమత అనే మహిళను ఆమె భర్త తిప్పేస్వామి మద్యం సేవించటానికి డబ్బులు ఇవ్వలేదని ఇనుప రాడ్డుతో దాడి చేసి అతి దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా సంచలనం రేపింది. గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, ఎస్ఐ సుమన్ ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో మద్యం సేవించేందుకు డబ్బుల ఇవ్వలేదనే విషయంలో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. ఆ వాగ్వాదం కాస్తా ఘర్షణగా మారి చివరకు హత్యకు దారి తీసినట్లు పోలీసులు అనుమానిస్తు న్నారు. ఈ ఘటనపై సిఐ నీలకంఠ విచారణ చేపట్టగా, నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసిన పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు చెప్పట్టారు. మృతురాలు మమతకు ఒక కుమార్తె ఐశ్వర్య, ఒక కుమారుడు అభిషేక్ ఉన్నారు. తల్లి మృతితో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారడం గ్రామస్థులను కన్నీరు పెట్టించింది.



మృతురాలు మమత ఫైల్ ఫోటో

# సాంకేతికతకు మానవీయ విలువలు తోడైనప్పుడే నిజమైన ప్రగతి

## • మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

**గుంటూరు (విద్య), జూన్ 28 ప్రభాతవార్త:** 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, వైబ్ కోడింగ్, ఏజెంటిక్ ఏఐ వంటి సరికొత్త సాంకేతికతలు ప్రపంచాన్ని శాసిస్తున్న ప్రస్తుత తరుణంలో, టెక్నాలజీ ఎంత పెరిగినా మానవీయ విలువలు లేకపోతే లాభం లేదు. సాంకేతికతకు సంస్కారం తోడైనప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది" అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, విద్య అనేది కేవలం జీవనోపాధి కోసం మాత్రమే కాదని, అది సంస్కారాన్ని పెంచి, సమాజం పట్ల బాధ్యత గల పరిపూర్ణమైన మానవుడిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో 65 శాతం మంది 35 ఏళ్ల లోపు యువకులే ఉన్నారని, రాబోయే రెండు దశాబ్దాల పాటు ప్రపంచానికి అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించగల ఏకైక దేశం మనదే నన్నారు. యువతరం కేవలం ఉద్యోగాలు వెతుక్కునే వారుగా కాకుండా, పదిమందికి ఉపాధినిచ్చే ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలని, స్టార్టప్ ఆవిష్కరణలకు పదును పెట్టాలని సూచించారు.



# రాస్ తనూరా వద్ద కుప్పకూలిన ఆరామ్‌కో హెలికాప్టర్

## 14 మంది మృతి

**రియాద్, జూన్ 28:** సౌదీ అరేబియా తూర్పు ప్రాంతంలోని రాస్ తనూరా వద్ద ఆదివారం అరాంకోకు చెందిన హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న 14 మంది సౌదీ పౌరులు మృతి చెందినట్లు ఆ దేశ అధికారిక వార్తా సంస్థ వెల్లడించింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, పూర్తి స్థాయి విచారణ చేపట్టినట్లు సౌదీ ఇంధన మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఉన్న వారంతా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధృవీకరించారు. సౌదీ అరాంకో సంస్థ వద్ద 60కి పైగా విమానాలు, హెలికాప్టర్లు ఉండగా, దేశవ్యాప్తంగా 300కు పైగా హెలిప్యాడ్‌లకు సేవలు అందిస్తోంది. మధ్యప్రాచ్య ప్రాంతంలో అతిపెద్ద కార్పొరేట్ వైమానిక వాహనాల సముదాయాల్లో ఇది ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ ప్రమాదం ఇటీవల మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్ దాడులు, హార్ముజ్ జలసంధి మూసివేత కారణంగా గల్ఫ్ దేశాలు చమురు ఉత్పత్తిని పెంచే ప్రయత్నాలు చేస్తున్న వేళ ఈ ఘటన జరిగింది. అయితే ఈ హెలికాప్టర్ ప్రమాదానికి ఎలాంటి శత్రుదాడి సంబంధం లేదని సౌదీ ప్రభుత్వం స్పష్టం చేసింది. రాస్ తనూరా రోజుకు సుమారు 5.5 లక్షల బ్యారెళ్ల సామర్థ్యం కలిగిన మధ్యప్రాచ్యంలోని అతిపెద్ద రిఫైనరీలలో ఒకటి ఉంది. గతంలో ఇరాన్ డ్రోన్ దాడుల కారణంగా ఈ రిఫైనరీలో అగ్నిప్రమాదం సంభవించి, కొంతకాలం ఉత్పత్తి నిలిచిపోయింది. ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు ఎగుమతిదారైన సౌదీ అరేబియా ప్రస్తుతం రోజుకు కోటి బ్యారెళ్లకు పైగా ముడి చమురును ఉత్పత్తి చేస్తోంది.

# రాజకీయాల్లో సిద్ధాంతాలు, జీవితంలో క్రమశిక్షణ చాలా ముఖ్యం

## • విజయవాడలో మాశర్మ రచించిన వెంకయ్య నాయకుడు పుస్తక పరిచయ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏ విషయాన్ని సూటిగా చెప్పడం రాజకీయ నేతలు నేర్చుకోవాలని వెంకయ్యనాయుడు అన్నారు. జై ఆంధ్ర ఉద్యమం నాడే రాష్ట్ర విభజన జరిగి ఉంటే ఇవాళ ఏపీ ఎక్కడో ఉండేదని, రెండు రాష్ట్రాలు బాగా అభివృద్ధి చెందేవన్నారు. విభజన అనివార్యం అని తెలిసిందని, నేను ఏదో రకంగా విభజన అడ్డుకుంటానని అందరూ అనుకున్నారన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు నా వద్దకు వచ్చి మాట్లాడారని, పార్టీ సిద్ధాంతానికి అనుగుణంగా వ్యవహరిస్తామని చెప్పానని స్పష్టంచేశారు. విజయవాడలో సీనియర్ పాత్రికేయులు మాశర్మ రచించిన వెంకయ్య నాయకుడు పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. వెంకయ్య నాయుడు జీవన ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. పుస్తక పరిచయ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు చిన్నతనంలోనే తల్లి చనిపోయింది ఆర్‌యస్‌యస్‌లో చేరడం ద్వారా ఎన్నో నేర్చుకున్నాను. ఇటీవల కొంతమంది ఆర్.యస్.యస్ ను నిషేధించాలని డిమాండ్ చేస్తున్నారు. అది నిషేదించాలి అనే వారినే ముందు నిషేధించాలి. తుపాకీ కన్నా బ్యాలెట్ చాలా శక్తివంతమైంది. ఇందిరాగాంధీ, వాజ్ పాయ్, యన్టీఆర్ వంటి వారే ఓడిపోయారు. నక్సలైట్లు తప్పుదారి పట్టి అనేక మంది ప్రాణాలు కోల్పో యారు, అభివృద్ధిని కూడా అడ్డుకోవడంతో ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టింది. ఆయుధంతో బెదిరించి ఎవరినీ లొంగదీసుకోలేరు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో కొంతమంది కి బూతు మాటలు మాత్రమే వస్తున్నాయి. నాయకులు ఇలా మాట్లాడుతున్నారని నన్ను అడిగితే.. బూతులు మాట్లాడేవారికి, బూత్‌లలోకి వెళ్లి బటన్ నొక్కు అని చెప్పా, మొన్న ఎన్నికలలో ఇలా బూతులు మాట్లాడే వారు ఒక్కరు కూడా గెలవలేదు, వారి పేర్లు నేను ప్రస్తావించను.. వారి గురించి అందరికీ తెలుసు. నేను వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకం. వారసత్వం కాదు... జవసత్వాలు కావాలి, వారసులుగా వచ్చేవారు కష్టపడి కింద నుంచి పైకి రావాలి. అంతే కానీ హెలికాప్టర్‌లో పై నుంచి కిందకు దింపకూడదు అని నా సిద్దాంతం, అందుకే నా పిల్లలను నేను రాజకీయాల్లో ప్రోత్సహించలేదు. దక్షిణాది వారిని పైకి రానివ్వరనే పేరు ఉండేది. వాజ్‌పేయ్, అద్వానీ మధ్యలో కూర్చుని అధ్యక్షుడిగా పని చేశాను. ఆర్‌యస్‌యస్, బిజెపిలో పని చేయడం వల్లే ఈ స్థాయికి ఎదిగాను. ఇప్పుడు ఇక రాజకీయాలు నేను మాట్లాడను. రాజకీయాల్లో సిద్దాంతాలు, జీవితంలో క్రమశిక్షణ చాలా ముఖ్యం. చట్టసభల్లో గౌరవప్రదమైన భాషను ఉపయోగించాలి, మనమే అసెంబ్లీలో గొడవులు పెట్టుకుని, కాగితాలు చించడం, మైకులు విరగకొట్టడం చూస్తున్నాం. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ సమీక్ష చేసుకోవాలి. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు ఆత్మ సమీక్ష చేసుకుని విలువలను పాటించాలి. వాళ్ల వాళ్ల పార్టీ సభ్యులకు మార్గనిర్దేశిక నియమావళిని అమలు చేయాలి. అప్పుడే సమాజంలో మన నాయకులకు గౌరవం ఉంటుంది. కుటుంబ వ్యవస్థలో పిల్లలతో ఉండేలా తల్లిదండ్రులు సమయం ఇవ్వాలి. నేడు టీవీలు, ఫోన్ లలో ఎవరికి వారే ఒంటరిగా ఉంటున్నారు. గుడ్ మార్నింగ్‌కు నేను వ్యతిరేకం.. పెద్దలకు నమస్కారం చెప్పే విధానం పిల్లలకు నేర్పాలి. మన బొట్టు, కట్టు, మాట, ఆట, పాట, బాట, యాస, గోస ఎప్పుడూ మరచిపోకూడదని చెబుతా, మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ వ్యవస్థ చూసే ఇతర దేశాలు మనల్ని గౌరవిస్తాయి, కార్యక్రమంలో మాశర్మ వెంకయ్య నాయుడు వ్యక్తిత్వాన్ని చక్కగా ఆవిష్కరించారని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి ఆయన ఉన్నత శిఖరాలు అధిరోహించారని చెప్పారు. రాజకీయాల్లో వెంకయ్య చూపించిన చొరవ అసామాన్య మని కొల్లు రవీంద్ర వివరించారు. వెంకయ్యనాయుడు నిబద్ధత కలిగిన నేత మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. దార్శనికత ఆయనలోని సుగుణమన్నారు. సుజనాచౌదరి, గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమా మహేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.




మాశర్మ రచించిన వెంకయ్య నాయకుడు పుస్తక పరిచయ కార్యక్రమ దృశ్యం

# రాష్ట్ర అభివృద్ధే మా ఆకాంక్ష

## • యేటా రొట్టెల పండగలో అదే కోరిక • ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

**నెల్లూరు(వైద్యం), జూన్ 28 ప్రభాతవార్త:** రాష్ట్ర అభివృద్ధే తమ ఆకాంక్ష అని, ఏటా రొట్టెల పండగలో అదే కోరిక కోరుటమని, రొట్టెల పండగకు భక్తుల సంఖ్య ఏటికేటికీ పెరిగిపోతొందని, దర్గా ప్రాంగణంలో భక్తుల కోసం చేసిన ఏర్పాట్లు అద్భుతమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లు అన్నారు. వారు ఆదివారం రొట్టెల పండగ సందర్భంగా నెల్లూరు బారాషహీద్ దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి బారాషహీదులను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే గొప్ప పుణ్యక్షేత్రం బారా హాషీద్ దర్గా అని, నెల్లూరులో ఈ దర్గా ఉండటం జిల్లా ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ఏటా రొట్టెల పండగ సందర్భంగా ఇక్కడకు వచ్చి రాష్ట్ర అభివృద్ధిని కోరుకోవడం మాకు సంప్రదాయంగా వస్తోందన్నారు. గతంలో రొట్టెల పండగకు 4 లక్షల మంది హాజరైతే, ఇప్పుడు ఆ సంఖ్య 18 లక్షలకు చేరడం సంతోషంగా ఉందన్నారు. ఎన్ని లక్షల మంది వచ్చినా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తుండటం గొప్ప విషయమన్నారు. అందులో భాగంగా మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్. అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. అదేవిధంగా అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో కసుమూరు లో నిత్యాన్నదానం ప్రారంభించడంతో పాటు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. అనంతరం ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రొట్టెల పండగను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. దర్గా ప్రాంగణంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇటీవల జరిగిన ఘటనలను సమీక్షించుకుని, భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. దర్గా ప్రాంగణాన్ని మరింత విస్తరించే ఆలోచన ఉందన్నారు. శనివారం రాత్రి నిర్వహించిన గంధోత్సవానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చినా పోలీసులు పకడ్బందీగా పనిచేయడంతో చిన్న అవాంఛనీయ ఘటన కూడా చోటుచేసుకోలేదని తెలిపారు. దర్గా ప్రాంగణంలో ఎవరైనా తప్పిపోతే అప్పటికప్పుడే సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా చైర్మన్ మునీర్ అహ్మద్, బొమ్మి సురేంద్ర, సాబీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.





# 40యేళ్ల సమస్యకు పరిష్కారం చూపాం

## • నెల్లూరు రూరల్‌లో చరిత్ర సృష్టించే స్థాయిలో అభివృద్ధి: ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

**నెల్లూరు, జూన్ 28 ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో దాదాపు 40 సంవత్సరాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని, చరిత్ర సృష్టించే అభివృద్ధి నెల్లూరు రూరల్‌లో జరుగుతోందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గత 10 సంవత్సరాలలో చేయలేని పనులను ఈ రెండేళ్లలో చేసి చూపించామన్నారు. నేడు నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని ములుమూడి గ్రామంలో 83 లక్షల రూపాయలతో నిర్మించిన ములుమూడి కలుజుపై బ్రిడ్జిని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. చెప్పిన మాట ప్రకారం 6 నెలల్లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలు కలుజు మీద బ్రిడ్జి పూర్తిచేసి చూపించారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. తన దృష్టికి ఏ సమస్య వచ్చినా తన వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జిల్లా కలెక్టర్ సహకారంతో ములుమూడి కలుజు మీద బ్రిడ్జి పూర్తి చేశామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. మరో 2 నెలల్లో పొట్టేపాలెం కలుజు మీద బ్రిడ్జి పూర్తి చేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## • పరిరక్షణ సమితి పేరిట పర్యటనలు బూటకం • అమరావతి పేరు ఎత్తే హక్కు కూడా వైకాపాకు లేదు • గజపతినగరంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**గజపతినగరం, జూన్ 28 ప్రభాతవార్త:** ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాజధాని అమరావతి అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అలుపెరగని పోరాటం చేస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం గజపతి నగరంలో మీడియా చిట్‌చాట్‌లో రాజధాని గురించి పలు విషయాలు వెల్లడి చేశారు. పరిరక్షణ సమితి పేరిట అల్లర్లు సృష్టిస్తూ వైకాపా నాయకులు బూటకపు పర్యటనలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో ఉండగా "అమరావతి వద్దు.. మూడు రాజధానులు ముద్దు" అని ప్రకటించి అధికారం వచ్చాక రంగులు మార్చటం బులుగు పార్టీకే సాధ్యమన్నారు. అమరావతి ప్రాంతం రైతులను, మహిళలు అని కూడా చూడకుండా హింసకాండ సృష్టించి, అరెస్టులు సైతం చేయించిన ఘనత గొడ్డలి పార్టీది అన్నారు. రాజధాని ప్రాంతంలో నీళ్లు నిలుస్తున్నాయని, రాజధానికి అమరావతి ప్రాంతం తగదని ప్రకటించిన కుతంత్రాల మహా మేధావి జగన్ అని మంత్రి అన్నారు. రాజధాని ప్రాంత ప్రజలు పాదయాత్ర చేస్తుంటే అడ్డుకున్న ఘనత ఆనాటి వైకాపా ప్రభుత్వానిదన్నారు. ఆంధ్ర ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అమరావతిని అంతర్జాతీయ హంగులతో తీర్చిదిద్దడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2047 విజన్‌తో ముందుకు సాగుతున్నారన్నారు. మెడికల్ జోన్, ఎడ్యుకేషనల్ జోన్ వంటి అత్యాధునిక సౌకర్యాలతో రాజధాని నిర్మాణం చంద్రబాబు సారధ్యంలో రూపుదిద్దుకుంటుందన్నారు. దాడులు చేశారని రాజధాని ప్రాంత రైతులపై అభియోగం మోపుతున్నారని, ఆ ప్రాంత రైతులంతా రాజధానికి మేము అనుకూలమని చెప్పి వైకాపా అధినేతలు పర్యటనలు చేయాలన్నారు. మూడు రాజధానులా, మావిగనా అన్నదానిపై వైకాపా అధినేతతో స్పష్టత ఇప్పించాలని ఆ పార్టీ నాయకులకు సూచించారు. జగన్ తండ్రి వైయస్సార్ అనుభవం కలిగిన నాయకుడిగా నాడు ఉమ్మడి రాజధాని హైదరాబాదులో చంద్రబాబు ప్రారంభించిన హైటెక్ సిటీ వంటి వాటిని ప్రోత్సహించారని, అనుభవలేమితో అధికారం వచ్చాక జగన్ ప్రవర్తించడంతోనే ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కుంటు పడిందన్నారు. జగన్ విధ్వంస పాలనతో గజిబిజి సృష్టించిన పాలనను కూటమి ప్రభుత్వం నేడు గాడిలో పెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణాలను చిత్తశుద్ధితో పారదర్శకంగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. భావితరాల అభివృద్ధి కోసం రాజకీయాలు చేయాలని, రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయకూడదని వైకాపా నాయకులకు హితవు పలికారు. అమరావతి పేరు ఎత్తే హక్కు కూడా వైకాపాకు లేదని కొండపల్లి శ్రీనివాస్ ధ్వజమెత్తారు.




# తిరుపతిలో రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్

## • జాతీయ ఎంపికలు-2026 ఘనంగా ప్రారంభం



**తిరుపతి (క్రీడ), జూన్ 28 ప్రభాతవార్త:** కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో తిరుపతిలో ఘనంగా నిర్వహించిన 6వ రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ జాతీయ ఎంపికలు-2026 కార్యక్రమానికి శాప్ చైర్మన్ రవి నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులను ఉద్దేశించి రవి నాయుడు మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ముఖ్యంగా కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ స్వీయ రక్షణతో పాటు ధైర్యం, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ప్రతి క్రీడాకారుడికి గర్వకారణమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజయం కోసం కృషి, క్రమశిక్షణ, నిరంతర సాధన ఎంతో అవసరమని యువ క్రీడాకారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. యువత క్రీడలను అభిరుచిగానే కాకుండా ఉన్నత భవిష్యత్తుకు మార్గంగా కూడా భావించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం, పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కరాటే క్రీడాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు, కోచ్‌లు, నిర్వాహకులను అభినందిస్తూ, ఇలాంటి పోటీలు మరింత మంది యువతను క్రీడల వైపు ఆకర్షిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, కోచ్‌లు, న్యాయ నిర్ణేతలు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేసులపై ప్రమాణానికి సిద్ధమా!


## • రాజకీయాలను రాజకీయంగానే చేద్దాం • మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**అనంతపురం సిటీ, జూన్ 28 ప్రభాతవార్త:** వైసిపి పాలనలో తనపై 70 కేసులు నమోదు చేశారని పదేపదే చెప్పుకుంటున్న జెసి ప్రభాకర్‌రెడ్డి, ఆ కేసులు ఎందుకు నమోదు అయ్యాయో దేవుని సన్నిధిలో ప్రమాణానికి సిద్ధమా అని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సవాల్ విసిరారు. జిల్లా వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం తాడిపత్రిలో శాంతియుత దీక్షకు వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వైసిపి సమన్వయ కర్తలు మద్దతు ప్రకటించారన్నారు. అయితే దీనిపై మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి, వైసిపి సమన్వయ కర్తలు అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి తలారి రంగయ్యలపై చేసి అసభ్యకరంగా ధూషించడం సరికాదన్నారు. వారిపై చేసిన దూషణలు జెసి ప్రభాకర్‌రెడ్డి వ్యక్తిగతమా, చంద్రబాబునాయుడు, నారా లోకేష్ సూచనలతో చేసిన దూషణలా అని ఆయన ప్రశ్నించారు. జెసి ప్రభాకర్‌రెడ్డి టిడిపి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలు ఏవీ చేయరని, కేవలం వ్యక్తిగత ప్రోగ్రాంలు మాత్రమే చేస్తుంటారని ఆయన విమర్శించారు. రెండేళ్ల కూటమి పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగానే తాడిపత్రిలో కూడా నిరసన కార్యక్రమం చేపడితే పోలీసులు అనుమతించ లేదని, దీనిని నిరసిస్తూ ఎస్పీ కార్యాలయం ఎదుట తాను నిరసన వ్యక్తం చేశానన్నారు. అయితే జెసి ప్రభాకర్‌రెడ్డి పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేసి, అక్కడే స్నానం చేసి పోలీసులపై ఒత్తిడి తెచ్చి తనపై అక్రమ కేసులు నమోదు చేయించారని విమర్శించారు. కానీ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టిన జెసి ప్రభాకర్‌రెడ్డిపైన మాత్రం పోలీసులు కేసులు నమోదు చేయలేదని ఆయన విమర్శించారు. తాడిపత్రి నియోజకవర్గంలో వైసిపి శ్రేణులపై టిడిపి నేతలు దాడులు చేస్తారని, బాధితులు ఫిర్యాదులు చేసినా కేసులు నమోదు చేయకపోయినా, బాధితులపైనే కౌంటర్ కేసులు నమోదు చేస్తారని ఆయన విమర్శించారు. జెసి కుటుంబం కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు వారి కుటుంబం రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధిలో అనంత వెంకటరామిరెడ్డి తోడుగా నిలిచి రాజకీయ భవిష్యత్తు ఇచ్చారన్నది గుర్తించుకోవాలని పెద్దారెడ్డి సూచించారు. తాడిపత్రిలో ఐపిఎస్ అధికారి ఉన్నా లా అండ్ ఆర్డర్ కాపాడటం లేదన్నారు. గతంలో తాడిపత్రి పోలీస్‌స్టేషన్‌కు తాళం వేసిన చరిత్ర జెసి కుటుంబానికి ఉందన్నారు. వైసిపి హయాంలో తాను నష్టపోయానని జెసి ప్రభాకర్‌రెడ్డి యాక్టింగ్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వారసులు రాజకీయాల్లోకి రావాలని కోరుకోవడం సహజమని, అయితే జెసి ప్రభాకర్‌రెడ్డి కొడుకు ఎమ్మెల్యే అయినా ఆయనను బయటికి రాకుండా చూస్తున్నారన్నారు. ఈ వయస్సులో సలహాలు, సూచనలు ఇవ్వాలని, కొడుకును ప్రజలలో తిప్పితే రానున్న రోజుల్లో మరింత మంచి నేతగా ఎదిగే అవకాశం ఉందని గుర్తించాలన్నారు. కొడుకు భవిష్యత్తు, రాజకీయం గురించి ఆలోచన చేయాలని కక్షలు, కార్పణ్యాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. నీవు తప్పులు చేసి వాటిపై కేసులు నమోదైతే సానుభూతి కోసం మాపై నిందలు వేస్తావా అని ఆయన ప్రశ్నించారు. దీనిపై నీవు నమ్మే శ్రీకాళహస్తీశ్వరుడుపైన కాని, తాము నమ్మే వేంకటేశ్వర స్వామిపై కాని ప్రమాణానికి సిద్దమా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాజకీయాలను రాజకీయంగానే చేద్దామని, మీరు విరమిస్తే తాను కూడా విరమిస్తానని పెద్దారెడ్డి స్పష్టంచేశారు.



# దక్షిణాఫ్రికా విమానప్రమాదంలో సీతంపేట యువకుడు మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** దక్షిణాఫ్రికా విమాన ప్రమాదంలో హసన్‌పర్తి మం డలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఆడెపు సుమంత్ (25) దుర్మరణం చెందాడు. ఆడెపు వరలక్ష్మి చంద్రమోహన్ దంపతుల చిన్న కుమారుడైన సుమంత్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీర్ పూర్తి చేసుకున్నాడు. గత 8 నెలలుగా దక్షిణాఫ్రికాలో సుమంత్ పైలెట్‌గా శిక్షణ పొందుతున్నాడని, ఇందులో భాగంగానే శనివారం దక్షిణాఫ్రికాలోని జోహెన్నస్‌బర్గ్‌లో సుమంత్ విమానాన్ని స్టార్ట్ చేసిన కొద్ది నిమిషాలకే ప్రమాదం జరిగిందని సమాచారం. విమానం కూలడానికి సాంకేతిక లోపమా, ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు జరుగుతున్నట్టు సమాచారం.




# అంజూ 22 యేళ్ల లాంగ్‌జంప్ రికార్డు బ్రేక్

**భువనేశ్వర్, జూన్ 28:** భువనేశ్వర్‌లో జరుగుతున్న జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో మరో రికార్డు బద్దలైంది. అంజు బాబీ జార్జ్ పేరిట ఉన్న 22 ఏళ్ల నాటి లాంగ్ జంప్ జాతీయ రికార్డును కేరళకు చెందిన అన్సీ సోజన్ బ్రేక్ చేసింది. 25 ఏళ్ల అన్సీ తన ఐదవ ప్రయత్నంలో 6.88 మీటర్ల దూరం దూకి... 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో అంజూ నెలకొల్పిన 6.83 మీటర్ల జాతీయ రికార్డును అధిగమించింది. అలాగే భారత అథ్లెటిక్స్ సమాఖ్య నిర్దేశించిన 6.48 మీటర్ల ఆసియా క్రీడల అర్హత ప్రమాణాన్ని కూడా అన్సీ దాటింది. ఈ సీజన్‌లో ఆసియా అథ్లెట్లలో ఆమె అగ్రస్థానానికి చేరుకుంది. శైలి సింగ్ (ఉత్తరప్రదేశ్) 6.67 మీటర్లతో రెండో స్థానంలో, ముబస్సినా(లక్షద్వీప్) 6.53 మీటర్లతో మూడో స్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన ముగ్గురు అర్హత సాధించినా జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో అన్సీ, శైలిసింగ్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందారు.

### పురుషుల హైజంప్‌లో మరో రికార్డు

మహారాష్ట్రకు చెందిన సర్వేష్ కుషారే పురుషుల హై జంప్‌లో 2.31 మీటర్ల అద్భుత ప్రదర్శనతో జాతీయ రికార్డును నెలకొల్పాడు. గత ఏడాది టోక్యోలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ పురుషుల హై జంప్ ఫైనల్‌కు అర్హత సాధించిన తొలి భారతీయుడిగా నిలిచిన కుషారే... 2.31 మీటర్ల ఎత్తును అధిగమించి 2018 నుండి తేజస్విన్ శంకర్ పేరిట ఉన్న 2.29 మీటర్ల జాతీయ రికార్డును మెరుగు పరిచాడు. కుషారే 2.35మీటర్ల ఎత్తును అధిగమించడానికి ప్రయత్నించినప్పటికీ, రెండు ప్రయత్నాల లోనూ విఫలమయ్యాడు. ఈఛాంపియన్‌షిప్‌లలో ఇప్పటివరకు 5 జాతీయ రికార్డులు నమోదయ్యాయి.

## లక్ష్య ఛేదనలో మరోసారి విఫలమైన టీమిండియా

# టి20 సిరీస్ ఐర్లాండ్ కైవసం



**బెల్‌ఫాస్ట్, జూన్ 28:** ప్రపంచ టీ20 ఛాంపియన్లు టీమిండియా మరోసారి లక్ష్య చేధనలో బోల్తా కొట్టింది. 155 పరుగులను చేధించడంలో విఫలమైన శ్రేయాస్ సేన నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 153 పరుగులకే పరిమితమైంది. చివరి ఓవర్లో 20 పరుగులు చేయాల్సిన టీమిండియా 18 రన్స్ మాత్రమే చేసింది. దీంతో రెండో టీ20లోనూ క్రికెట్ కూన ఐర్లాండ్ ఒక పరుగు తేడాతో నెగ్గి సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఐర్లాండ్ పర్యటనను పరాజయంతో ముగించింది.

### ఓపెనర్లు డకౌట్

155 పరుగుల లక్ష్య చేధనలో మరోసారి భారత్ బ్యాటింగ్ తడబడింది. తొలి ఓవర్లోనే ఓపెనర్లిద్దరినీ కోల్పోయింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సంజూ శాంసన్(0)ను ఎల్బీగా అవుట్ చేసిన మూండ్రా...నాలుగో బంతికి అభిషేక్(0)ను పెవిలియన్ చేర్చాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(10) కూడా నిరాశ పరిచాడు. ఇషాన్ కిషన్(12) రనౌట్ కావడంతో 35 పరుగులకే నాలుగు టాప్ ఆర్డర్ వికెట్లను కోల్పోయింది.

### తిలక్, హర్షిత్ ఒంటరిపోరాటం

అక్షర్ పటేల్(14)తో కలిసి కొద్దిసేపు వికెట్ల పతనానికి తిలక్ వర్మ(46 బంతుల్లో 55 రన్స్; 3 ఫోర్లు, ఒ సిక్స్) ఫుల్ స్టాప్ పెట్టాడు. అయిదో వికెట్‌కు 39 రన్స్ జోడించాడు. ఇక శివమ్ దూబే(20)తోకలిసి స్కోరును వంద దాటించాడు. ఈక్రమంలో తిలక్ వర్మ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఇద్దరూ ఆడుతున్నంత సేపు భారత్ గెలుస్తుందన్న ఆశలు కలిగాయి. అయితే 8 పరుగుల తేడాతో దూబే, తిలక్‌వర్మ అవుట్ కావడంతో భారత్ ఆశలు సన్నగిల్లాయి. తొలి వన్డే ఆడుతున్న సూర్యాంష్ షెడ్గే (1) కూడా తొందరగానే అవుటయ్యాడు. చివర్లో హర్షిత్ రాణా 10 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్స్‌తో 21 రన్స్‌తో మెరుపులు మెరిపించినా భారత్‌ను ఓటమి నుంచి తప్పించలేకపోయాడు. ఐర్లాండ్ బౌలర్లు మూండ్రా, మాట్ హోలార్డ్ మూడేసి వికెట్లు తీసి భారత్‌ను దెబ్బతీశారు.

### ప్రిన్స్ వికెట్ల బోణీ

అంతకుముందు టాస్ నెగ్గిన టీమిండియా.. ఐర్లాండ్‌కు బ్యాటింగ్ అప్పగించింది. ఐర్లాండ్ ఇన్నింగ్స్‌ను టిమ్ టెక్టార్ (5), రాస్ అడైర్(16) ప్రారంభించారు. హర్షిత్ రాణా తన తొలి ఓవర్లోనే టిమ్ టెక్టార్‌ను అవుట్ చేశాడు. రెండు సిక్స్‌లతో ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన మరో ఓపెనర్ రాస్ అడైర్‌ను అర్ష్‌దీప్ సింగ్ పెవిలియన్‌కు చేర్చాడు. కెప్టెన్ లోర్కాన్ టక్కర్ (15)ను తొలి వన్డే ఆడుతున్న ప్రిన్స్ యాదవ్ బోల్తా కొట్టించాడు. దీంతో ఐర్లాండ్ 48 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

### హ్యారీ టెక్టార్ అర్ధ శతకం

ఈ క్రమంలో వన్‌డౌన్ బ్యాటర్ హ్యారీ టెక్టార్(47 బంతుల్లో 53), బెంజమిన్ కాలిట్జ్ (37) క్రీజ్‌లో నిలదొక్కుకుని ఐర్లాండ్ స్కోరును వంద దాటించారు. నాలుగో వికెట్‌కు 65 రన్స్ జోడించారు. ఈ దశలో శివమ్ దూబే వరుసబంతుల్లో కాలిట్జ్, గరెత్(0)ను ఔట్ చేసి దెబ్బతీశాడు. మరో ఎండ్‌లో అర్షదీప్, ప్రిన్స్ యాదవ్ కూడా వికెట్లు తీయడంతో ఐర్లాండ్ వేగంగా వికెట్లు కోల్పోయింది. కాగా అర్ధసెంచరీ పూర్తి చేసిన హ్యారీ టెక్టార్... ఐర్లాండ్ స్కోరును 150 మార్కు దాటించాడు. భారత బౌలర్లలో అరంగేట్ర పేసర్ ప్రిన్స్ యాదవ్ మూడు వికెట్లు తీయగా.. అర్ష్‌దీప్ సింగ్, శివం దూబే చెరో రెండు, హర్షిత్ రాణా ఒక వికెట్ పడగొట్టారు.


ప్రిన్స్ యాదవ్ మూడు వికెట్లు

## ఆస్ట్రేలియా చేతిలో ఓడిన భారత్ మహిళలు

# టి20 ప్రపంచకప్ నుంచి ఔట్



**లండన్, జూన్ 28:** ఐసీసీ మహిళ టీ20 ప్రపంచకప్-2026 టోర్నీలో భారత్ పోరు లీగ్ దశలోనే ముగిసింది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఓడి సెమీస్‌కు దూరమైంది. మొదట భారత్ ఉమెన్స్ 4 వికెట్లకు 170 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా మరో ఓవర్ ఉండగానే నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా టాప్ ప్లేస్‌తో, సౌతాఫ్రికా సెకండ్ ప్లేస్‌తో గ్రూప్-నుంచి సెమీఫైనల్లో ప్రవేశించాయి. భారతన ఆడిన 5 మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, రెండు పరాజయాలతో ఆరు పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ మహిళలు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన(37 బంతుల్లో 38), షఫాలీ వర్మ(26 బంతుల్లో 34).. తొలి వికెట్‌కు 66 పరుగుల శుభారంభాన్నిచ్చారు. అయితే స్కోరును వేగంగా పెంచలేకపోయారు. తర్వాత వచ్చిన రోడ్రిగ్స్(28 బంతుల్లో 34)తో కలిసి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన హర్మన్‌ప్రీత్(27 బంతుల్లో 56 రన్స్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడి స్కోరు వేగం పెంచింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కెప్టెన్ సోఫీ మోలినెక్స్ రెండు వికెట్లు తీసింది.

ఇక లక్ష్య ఛేదనకు దిగిన ఓపెనర్ జార్జియా వోల్ (4)ను ఔట్ చేసి ఆసీస్‌కు ఆదిలోనే రేణుకా సింగ్ షాకిచ్చింది. అయితే, బెత్ మూనీ (22), ఫోబీ లిచిఫీల్డ్ (22) నిలకడగా ఆడుతూ స్కోరును ముందుకు నడిపారు. ఆ తర్వాత వచ్చిన పెర్రి (38 బంతుల్లో 56), గార్డ్నర్ (29 బంతుల్లో 53 నాటౌట్) అద్భుత అర్ధ శతకాలతో దుమ్మురేపారు. నాలుగో వికెట్‌కు వంద పరుగులు జోడించి విజయానికి బాటలు వేశారు. ఆరు వికెట్ల విజయాన్ని అందించారు.



# ప్రపంచ రోయింగ్‌లో భారత్‌కు తొలి స్వర్ణం

**లూసర్నే(స్విట్జర్లాండ్), జూన్ 28:** ప్రపంచ రోయింగ్ కప్‌లో భారత రోయర్లు చరిత్ర సృష్టించారు. ప్రపంచ రోయింగ్‌లో తొలిసారి భారత్‌కు స్వర్ణం అందించారు. స్విట్జర్లాండ్‌లోని లూసర్నే వేదికగా జరుగుతున్న ప్రపంచ రోయింగ్ కప్‌లో భాగంగా ఆదివారం జరిగిన పురుషుల లైట్ వెయిట్ డబుల్స్ స్కల్స్ ఫైనల్లో ఉజ్వల్ కుమార్, లక్షయ్ జోడీ పోటీపడ్డారు. రేసు ఆరంభం నుంచి వేగంగా దూసుకుపోయిన భారత జోడీకి హాంకాంగ్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. ఉజ్వల్, లక్షయ్ జోడీ 6 నిమిషాల 26.09 సెకన్లలో రేసు పూర్తి చేశారు. అగ్రస్థానంతో పసిడి పతకం అందుకున్నారు. తరువాతి రెండు స్థానాల్లో నిలిచిన హాంకాంగ్, నెదర్లాండ్స్ ఖాతాలో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ చేరాయి. భారత్‌కు ప్రపంచకప్ రోయింగ్‌లో ఇదే తొలి స్వర్ణం. గతంలో 3 కాంస్యాలు మాత్రమే అందుకుంది. 2009లో మహిళల క్వాడ్రపుల్‌లో.. 2019, 2022లో మహిళల పారా పెయిర్స్ విభాగాల్లో భారత్ కాంస్యాలు నెగ్గింది. భారత్‌కు స్వర్ణం అందించిన ఉజ్వల్ కుమార్, లక్షయ్ భారత ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్నారు.



# యుఎస్ ఓపెన్ ఫైనల్లో కిడాంబి శ్రీకాంత్

**కాలిఫోర్నియా, జూన్ 28:** భారత్ స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్... యుఎస్ ఓపెన్‌లో టైటిల్ ఆశలను రెట్టింపు చేశాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఆదివారం జరిగిన సెమీ ఫైనల్లో జపాన్ ప్లేయర్ యుదై ఒకిమోటోను మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో 22-20, 15-21, 21-19తో ఓడించాడు. ఈ మ్యాచ్ గంటా 12 నిమిషాల పాటు జరిగింది. ఫైనల్లో చైనీస్ తైఫీకి చెందిన సు లి యాంగ్‌తో కిడాంబి తలపడనున్నాడు. కాగా భారత యువ షట్లర్లు రౌనక్ చౌహాన్, దేవికా సిహాగ్ పోరు సెమీఫైనల్లోనే ముగిసింది.

2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్ సిల్వర్ మెడలిస్ట్ కిడాంబి శ్రీకాంత్.. సెమీస్‌పోరును చక్కగా ఆరంభించాడు. 9-5తో ఆధిక్యం చాటాడు. ఆ తర్వాత దానిని 17-10కి పెంచుకున్నాడు. అయితే ఒకిమోటో అద్భుతమైన కమ్ బ్యాక్‌తో ఏకంగా పది పాయింట్లు సాధించి సమవుజ్జీగా నిలిచాడు. ఇద్దరూ మధ్య సుదీర్ఘ ర్యాలీలు కొనసాగాయి. చివరకు కిడాంబి తొలి గేమ్‌ను 22-20తో నెగ్గి కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో పుంజుకున్న ఒకిమోటో 21-15తో నెగ్గి సమం చేశాడు. ఫలితం తేల్చే మూడోగేమ్‌లోనూ ఇరువురూ పోటీపోటీగా తలపడ్డారు. చివరకు కిడాంబి వరుసగా ఆరు పాయింట్లు సాధించి పైచేయిగా నిలిచాడు. ఈ గేమ్‌ను తన ఖాతాలో వేసుకుని ఫైనల్లో ప్రవేశించాడు.

### సెమీస్‌లో రౌనక్, దేవికా బోల్తా

మరో పురుషుల సింగిల్స్ సెమీస్‌లో యువ షట్లర్ రౌనక్ చౌహాన్ అద్భుత ప్రదర్శన ముగిసింది. అతను సు లి యాంగ్ చేతిలో 17-21, 19-21 తేడాతో వరుస గేమ్‌ల్లో పరాజయం పొందాడు. ఈమ్యాచ్ 46నిమిషాల్లోనే ముగిసింది. ఇక ఈ ఏడాది ఆరంభంలో థాయిలాండ్ మాస్టర్స్ గెలిచిన ఆరో సీడ్ దేవిక సిహాగ్... మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో రెండో సీడ్ లైన్ క్రిస్టోఫర్‌సెన్(డెన్మార్క్) చేతిలో 21-15, 11-21, 15-21 తేడాతో ఓటమి పాలైంది. తొలి గేమ్‌ను నెగ్గి శుభారంభం చేసిన దేవిక అదే రోజు మిగతా రెండు గేమ్‌ల్లో చాటలేక చతికిలపడింది.

# టాప్ ఆరు కంపెనీల్లో 89వేల కోట్ల ఎంక్యాప్ వృద్ధి



**ముంబయి, జూన్ 28:** దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో ఆరు సంస్థలు గత వారం రూ.88 వేల 678 కోట్లకు పైగా మార్కెట్ విలువను పెంచుకున్నాయి. మరో నాలుగు కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ తగ్గింది. కాగా ఐసీఐసీఐ బ్యాంక్ అత్యధిక లాభం నమోదు చేసింది. సెలవు కారణంగా నాలుగు ట్రేడింగ్ రోజులకే పరిమితమైన మార్కెట్ విలువ పెరుగుదలలో ఐసీఐసీఐ బ్యాంక్ అగ్రస్థానంలో నిలిచింది. ఆ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.29 వేల 589 కోట్లు పెరిగి దాదాపు రూ.9.96 లక్షల కోట్లకు చేరింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.24 వేల 718 కోట్లు పెరిగి రూ.12.26 లక్షల కోట్లకు చేరింది. దేశీయ దిగ్గజ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.12 వేల 44 కోట్లు పెరిగి రూ.17.84 లక్షల కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ రూ.11 వేల 580 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్ విలువ రూ.9 వేల 323 కోట్లు, లార్సెన్ అండ్ టుబ్రో మార్కెట్ విలువ 1,424కోట్లు పెరిగాయి.

మరోవైపు, మార్కెట్ విలువ కోల్పోయిన కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్ అత్యధిక నష్టాన్ని చవిచూసింది. ఆ సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.35 వేల 615 కోట్లు తగ్గింది. అలాగే ఎల్‌ఐసీ మార్కెట్ విలువ రూ.21 వేల 189 కోట్లు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ విలువ రూ.11 వేల 144 కోట్లు, హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.5 వేల 322 కోట్లు తగ్గాయి. మార్కెట్ విలువల్లో మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అత్యంత విలువైన కంపెనీగా తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. ఆతర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో, ఎల్‌ఐసీ, హిందుస్థాన్ యూనిలీవర్ స్థానాల్లో నిలిచాయి.

# ఎక్సైజ్ సుంకాలతో రాష్ట్రాల ఖజానా కళకళ



**న్యూఢిల్లీ, జూన్ 28:** మద్యం అమ్మకాలతో రాష్ట్రాల ఖజానా కళకళలాడింది. రెండు నెలల వ్యవధిలోనే కొన్ని రాష్ట్రాల్లో ఎక్సైజ్ సుంకం వసూళ్లు 82 శాతం వరకు పెరిగింది. వసూళ్లలో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలవగా వృద్ధి రేటులో హర్యానా మొదటి స్థానాన్ని దక్కించుకుంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సీఏజీ) విడుదల చేసిన 10 ప్రధాన రాష్ట్రాల నెలవారీ కీలక సూచికల చూస్తే ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌మే కాలంలో ఉత్తరప్రదేశ్ రూ.10,600 కోట్లకు పైగా ఎక్సైజ్ ఆదాయాన్ని నమోదు చేసింది. హర్యానాలో ఎక్సైజ్ వసూళ్లు 82 శాతానికి పైగా పెరిగి రూ.2,300 కోట్లను దాటాయి. మొత్తం ఆదాయ పరంగా కర్ణాటక రెండో స్థానంలో ఉండగా వృద్ధి శాతంలో కేరళ రెండో స్థానంలో నిలిచింది.

మద్యం వినియోగం 14 శాతం పెరగడం, పలురాష్ట్రాలు ఎక్సైజ్ రేట్లను పెంచడం, తయారీ సంస్థలు ప్రాథమిక ధరలను సవరించడం వల్ల ప్రభుత్వాలకు అధిక ఆదాయం సమకూరిందని పేర్కొంటున్నాయి. కర్ణాటక దేశంలోనే తొలిసారిగా ఆల్కహాల్‌ఇన్‌బెవరేజ్ ఆధారిత ఎక్సైజ్ విధానాన్ని అమల్లోకి తీసుకురాగా తక్కువ ఆల్కహాల్ శాతం ఉన్న మద్యంపై అమ్మకపు పన్ను తగ్గించే ప్రతిపాదనను కేరళ ప్రభుత్వం పరిశీలిస్తోంది.

రాష్ట్రాల సొంత పన్ను ఆదాయంలో ఎక్సైజ్ సుంకం వాటా 13.5 శాతంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ రూ.52,575 కోట్లతో అత్యధిక ఎక్సైజ్ ఆదాయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత కర్ణాటక 35వేల 784 కోట్లు, మహారాష్ట్ర రూ.25,466 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ.19,882 కోట్లు, పశ్చిమ బెంగాల్ రూ.19,521 కోట్లు, తెలంగాణ రూ.18,604 కోట్లు, మధ్యప్రదేశ్ రూ.15,201 కోట్లు, రాజస్థాన్ రూ.15,104 కోట్లతో ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ ప్రాంత రాష్ట్రాల్లో ఉత్తరాఖండ్ రూ.4,362 కోట్లతో అగ్రస్థానంలో ఉండగా మిజోరం కేవలం రూ.2 కోట్ల ఎక్సైజ్ ఆదాయంతో చివరి స్థానంలో నిలిచింది.




# కోల్‌కత్తాలో జీఎస్టీ సమావేశం

**న్యూఢిల్లీ, జూన్ 28:** దేశంలో పరోక్ష పన్ను విధానంలో మరో కీలక మార్పులకు జిఎస్టీ మండలి రంగం సిద్ధంచేస్తోంది. జీఎస్‌టీ కౌన్సిల్ 57వ సమావేశం వచ్చే నెలలో కోల్‌కతాలో నిర్వహించనున్నారు. పన్ను సంస్కరణలు, తయారీ రంగానికి ఊరటనిచ్చే నిర్ణయాలు, ఆటిజం కేర్ సెంటర్లపై జీఎస్‌టీ తగ్గింపు వంటి కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశముంది. పశ్చిమ గత జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం గత ఏడాది సెప్టెంబర్ 3న జరిగింది. దాదాపు తొమ్మిది నెలల విరామం తర్వాత జరిగిన ఆ సమావేశంలో "జీఎస్‌టీ 2.0" సంస్కరణలను ప్రవేశపెట్టారు.

పన్ను రేట్ల సరళీకరణతో పాటు వ్యాపారాలకు అనుకూలంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈసారి కూడా పరోక్ష పన్ను వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చే అవకాశముందని పన్ను నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తయారీ రంగంపై భారం తగ్గించే అంశాలు జీఎస్‌టీ కౌన్సిల్ పరిశీలించే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఇన్‌వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ కారణంగా ఇన్‌పుట్ సర్వీస్ ఐటీసీ రీఫండ్ లభించకపోవడం వల్ల తయారీ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందని బెంగాల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జాతీయ ఫిస్కల్ అఫైర్స్ అండ్ టాక్సేషన్ కమిటీ ఛైర్మన్ వివేక్ జలాన్ పేర్కొన్నారు. ఈ లోపాన్ని సరిదిద్దితే పన్నుల భారం తగ్గడంతో పాటు తయారీ రంగ పోటీతత్వం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆటిజం కేర్ సెంటర్లు, వాటికి సంబంధించిన సేవలపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించాలని కూడా జీఎస్‌టీ కౌన్సిల్‌ను కోరినట్లు తెలుస్తోంది.

# డివిడెండ్లు, షేర్ బైబాక్‌లతో ఈ వారం బిజీ

**ముంబయి, జూన్ 28:** వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్లో పలు ప్రముఖ లిస్టెడ్ కంపెనీల షేర్లకు కీలక కార్పొరేట్ చర్యలు అమల్లోకి రానున్నాయి. 29 నుంచి జూలై 3 వరకు డివిడెండ్లు, ప్రత్యేక డివిడెండ్లు, షేర్ బైబ్యాక్‌లు, స్పిన్‌ఆఫ్ వంటి చర్యలకు సంబంధించిన ఎక్స్‌డేట్లు నిర్ణయించబడ్డాయి. దీంతో ఆయా కంపెనీల షేర్లపై పెట్టుబడిదారుల దృష్టి కేంద్రీకృతమైంది.

29న జ్యోతి ల్యాబ్స్ షేరుకు రూ.3.50 తుది డివిడెండ్, కన్సాయ్ నెరోలాక్ పెయింట్స్ షేరుకు రూ.2.50, కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ షేరుకు రూ.11, రేమండ్ లైఫ్‌స్టైల్ షేరుకు రూ.1 తుది డివిడెండ్‌లకు ఎక్స్‌డేట్ ఉంటుంది. 30న బజాజ్ ఫిన్‌సర్వ్ రూ.1.50 తుది డివిడెండ్ ఇవ్వనుండగా, బజాజ్ హోల్డింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఒక్కో షేరుకు రూ.50 తుది డివిడెండ్‌తో పాటు మరో రూ.50 ప్రత్యేక డివిడెండ్ ప్రకటించింది. బజాజ్ ఫైనాన్స్ రూ.6 ప్రత్యేక డివిడెండ్, మహారాష్ట్ర స్కూటర్స్ రూ.60 ప్రత్యేక డివిడెండ్, వెల్‌స్పన్ కార్ప్ రూ.5 ప్రత్యేక డివిడెండ్‌లకు కూడా అదే రోజు ఎక్స్‌డేట్ ఉంటుంది.




జూలై 1న డీసీఎం శ్రీరామ్ ఫైన్ కెమికల్స్, గ్రోవీ ఇండియా, కెమ్‌బాండ్ మెటీరియల్ టెక్నాలజీస్ కంపెనీల ప్రత్యేక డివిడెండ్లకు ఎక్స్‌డేట్ నిర్ణయించారు. భారత్ ఫోర్జ్ ఒక్కో షేరుకు రూ.6.50, బయోకాన్ రూ.0.50, మహీంద్రా అండ్ మహీంద్రా రూ.33, టెక్ మహీంద్రా రూ.36, శ్రీరామ్ ఫైనాన్స్ రూ.6, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.5, వెల్‌స్పన్ ఎంటర్‌ప్రైజెస్ రూ.3, థర్మాక్స్ రూ.14 తుది డివిడెండ్‌తో పాటు రూ.6 ప్రత్యేక డివిడెండ్ ప్రకటించాయి. అదే రోజున ఎస్కార్ట్స్ కుబోటా రూ.33, ఎక్స్‌డ్ ఇండస్ట్రీస్ రూ.2, మ్యాక్స్ హెల్త్‌కేర్ రూ.2, రెడింగ్టన్ రూ.6, ఎస్‌కేఎఫ్ ఇండియా రూ.40, స్వరాజ్ ఇంజిన్స్ రూ.110, బాలాజీ అమీన్స్ రూ.11 తదితర కంపెనీలు కూడా డివిడెండ్లు అందించనున్నాయి. కార్పొరేట్ చర్యల్లో భాగంగా 29న కజారియా సెరామిక్స్ మరియు పటేల్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ కంపెనీలు షేర్ బైబ్యాక్ చేపట్టనున్నాయి.




# వచ్చేనెలలో వస్తున్న మార్పులు చేర్పులు ఇవే!

**ముంబయి, జూన్ 28:** మరోరెండురోజుల్లో జులై నెల ప్రారంభం అవుతున్న తరుణంలో వచ్చేనెల 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పలు నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు సామాన్యుల రోజువారీ జీవితంతో పాటు వారి ఖర్చులపై కూడా ప్రభావం చూపనున్నాయి. ఎల్పీజీ సిలిండర్ ధరల నుంచి క్రెడిట్ కార్డు నిబంధనలు, ఆధార్ సేవలు, విమాన ప్రయాణాలు, కార్ల ధరల వరకు మొత్తం ఐదు ప్రధాన మార్పులు అమల్లోకి రానున్నాయి. ప్రతి నెల మొదటి తేదీ మాదిరిగానే జూలై 1న కూడా చమురు సంస్థలు ఎల్పీజీ సిలిండర్ ధరలను సవరించనున్నాయి. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో వాణిజ్య ఎల్పీజీ ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఏవియేషన్ టర్బయిన్ ఫ్యూయెల్ ఎటిఎఫ్ ధరలను కూడా సవరించనుండటంతో విమాన టికెట్ ధరలపై ప్రభావం పడే అవకాశముంది హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రెగాలియా గోల్డ్ క్రెడిట్ కార్డు వినియోగదారులకు కూడా కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఉచిత దేశీయ విమానాశ్రయ లాంజ్ సదుపాయాన్ని పొందాలంటే, గత త్రైమాసికంలో కనీసం రూ.60 వేల ఖర్చు చేసిన వారికే ఈ సౌకర్యం కొనసాగుతుంది. ఆధార్ కార్డు వినియోగదారులకు మాత్రం ఊరట లభించనుంది. యుఐడిఎనిర్ణయం ప్రకారం ఆధార్‌లో ఈమెయిల్ ఐడీని అప్‌డేట్ చేసుకునే సేవ జూలై 1 నుంచి డిసెంబర్ వరకు ఉచితంగా అందుబాటులో ఉంటుంది. గతంలో ఈ సేవకు రూ.75 రుసుము వసూలు చేసేవారు. కారు కొనుగోలు చేయాలనుకునే వారికి జూలై నెల నుంచి అదనపు భారం తప్పదు. కియా, టాటా మోటార్స్ వంటి ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలు తమ వాహనాల ధరలను 1.5 శాతం నుంచి 2 శాతం వరకు పెంచనున్నట్లు ప్రకటించాయి. దీంతో జూలై నుంచి కొత్త కారు కొనుగోలు మరింత ఖరీదుగా మారనుంది.



# ఇరాన్‌వార్, ఇన్వెస్టర్ల ధోరణులే కీలకం

### ఈవారం మార్కెట్ ధోరణులపై స్టాక్ నిపుణుల దిక్సూచి

**ముంబయి, జూన్ 28:** అమెరికా-ఇరాన్ మధ్య తాజా సైనిక పరిణామాలు, వాటి ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల కదలికలు, దేశీయ ఆర్థిక గణాంకాలు వంటివి ఈ వారం ఈ వారం భారత స్టాక్ మార్కెట్ దిశను నిర్దేశించనున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల పెట్టుబడి ధోరణి, నైరుతి రుతుపవనాల పురోగతి కూడా మార్కెట్‌పై ప్రభావం ఉంటుంది. రిలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా మాట్లాడుతూ ఈ వారం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ, హెచ్‌ఎస్‌బీసీ తయారీ, సేవలు, కాంపోజిట్ పీఎంఐ తుది గణాంకాలు, దేశ విదేశీ మారక నిల్వల వివరాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తారన్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరల మార్పులు, పశ్చిమాసియాలోని భౌగోళిక ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా కొనసాగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

జూలై 1న విడుదల కానున్న ఆటోమొబైల్ కంపెనీల నెలవారీ విక్రయాల గణాంకాలపై కూడా మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్‌ముడి ఆర్ మాట్లాడుతూ అమెరికా-ఇరాన్ మధ్య తాజా సైనిక పరిణామాల నేపథ్యంలో మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల ఆందోళనకు కారణమవుతున్నాయని తెలిపారు. పరిస్థితులు సద్దుమణిగితే మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ కొనసాగుతుందని, అయితే ఉద్రిక్తతలు మరింత పెరిగితే ప్రపంచ ఆర్థిక వృద్ధి అంచనాలు, ఇంధన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా మాట్లాడుతూ ఈ వారం భారత్‌కు సంబంధించిన తయారీ పీఎంఐ, మే నెల పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలతో పాటు అమెరికా తయారీ సూచీ విడుదల కూడా మార్కెట్లకు కీలకం అవుతుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | సోమవారం 29 జూన్ 2026 | I



# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో కోడూరికి స్థానం






**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్28,ప్రభాతవార్త.** పర్యావరణ పరిరక్షణకు స్ఫూర్తి గా నిలిచిన తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు కి చెందిన కోడూరి రాఘవేంద్ర బాబు కి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం లభించింది.జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం లో భాగంగా 365 డేస్ ప్రోగ్రాం కి అండ్ చెక్ పీఎస్ పై పర్యావరణ దినోత్సవం అని చెప్పినందుకు గాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఆయన కి ఈ పురస్కారాంని అందజేశారు. ఈ సందర్భంగా 25వ తారీఖున సర్టిఫికెట్ పంపారు. ఎంపీపీ విద్యార్థి అయిన కోడూరి రాఘవేంద్ర బాబు అబ్దుల్ కలాం సేవ సమితి అధ్యక్షుడు గా కూడా వున్నారు.ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

## వాడపల్లి దేవస్థానం అభివృద్ధి పనులను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ ఈఓ నల్లం.

### స్వామివారికి అష్టోత్తర పూజ, నిత్య కళ్యాణంలలో పాల్గొన్న భక్తులు.







**ఆత్రేయపురం, జూన్ 28,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో జరిగే పలు అభివృద్ధి పనులను ఆదివారం డిప్యూటీ కమిషనర్ ఈఓ నల్లం సూర్య చక్రధర్రావు పరిశీలించారు.వకుళమాత అన్నదాన భవనం పక్కనే భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మిస్తున్న రూములు డార్మెటరీ పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులు సూచించారు.ఆదివారం కావడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉచిత ప్రసాదం, త్రాగునీరు, మజ్జిగ చలివేంద్రం, అన్నప్రసాదాలు ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.


## పెట్రోల్ బంక్ సెంటర్లో....

### రోడ్డుపై మురుగు వ్యర్థాలతో ప్రజల ఇక్కట్లు.



**తాళ్లరేవు, జూన్ 28 (ప్రభాతవార్త):** తాళ్లరేవు పెట్రోల్ బంక్ సెంటర్లో జాతీయ రహదారి 216 నుండి గాడిమొగ వెళ్లే ప్రధాన రహదారిపై పేరుకుపోయిన మురుగు నీరు వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న పలు దుకాణ సముదాయాలు వృద్ధ నీటిని రోడ్డుపై వదిలేయడంతో ఆ ప్రాంతంలో గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతలలో నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గాడిమొగ పంచాయతీలోని అన్ని గ్రామాలతో పాటు రిలయన్స్, ఓఎన్జీసి లాంటి చమురు సంస్థలకు వెళ్లడానికి కూడా ఇదే ప్రధాన మార్గం. నిత్యం పలు వాహనాలు, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రదేశంలో రోడ్డుపై మురుగు నీరు ఉండడంతో ఆ నీరు వాహనాలు వెళ్లేటప్పుడు నడిచి వెళ్ళే ప్రజలపై పడుతుంది. జాతీయ రహదారిపై వెళ్లేవారు సైతం ఈ గుంతలను గమనించకుండా వెళ్లడంతో జారిపోయి పడిపోతున్నారు. ఇలా రోజు జరుగుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కోరంగి పంచాయతీ కార్యదర్శి కి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని పలువురు ఆరోపించారు. దీనిపై పంచాయతీ, సంబంధిత అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మణప్పురం ఫైనాన్స్లో భారీ మోసం..




**రామచంద్రపురం జూన్28(ప్రభాతవార్త):** నమ్మకానికి నిలువుదోపిడీ జరిగింది.కష్టమర్లు ప్రాణప్రదంగా దాచుకున్న పసిడిపై నిలువునా దగా జరిగింది.ద్రాక్షారామంలోని మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్లో భారీ గోల్మాల్ వెలుగుచూసింది.కష్టమర్ల అసలు బంగారాన్ని మాయం చేసి,ఆ స్థానంలో నకిలీ నగల ముక్కలు పెట్టిన వైనం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.ఈ నెల 24న సంస్థ ఏరియా హెడ్ భాను ప్రసాద్ నిర్వహించిన వార్షిక తనిఖీల్లో ఈ బండారం బయటపడింది.ఎనిమిది మంది ఖాతాదారులకు చెందిన గోల్డ్ ప్యాకెట్లను పరిశీలించగా లోపల ఉన్నది నకిలీ బంగారమని తేలింది.మాయమైన 151గ్రాముల అసలు బంగారం విలువ సుమారు రూ.19.63లక్షలు ఉంటుందని అధికారులు లెక్కగట్టారు.ఇటీవలే బ్రాంచ్ హెడ్ పదవికి రాజీనామా చేసిన మహేష్ అనే వ్యక్తి ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు ప్రాథమికంగా గుర్తించారు.సీట్లో ఉన్నప్పుడే కస్టమర్ల సొమ్మును పక్కదారి పట్టించి,లాకర్లలో నకిలీవి ఉంచినట్లు తేలింది.సంస్థ ప్రతినిధుల ఫిర్యాదుతో ద్రాక్షారామం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.తాకట్టు పెట్టిన సొమ్ము మాయమవడంతో ఖాతాదారులు లబోదిబోమంటున్నారు.


## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక యధావిధి

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం కలెక్టరేట్, జూన్ 28 ప్రభాతవార్త** నేడు జూన్ 29వ తేదీన స్థానిక కలెక్టరేట్ కార్యాలయం గోదావరి భవనం నందు ప్రతీ సోమవారం నిర్వహించే మీకోసం.పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీల స్వీకరణ చేపడుతునున్నట్టు తెలిపారు. మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా డివిజనల్, మండలస్థాయిలో రెవెన్యూ క్లినిక్ లు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజలు తమ రెవెన్యూ అర్జీలను ఈ క్లినిక్ ల్లో అందజేయాలని సూచించారు. అర్జీదారులు తమ అర్జీలను ఈ (మీకోసం.ఏపీ. జీవోవి.ఇన్) వెబ్సైట్ నందు కూడా నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి,సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సదరు ప్రకటన ద్వారా సూచించారు.

## అభ్యంతరాలు ఉన్నా చెరువులకు అనుమతులు



**అయినవిల్లి జూన్ 28 ప్రభాతవార్త** రొయ్యల చెరువుల తవ్వకాలకు వ్యతిరేకంగా మూడు సంవత్సరాల నుంచి కలెక్టర్ గ్రీవెన్సల్లో అభ్యంతరాలు తెలుపుతున్నప్పటికీ రైతుల గోడు పట్టించుకోకుండా అధికారులు అనుమతులు ఇవ్వడంపై రైతులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదునూరు గ్రామంలో కుమ్మరి కాలవను ఆనుకొని సుమారు మూడు వందల ఎకరాల భూమి వరి సాగు జరుగుతుంది మురుగు కాలువ వెంబడి నీరు దిగే మార్గాలను మూసివేసి కొంతమంది స్వార్ధ వ్యాపారులు రొయ్యల చెరువులు తవ్వకాలకి అనుమతులు సంపాదించి తవ్వకాలు ప్రారంభించారు గత కొన్ని సంవత్సరాలుగా తవ్వకాలు ప్రారంభిస్తారు అని తెలుసుకున్న అక్కడే వరి పండించే రైతులు సుమారు 100 మంది రైతులు ఉపాధి కోల్పోతున్నామని తమకు జీవనాధారమైన వరి పంటను రక్షించాలని అనుమతులు ఇవ్వవద్దని అనేక ఆందోళనలు చేపట్టినప్పటికీ రెవెన్యూ మత్స్యశాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు ప్రస్తుతం అక్కడి వరి రైతులు కోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తెచ్చినప్పటికీ అది వెకెట్ చేసిన వెంటనే రొయ్యల వ్యాపారులు త్రవ్వకాలు మొదలుపెట్టారు అధిక వర్షాలకు ఎగువ నుంచి వచ్చే మురుగునీరు వరి పంటను ముంపుకు గురిచేసి పంట నష్టం జరుగుతుంది ఆక్వా చెరువులు తవ్వకాలను నిలుపుదల చేసి అనుమతులు రద్దు చేయాలని రైతులు కోరుతున్నారు

## చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్28,ప్రభాతవార్త.** అమలాపురం పట్టణంలోని మార్కెట్ వద్ద గల ఈడబ్ల్యూఎస్ కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలోని చిన్నారులకు ఎమ్మెల్యే ఆనందరావు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి, పోలియో రహిత భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా ఈ చుక్కల మందు వేయించి, వారి భవిష్యత్తుకు రక్షణ కల్పించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రతి చిన్నారికి వ్యాక్సిన్ అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని వైద్యాధికారుల ను,సిబ్బందిని ఆదేశించారు. ప్రజారోగ్యానికి మన కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి పార్టీల ముఖ్య నాయకులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## మిత్ర హార్ట్ ఇన్స్టిట్యూట్లో పాత్రికేయులకు ఉచిత వైద్య శిబిరం


### గుండె వ్యాధి నిపుణులుఓబుల్ రెడ్డి సేవలు అభినందనీయం



**కాకినాడ రూరల్, జూన్ 28(ప్రభాతవార్త):** అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ వైద్య సంస్థ 'మిత్ర హార్ట్ ఇన్స్టిట్యూట్, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్' లో ఆదివారం కాకినాడ రూరల్ పాత్రికేయులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుండె వైద్య రంగంలో విశేష సేవలు అందిస్తూ, ప్రత్యేక మైలురాళ్ళను అధిగమిస్తున్న ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా. జి. ఓబుల్ రెడ్డి సేవల అభినందనీయమని పలువురు పాత్రికేయులు కొనియాడారు.ఈ సందర్భంగా సుమారు వందమంది పాత్రికేయులకు, వారి కుటుంబ సభ్యులకు ఆధునిక గుండె చికిత్సా (కార్డియాక్) వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు బిపి, షుగర్, ఈసిజి , టూడీకో వివిధ రకాల రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. నాణ్యమైన, సురక్షితమైన, అత్యాధునిక వైద్య సేవలను అందిస్తూ ఉభయ గోదావరి జిల్లాల ప్రజల నమ్మకాన్ని మిత్ర హార్ట్ ఇన్స్టిట్యూట్ చూరగొంది. ఈ హాస్పిటల్లో ఇప్పటివరకు జరిగిన మొత్తం చికిత్సల్లో 99.6 శాతం విజయవంతమైన ఫలితాలు నమోదు కావడం విశేషం. ఈ కార్యక్రమంలో వైద్యులు,హాస్పిటల్ మీడియా కోఆర్డినేటర్ రామకృష్ణ, వీరు, హాస్పిటల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

### కుటుంబ సమేతంగా వచ్చి కుమారుడికి

## పోలియో చుక్కలు వేయించిన కలెక్టర్






**రంపచోడవరం,జూన్ 28 :ప్రభాతవార్త.** పోలవరం జిల్లా పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సచివాలయ కార్యాలయంలో పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ పోలియో బూత్ను సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలియో వైరస్ నుండి చిన్నారులను రక్షించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి బాల బాలికల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే సాధారణ టీకాలు వేయించినప్పటికీ పల్స్ పోలియో రోజున అదనంగా పోలియో చుక్కలు వేయించడం తప్పనిసరని ఆయన తెలిపారు. పోలవరం జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు ఆరోగ్య శాఖ అధికారులకు సహకరించి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించేలా చూడాలని ఆయన కోరారు.అనంతరం జిల్లా కలెక్టర్ కుటుంబ సమేతంగా వచ్చి జిల్లా కలెక్టర్ కుమారుడికి పోలియో చుక్కలు వేయించారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్. పి.సరిత, జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఉమా, వైద్యాధికారులు నీలిమ, వినోద్,సూపర్వైజర్లు సత్యనారాయణ,విజయ్, రాఘవ, పంచాయతీ కార్యదర్శి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ పాఠశాలలలో

## పుస్తకాల యూనిఫామ్ విక్రయిస్తే చర్యలు తప్పవు.

### ఫీజులు వివరాలు నోటీసు బోర్డులో ప్రదర్శించాలి
### మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్



**గొల్లప్రోలు, జూన్ 28,(ప్రభాతవార్త)** గొల్లప్రోలు పట్టణ,మండల పరిధి ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు,యూనిఫామ్ అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లప్రోలు మండల విద్యాశాఖ అధికారి బి.వెంకట శివప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం అయినా స్థానిక ఎం ఆర్ సి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యాజమాన్యాలు పుస్తకాలు,యూనిఫాం కొనుగోలు చేయాలని బలవంతం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.అదికి ఫీజులు, పుస్తకాలు,యూనిఫాం తదితర స్టేషనరీ కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు విద్యార్థులు తల్లిదండ్రులు,ఎస్ఎఫ్ఐ ల నుండి కూడా తమకు ఫిర్యాదులు అందుతున్నట్లు తెలిపారు.విద్యార్థులకు ఇష్టం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు,యూనిఫామ్ లు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే అటువంటి పాఠశాలలపై కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ హెచ్చరించారు. విద్యార్థుల నుండి వసూలు చేసే ఫీజులు వివరాలు, పాఠశాలల గుర్తింపు అందరికీ కనిపించేలా ఆయా పాఠశాలల యాజమాన్యాలు నోటీసు బోర్డులో ప్రదర్శించాలని స్పష్టం చేశారు.

**అమ్మకాలు నిషిద్ధం:**

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు బుక్స్,యూనిఫామ్స్ బలవంతంగా అమ్మడం పూర్తిగా నిషేధించడం అయినదని ఎంఈఓ తెలిపారు.విద్యార్థుల నుండి వసూలు చేసే ఫీజుల వివరాలు,పాఠశాల గుర్తింపు అందరికీ కనిపించేలా నోటీస్ బోర్డులపై తప్పనిసరిగా పరదర్శించాలన్నారు.

**నిబంధన ఉల్లంఘిస్తే చర్యలు:**

నిబంధనలను ఉల్లంఘించి అధిక ఫీజులు వసూలు చేసినా పుస్తకాలు,యూనిఫారాలు విక్రయించినా ఆయా పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో స్పష్టం చేశారు.పాఠశాలలో చెల్లించే ప్రతి రూపాయికి అధికారిక రశీదు అడిగి తీసుకోవాలని తెలిపారు

## అంతర్వేదిలో వైభవంగా నరసింహునికి సప్తనది జలాభిషేకం.....





**సఖినేటిపల్లి జూన్ 28, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో నేడు అద్భుతమైన ఆధ్యాత్మిక వైభవం నెలకొంది. భక్తి భావంతో నిండిన వాతావరణంలో స్వామివారికి సప్తనదీ జలాలతో ప్రత్యేక మహా అభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చక పి శ్రీనివాసకిరణ్, ఆలయ చైర్మన్ వండర్ ఫ్యామిలీ నెంబర్ శ్రీ రాజా కలదిండి రామ చంద్ర రాజా బహదూర్ ల ఆధ్వర్యంలో గంగా, యమున, సరస్వతి, కావేరి, గోదావరి, సింధు, నర్మద వంటి పుణ్యనదుల పవిత్ర జలాలను సేకరించి, వాటితో స్వామివారికి విశిష్ట అభిషేకం ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక శక్తితో నింపింది. ప్రతి ఏడాది ఒకసారి జరిగే ఈ అరుదైన సప్తనదీ జలాభిషేకం, అంతర్వేది క్షేత్ర మహిమను మరింతగా చాటిచెప్పింది. స్వామివారి దివ్య దర్శనానికి వందలాదిగా తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అభిషేకానంతరం నిర్వహించిన మహా శాంతి హోమం ద్వారా ఆలయ ప్రాంగణం సంపూర్ణ ఆధ్యాత్మిక శాంతి వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ ఏం కే టి నాగవర ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## కూలిపోతున్న కొండలు తరలిపోతున్న సంపద.

### ఉక్కిరి బిక్కిరవుతున్న ప్రజలు.ఎన్నిదాడులు నిర్వహించిన యదేచ్ఛ గా మైనింగ్.





**రౌతలపూడి, (ప్రభాత వార్త)** రౌతులపూడి మండలంలో రాతి క్వారీలు. ఎర్రమట్టి క్వారీల కారణంగా ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు.బండరాయి, పిక్క రాయి.ఎర్రమట్టి లారీలు ప్రతీ రోజు 900ట్రిప్పులు గ్రామాల మీదుగా అధిక లోడుతో పయనిస్తున్నాయి. దీనితో మండల ప్రజలు బయటకు రావాలంటేనే భయభ్రాశీ తులవుచున్నారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు పగడ్భందీగా కాపుకాసి అధికారులు నిఘాపించినప్పటికీ . వారికన్నులు కప్పి యధావిధిగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.ఉప్పంపాలెం సర్వే నంబర్ 261/పి. చిన మల్లాపురం సర్వే నంబరు 1/పీ పరిధిలో నియమ నిబంధనలు పాటించకుండా త్రవ్వకాలు నిర్వహిస్తున్నారు. పచ్చ ధనశీ,పరిశుభ్రత తో పాటు. ధూళి, దుమ్ము రాకుండా బ్లాస్టింగ్ శబ్దాలు వినిపించకుండా క్వారీ కార్య క్రమాలు నిర్వహించుకోవాల్సింది. అయితే ఇవేమీ వారికి పట్టవన్నుట్లుగా క్వారీల యాజమాన్యం వ్యవహరిస్తుంది. రోజు వారి బ్లాస్టింగులు, వందల లారీల రాకపోకలతో ఉప్పంపాలెం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . ఈ లారీలు, బ్లాస్టింగ్ శబ్దాలు కు కొన్ని గృహాలు బీటలు వేస్తున్నాయనివాపోతున్నారు. ఈ క్వారీ ల కారణంగా రోగులు,వృద్ధులు,విద్యార్థుల బాధ వర్ణనాతీతంగా వున్నాయి. ఇక్కడ ఏ, ఎస్, ఎన్, క్వారీ పుణ్యమా అంటూ కంటిమీద కునుకికి దూరమయ్యామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక పర్యాయములు లారీలపై నుంచి బండరాళ్లు పడి ప్రమాదాలు జరిగిన సందర్భాలున్నాయి. ఇక్కడ బ్లాస్టింగ్లు నిబంధనలకు వ్యతిరేకంగా సరియైన రీతిలో గ్రీన్ బెల్ట్ లేకుండా నిర్వహించడం గమనార్హం. రాళ్లను తరలించుకు పోవడంతప్ప స్థానిక ప్రజలకు ప్రయోజనంలేదు. ఇక్కడ కంపెనీలలో వివిధ రాష్ట్రాల నుంచి వర్కర్స్ ను తీసుకొనివచ్చి పనులు చేయించుకుంటున్నారు.ప్రశ్నించిన వారిపై కేసులు బనాయిస్తున్నారని వినికిడి.మండలంలో 26నల్ల రాయి,ఒక గ్రానైట్ క్వారీ ఉండగా 13నల్లరాయి క్వారీలు యదేచ్ఛగా తవ్వకాలు నిర్వహిస్తున్నాయి.ములగపూడి, ఎస్,పైడిపాల, తిరుపతమ్మపేట, ఉప్పంపాలెం, మాతయ్య పేట, నల్లరాయ క్వారీల నిర్వహణ జరుగుతుంది. వీటిలో కొన్ని క్వారీ లు నిలిపివేసినట్లు చూపించి యధావిధిగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.గతంలో ములగపూడి, ఎస్.పైడిపాల గ్రామ శివారులో అక్రమ మైనింగ్ ను గుర్తించిన అధికారులు జే సి బీ లను.లారీలను సీజ్ చేసి కేసులు నమోదుచేశారు .ఎన్నిసార్లు కేసులు నమోదు చేసినా క్వారీల యాజమాన్యం లో మార్పు కనబడటంలేదు.దీనిపై నిఘా పెట్టిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఈ మధ్య కాలంలో దాడులు నిర్వహించి కేసులు పెట్టి కొలతలు ఆధారంగాజరిమానా కూడా విధించారు. ఈ లారీలు ప్రయాణిస్తున్న గ్రామాల ప్రజలు టీ బీ మరియు క్యాన్సర్ వ్యాధిని పడుచున్నారు.రోడ్లకు ఇరువైపుల ఉన్న గృహాలవారు ఇళ్లకుబారీ బ రకాలు కప్పుకుని నివసించ వలసివస్తుంది.ప్రజలు రోడ్డు మీదకి రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. వాహనాలు ధూళి వెలజెల్లుచున్నాయని గ్రామస్థులు అడిగితే రోడ్లపై నీరు ట్రాక్టర్ల ద్వారా వెదజల్లుచున్నారు. కొండ నాలుకకు మందు వేస్తే వున్న నాలుక ఊడిందన్నట్లు నీరు కారణంగా రోడ్లు బురదమైమవు చున్నాయి .ఒకప్రక్క గోతులు, మరోప్రక్క ధూళి, ఇంకోప్రక్క నీరు పడిన రోడ్డుపై పరిమితికి మించిన లోడుతో బారీ వాహనాలు ప్రయాణించడంతో రోడ్లు ధ్వంసమవుచున్నాయి. అది , కారులు ఎన్నిసార్లు కేసులు బనాయించిన లెక్కలేనితనంగా మారింది. దీనిపై నిఘా ఉంచి సరియైన చర్యలు తీసుకుని, కాలుష్య కోరలు నుంచి, బారీ వాహనాల ప్రమాదాలనుంచి తమను కాపాడాలని , ఈ మధ్య కాలంలో నిర్వహిస్తున్న దాడులు నిరంతరం కొనసాగించాలని ప్రజలు కోరుచున్నారు

**పురపాలక సంఘం - ఏలేశ్వరం**

ఆర్.ఓ.సి.నెం.103/ఇ1/2026 తేది:27-06-2026

**ఇ - ప్రొక్యూర్మెంటు టెండరు నోటీసు**

ఏలేశ్వరం పురపాలక సంఘము నందు సాధారణ నిధుల నుండి 01 పనికి గానూ రూ.4.40 లక్షలతో ఇ ప్రొక్యూర్మెంట్ టెండర్ కి పిలవడమైనది.

1. టెండరు షెడ్యూల్ డౌన్లోడింగ్ ప్రారంభ తేది: 27-06-2026 ఉ.11.00 గం॥ల నుండి
2. టెండరు షెడ్యూల్ డౌన్లోడింగ్ ముగింపు తేది: 14-07-2026 మ.గం.03.00 ల వరకు.

మిగిలినవివరముల కొరకు
www.tender.apeprocurement.gov.in
వెబ్సైట్ నందు చూడగలరు.

కమీషనరు,
ఏలేశ్వరం పురపాలక సంఘము



# చెరువులా మారిన మెయిన్ రోడ్డు..!

## డ్రైన్లు కబ్జాతో ప్రజలు ఇక్కట్లు



గొల్లప్రోలు, జూన్ 28,(ప్రభాతవార్త) గొల్లప్రోలు పట్టణ పరిధిలో డ్రైనేజీ కాల్వల ఆక్రమణలు ప్రజల పాలిట శాపంగా మారాయి.ఆదివారం కురిసిన భారీ వర్షానికి గొల్లప్రోలు ప్రధాన మెయిన్ రోడ్డు చెరువును తలపించింది.కేవలం గంటపాటు కురిసిన వర్షానికే డ్రైనేజీల ద్వారా దిగువకు మురికి నీరు ప్రవహించే అవకాశం లేకపోవడంతో కాలువలు పొంగిపొర్లాయి.దీంతో మెయిన్ రోడ్ జంక్షన్ లో మోకాళ్ళ లోతు నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మెయిన్ రోడ్డు పై పలువురు వ్యాపారస్తులు నిబ్బందులకు విరుద్ధంగా కట్టడాలు, షాపులు నిర్మించి మురుగునీరు ప్రవహించే కాలువలను కబ్జా చేయడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించుకోవడంతోనే రోడ్డుపైకి మురికి నీరు ప్రవహించిందని పట్టణవాసులు మండిపడుతున్నారు.

**అసలు కారణం ఇదే..**

వ్యాపార సముదాయాలు,భవనాల నిర్మాణాల వల్ల ప్రధాన డ్రైనేజీ కాల్వలు ఆక్రమణకు గురైన టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు.దీనికి తోడు కాల్వల్లో పూడిక తీయకపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర అడ్డంకులు ఏర్పడి మురికి నీరు ముందుకు వెళ్లే మార్గం లేక రోడ్డుపైకి ఉధృతంగా ప్రవహిస్తోంది.

మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి, కాల్వల ఆక్రమణలను తొలగించాలని, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, పూడికతీత పనులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని గొల్లప్రోలు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మామిడికుదురు మండలంలో పల్స్ పోలియో విజయవంతం



మామిడికుదురు.జూన్ 28(ప్రభాతవార్త) మామిడికుదురు మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా సాగింది.నగరం పిహెచ్ సీ పరిధిలో 21 బూత్ కేంద్రాలు, లూటుకుర్రు పిహెచ్ సీ పరిధిలో 19 కేంద్రాలలో పోలియో చుక్కలు వేసినట్టు నగరం పిహెచ్సీ వైద్యులు జూన్ లెవీ, ఆర్.పావని తెలిపారు. నగరం పిహెచ్సీ పరిధిలో 3049, లూటుకుర్రు పిహెచ్సీ పరిధిలో 2531 పిల్లలకు పోలియో చుక్కలు వేయవలసిన లక్ష్యం కాగా 96 శాతం పూర్తి అయినట్టు వారు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో సూపర్వైజర్లు బి.నరసింహారావు, పి.భాగ్యవతి, ఎంఎల్హెచ్పీలు, సిహెచ్ఓలు,ఎంపీహెచ్ఏలు,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ప్రజలు సహకరించాలి...తహశీల్దార్



మామిడికుదురు.జూన్ 26(ప్రభాతవార్త) కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ప్రజలందరూ సహకరించాలని తహశీల్దార్ సీవీస్ రాజు కోరారు.ఆదివారం ఆయన పాశర్లపూడి, పాశర్లపూడిలంక,మామిడికుదురు గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో ఎస్ఐఆర్ నిర్వహణ తీరును పరిశీలించారు.అనంతరం గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.ఎస్ఐఆర్ నిర్వహణలో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా జాబితాలు రూపొందించాలని విధిగా సర్వే చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సచివాలయ, రెవిన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

## చిన్నారుల భవిష్యత్తుకు రక్షణ కవచం 'పల్స్ పోలియో'..

### ఎంఎస్ఎంఈ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ భూలక్ష్మి..



అంబాజీపేట(పి.గన్నవరం), జూన్ 28, (ప్రభాతవార్త): ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో చిన్నారుల ఆరోగ్యం అత్యంత కీలకమని, పోలియో రహిత భారతదేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల బోర్డు డైరెక్టర్ అంబటి భూలక్ష్మి అన్నారు.పి.గన్నవరం మండలంలోని ముంగండ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్దకు వచ్చిన పలువురు చిన్నారులకు ఆమె స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఐదేళ్ల లోపు వయస్సున్న ప్రతి ఒక్క చిన్నారికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, ఈ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలని తల్లులకు,కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. దేశం ఇప్పటికే పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందినప్పటికీ, భవిష్యత్తులో ఈ మహమ్మారి మళ్లీ తలెత్తకుండా ఉండాలంటే ప్రతి దఫా ముందస్తు జాగ్రత్తగా పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవశ్యకం అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు సమన్వయంతో ప్రతి ఇంటికీ చేరి ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహిస్తున్నారని ఆమె కొనియాడారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని,రేపటి పౌరులైన మన పిల్లలకు వైకల్యం లేని ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.?ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,ముంగండ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న రాజమండ్రి లా అండ్ ఆర్డర్ ఎస్పీ ఎ.వి. సుబ్బరాజు దంపతులు



ఆత్రేయపురం, జూన్ 28,(ప్రభాత వార్త) ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఆదివారం రాజమండ్రి లా అండ్ ఆర్డర్ ఎస్పీ ఎ.వి. సుబ్బరాజు దంపతులు శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు జూనియర్ అసిస్టెంట్ వెంకటరాజు, అర్చకులు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు.

## చిన్నారుల భవితకు బరోసా రెండు పోలియో చుక్కలు

### ఏపి బాలల హక్కుల కమిషన్ సభ్యులు గాంధీబాబు



వి.ఆర్.పురం,జూన్ 28,ప్రభాతవార్త రెండు పోలియో చుక్కలు చిన్నారుల నూరేళ్ల జీవితానికి భరోసా అని, ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమీషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు స్పష్టం చేశారు. ఆదివారం మండల కేంద్రం రేఖపల్లి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వి.ఆర్.పురం బిసి కాలనీలోని అంగన్వాడీ కేంద్రాల్లో గాంధీబాబు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని, చిన్నారులకు పోలియో చుక్కలువేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలియో చుక్కల ఆవశ్యకతను తల్లులకు వివరించారు. ప్రతి తల్లిదండ్రులు తమ 0 నుండి 5 సంవత్సరాల చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించి, పోలియో మహమ్మారిని రూపుమాపాలని పిలుపు నిచ్చారు. పోలియో రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఈ సందర్భంగా గాంధీబాబు కోరారు. ఇదిలా ఉండగా, మండల కేంద్రం రేఖపల్లి పరిధిలోని వివిధ కేంద్రాల్లో 1485 మంది చిన్నారులకు గాను, 1430 మంది చిన్నారులకు పోలియో చుక్కలను అందించారు. జీడిగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వివిధ కేంద్రాల ద్వారా 480 మంది చిన్నారులకు గాను, 494 మంది చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ చేసినట్లు జీడిగుప్ప వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ కుమార్ చెప్పారు. ఇదే విధంగా రేఖపల్లి లో జాతర జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం వరకు 1485 మందికి గాను, 1583 మంది చిన్నారులకు తాము పోలియో చుక్కలు అందించినట్లు రేఖపల్లి వైద్యాధికారి డాక్టర్ షేక్.నిలుఫర్ ప్రభాతవార్త కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ సభ్యులు వాళ్ల రంగారెడ్డి, తహసీల్దార్ సరస్వతి, నాయకులు బొర్రా నరేష్ కుమార్, మూలకాల సాయికృష్ణ, మాదిరెడ్డి సత్తిబాబు, మాదిరెడ్డి ప్రసాద్, మామిడి రాజు తదితరులు, వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూడు పి. హెచ్. సిలో లక్ష్యం దాటిన వ్యాక్సిన్.. 128.28 శాతం నమోదు..



రాజవొమ్మంగి, జూన్ 28, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలంలో గల మూడు పి. హెచ్. సి లు పరిధిలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో 2,602 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేయాల్సి ఉండగా 3,337 మందికి వ్యాక్సిన్ వేయడం జరిగింది. మూడు పి. హెచ్. సి లు కలిపి అదనంగా 635 మంది వ్యాక్సిన్ వేశారు. మూడుపి. హెచ్. లు కలిపి 128.28 శాతం నమోదు అయ్యింది .57 బూత్ లు, ఏడు రూట్ లు, మూడు మొబైల్ కలిపి 238 మంది అంగన్వాడీ లు, ఆశలు, వైద్య సిబ్బంది విధులను నిర్వహించారు. రాజవొమ్మంగిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. రాజవొమ్మంగి పి. హెచ్. సి పరిధిలో 1,225 మంది కి పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 1,591 మంది వేసి 140 శాతం లక్ష్యం చేరువ అయ్యిందని డా. సుష్మ తెలిపారు. 25 బూత్ లు, మూడు రూట్స్, ఒక మొబైల్ ద్వారా అంగన్వాడీ, ఆశలు, వైద్య సిబ్బంది కలిపి 108 మంది విధులను నిర్వహించారు. డా. సుష్మ, డా. సతీష్, సి. హెచ్. ఓ పద్మావతి, పి. హెచ్. ఎన్. వెంకటరత్నం, హెచ్. ఎస్. శ్రీధర్, హెచ్. వి. అప్పలనర్స, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. జడ్డంగి పి. హెచ్. సి పరిధిలో 20 బూత్ లు, 2 రూట్స్, ఒక మొబైల్ ద్వారా 80 మంది సిబ్బంది 867 మంది వ్యాక్సిన్ వేయాల్సి ఉండగా 1,049 మందికి వేసి 120 శాతం నమోదు కావడం జరిగిందని డా. పావని, డా. నాగార్జున తెలిపారు. గొడుగు నాగవాసు, భూముల వెంకటరమణ, నీలాద్రి లక్ష్మి, కంచెం శ్యామ్యూల్, కోండ్ల రాజబాబు, సింగిరెడ్డి పద్దరాజు, అంగన్వాడీలు, ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. లాగరాయి పి. హెచ్. సి పరిధిలో 12 బూత్ లు, 2 రూట్స్, ఒక మొబైల్ ద్వారా 510 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేయాల్సి ఉండగా 697 మంది వ్యాక్సిన్ వేసి 120 శాతం నమోదు అయ్యిందని డా. శరత్ చంద్ర అన్నారు. సి. హెచ్. ఓ విల్సన్ బాబు, హెచ్. వి. రమాబాయి, రామిరెడ్డి, రాజబాబు, 50 మంది విధులను నిర్వహించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి



సీతానగరం, జూన్ 28, (ప్రభాతవార్త) : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమంలో భాగంగా ఓటర్ల ధృవీకరణ, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో ఆర్. శివరాముడు సూచించారు. ఆదివారం ముగ్గళ్ళ గ్రామ సచివాలయంలో డిటి, బిఎల్ఓలతో ఆయన సమావేశమయ్యారు. ఓటర్ల మ్యాపింగ్ ధృవీకరణ, ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, వాటి డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షించారు. ఎన్యూమరేషన్ ఫారాలను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి, తప్పులు లేకుండా నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని బీఎల్ఓలకు ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని ఆర్. శివరాముడు సూచించారు.

## తాళ్ళరేవులో పల్స్ పోలియో పై ప్రచార లేమి.



తాళ్ళరేవు, జూన్ 28 (ప్రభాతవార్త): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమం పై తాళ్లరేవు మండలంలో పూర్తి స్థాయిలో ప్రచారం జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. మండలంలో గాడిమొగ పిహెచ్సి ప్రధాన కేంద్రంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ప్రజలకు సమాచారం అందజేయడంలో అందరూ బాధ్యత వహించాల్సి ఉండగా, క్షేత్రస్థాయి సిబ్బంది తప్ప మిగిలిన వాళ్ళు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న తీరు గోచరిస్తుంది. గాడిమొగ పి.హెచ్. సి. పరిధిలో ఇద్దరు వైద్యాధికారులు, ఒక ఎంపీహెచ్ఈఓ, నలుగురు సూపర్వైజర్లు, 24 మంది ఏఎన్ఎంలు, 9 మంది హెల్త్ అసిస్టెంట్లు, 72 మంది ఆశా వర్కర్లు, 24 మంది ఎమ్ఎల్ హెచ్ పి లు పనిచేస్తున్నారు.ఏ పిలుపు అమలు చేయాలన్నా క్షేత్రస్థాయి సిబ్బంది తప్ప మిగిలిన వాళ్ళు పూర్తి బాధ్యత వహించడం లేదని విమర్శలు వస్తున్నాయి. కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్ తో పిహెచ్సి వద్ద ఫోటోలు తీసి అదే గ్రామాల్లో ప్రచారం చేసినట్లు ప్రకటనలు ఇస్తున్నారు. ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో గురించి సైతం ప్రచారం చేయడంలో వైఫల్యం చెందారు. ప్రతిసారి పల్స్ పోలియో నిర్వహించిన రోజునే 98% వరకు వరకు పోలియో చుక్కలు పూర్తి చేసేవారు. ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో లో కేవలం 90 శాతం చిన్నారులకు మాత్రమే పల్స్ పోలియో చుక్కలు వేయడం గమనార్హం. ఇప్పటికైనా పిహెచ్సి వైద్యాధికారులు పూర్తిస్థాయిలో ప్రచారం చేసి ఏ చిన్నారి పోలియో వ్యాధికి గురికాకుండా ముందస్తు ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వైభవంగా తాళ్ళమ్మ తల్లి జాతర మహోత్సవం





రామచంద్రపురం,జూన్ 28(ప్రభాతవార్త): స్థానిక పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో వెలసిన రామచంద్రపురం పట్టణ గ్రామదేవత శ్రీశ్రీశ్రీ తాళ్ళమ్మ తల్లి జాతర తీర్థ మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి.అమ్మవారికి పసుపు,కుంకుమ,గాజులు,చీర సారెలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అనువంశిక ధర్మకర్తలు పిల్లావారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలను కనులపండువగా నిర్వహించారు.?ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అమ్మవారి గరగలను మంగళవాయిద్యాలు,వేదమంత్రాల నడుమ పట్టణమంతటా వైభవంగా ఊరేగించారు.అనంతరం ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి పోటెత్తారు.భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులతో పాటు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.జాతర ముగిసేవరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్థానిక పోలీసులు పటిష్టమైన బందోబస్తు,పర్యవేక్షణ ఏర్పాట్లు చేశారు.

## రాజపూడిలో పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ:



జగ్గంపేట జూన్ 28 (ప్రభాతవార్త) రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. – ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిసారి రెండు చుక్కలు పోలియోపై నిరంతరంగా విజయం అనే నినాదంతో ప్రతి ఐదు ఏళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. దేశాన్ని పోలియో రహితంగా ఉంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రేఖా బుల్లి రాజు, రాజపూడి సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి బుల్లెబ్బు, మాజీ సర్పంచ్ భూసాల విష్ణు, గనిశెట్టి సన్యాసిరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పూజ, మంచాల హేమాద్రి ప్రసాద్, కూటమి నాయకులు, ఆస్పత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజం అందరి బాధ్యత



రావులపాలెం, జూన్ 28 (ప్రభాతవార్త) : స్థానిక ఇందిరా కాలనీ ఎస్సీ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని కొత్తపేట ఎస్సీ సెల్ కార్యదర్శి వడ్లమూడి రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలియో రహిత భారత నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు చుక్కలు పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు రక్షణ కవచంలా పనిచేస్తాయని తెలిపారు. రావులపాలెం మండలంలోని అన్ని వార్డుల్లో పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ, ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్న ప్రతి తల్లిదండ్రులు తమ సమీప కేంద్రానికి వెళ్లి పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కూనవరం మండలంలో పల్స్ పోలియో విజయవంతం



కూనవరం, జూన్ 28, ప్రభాతవార్త : కూనవరం మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మండలంలోని కూనవరం, కూటూరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 1747 మంది 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు గాను 1885 పిల్లలకు లక్ష్యాన్ని మించి పోలియో చుక్కలు వేయడం జరిగింది. ప్రయాణాలలో ఇతర ప్రాంతాల నుండి వచ్చిన చిన్నారులకు సైతం పోలియో చుక్కలు వేయడంతో లక్ష్యాన్ని మించి పోలియో చుక్కలు వేయడం జరిగింది. ఆదివారం ఉదయం నుండి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పోలియో కేంద్రాలను ప్రారంభించడం జరిగింది. చింతూరు డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ ప్రశాంతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పలు సెంటర్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కూటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ దొర, కూనవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిలోఫర్ ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొన్నారు.

## గొల్లప్రోలులో వైభవంగా పాదాలమ్మ తల్లి జాతర -పోటెత్తిన భక్తులు



గొల్లప్రోలు, జూన్ 28,(ప్రభాత వార్త) గొల్లప్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో వేంచేసియున్న శ్రీ పాదాంబికా అమ్మవారి జాతర ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది.ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, సువాసనలు వెదజల్లే పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు.అమ్మవారిని దర్శించుకోవడానికి గొల్లప్రోలు పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయాయి.అమ్మవారికి పసుపు,కుంకుమ నైవేద్యాలు సమర్పించి భక్తులు దర్శించుకున్నారు.ప్రజలు తరలి రావడంతో ఆలయ పరిసరాలన్నీ ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయాయి.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ మొగలి అయ్యారావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాటులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు సత్యనారాయణ,గ్రంధి సత్తిబాబు, కేదారిశెట్టి ప్రసాద్,గొల్లపల్లి చిన్న కొండ తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి:ఆర్డీవో



రామచంద్రపురం,జూన్ 28(ప్రభాతవార్త): పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రామచంద్రపురం ఆర్డీవో సరళావతి,కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పిలుపునిచ్చారు.ఆదివారం స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్లో జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని వారు చిన్నారులకు చుక్కలు వేసి ప్రారంభించారు.?ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తల్లిదండ్రులు బాధ్యతగా పోలియో చుక్కలు వేయించాలని,ఒక్కరు కూడా విస్మరించవద్దని ఆమె కోరారు.వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పోలియో నిర్మూలనకు ఎంతో కృషి చేస్తున్నాయని,ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.?ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కె.సత్యనారాయణ,యూపీహెచ్సీ వైద్యులు డాక్టర్ గోపీకృష్ణ,డాక్టర్ అలేఖ్య,ఆశా వర్కర్లు,అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ద్వారా మానవత్వ విలువలు పెంపొందుతాయి.

### నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో... లయన్ డివిఎస్ రమేష్ రాజు.



తాళ్లరేవు, జూన్ 28 (ప్రభాతవార్త): లయన్స్ క్లబ్ లో చేరడం ద్వారా ప్రతి వ్యక్తిలోనూ సేవాగుణం అలవడడంతోపాటు, మానవత్వ విలువలు పెంపొందుతాయని లయన్స్ క్లబ్ ఏరియా లీడర్, న్యూ మెంబర్షిప్ ఇండక్షన్ ఆఫీసర్ డివిఎస్ రాజు (రమేష్) అన్నారు. ప్రపంచంలో అన్నింటికంటే మానవత్వ విలువలే ప్రధానమైన వని అన్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం తాళ్లరేవు శ్రీరంగనాయక పురం ఎం.టి. రాజు బంగ్లాలో ఆదివారం నిర్వహించిన తాళ్లరేవు,కోరంగి కురంగేశ్వర, గొల్లపాలెం, అమలాపురం కోనసీమ, లయన్స్ క్లబ్ ల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ పేరయ్య రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి ప్రారంభించిన లయన్స్ క్లబ్ లో పనిచేయటం ఒక వరంగా భావించాలన్నారు. అనేక క్లబ్బులు కొత్త మార్గాలలో సేవలు చేస్తూ ప్రజలకు చేరువ కావడం ఆనందాన్నిస్తుందని అన్నారు. అందులో తాళ్లరేవు లయన్స్ క్లబ్ కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ కార్యక్రమం ద్వారా అభాగ్యులకు ఉచిత భోజన క్యారేజీ లు అందించడం, చదువులకు సహకారం, లయన్ చిట్టూరి కృష్ణ జ్ఞాపకార్థం ఆసుపత్రిలో గర్భిణీలకు భోజనాలు అందజేయడం వంటి కార్యక్రమాలు మిగిలిన క్లబ్బులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వ్యక్తి కన్నా వ్యవస్థ ముఖ్యమని, వ్యవస్థ కోసం పనిచేయాలని సూచించారు. క్లబ్ ల సమావేశాలు తరచు వేయడం వల్ల ఏమి చేయాలనే అంశంపై స్పష్టత వస్తుందన్నారు. సభ్యులు నిరంతరం చర్చలు జరిపి కార్యక్రమాలను రూపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా తాళ్లరేవు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా కట్టా ఆదినారాయణ, కనుమూరి శ్రీనివాసరాజు, కోశాధికారిగా దెందులూరి బుచ్చిరాజు,కోరంగి కురంగేశ్వర క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా చిట్టూరి చలపతి, దడాల గోవిందమ్మ కోశాధికారిగా బిళ్ళకుర్తి విజయ వివేక్ రెడ్డి, గొల్లపాలెం క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా జక్కన్న రాజేష్, ఎం. రఘునాథరాజు, కోశాధికారిగా ఎస్ సూర్యనారాయణ రాజు, అమలాపురం కోనసీమ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా ఎం శ్రీనివాస్, డి శివరామకృష్ణ, కోశాధికారిగా జి రెడ్డి నాయుడులతో ఆయన ప్రమాణం చేయించారు. నూతన సారథులు ఆయా ప్రాంతాలలో క్లబ్ కార్యక్రమాలు విస్తరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రథమ ఉప గవర్నర్ పెదిరెడ్డి ఉమామహేశ్వరరావు, పూర్వపు గవర్నర్ ఈవీవీ ఈశ్వర కుమార్, ప్రతినిధులు బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, వేలూరి సూరిబాబు, నడింపల్లి వినోద్, ధూళిపూడి వెంకటరమణ, సతీష్ రాజు, నరేంద్ర రెడ్డి, చోడే శ్రీనివాస్, మాలతి వసుంధర, సురేష్, సామా భగవాన్, గుండు సీత, వైదాడి ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా పోలియో చుక్కల కార్యక్రమం



కాట్రేనికోన జూన్ 28 (ప్రభాతవార్త) కాట్రేనికోన మండలంలో పోలియో చుక్కల కార్యక్రమం ఆదివారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. కాట్రేనికోనలో ఏఎంసీ ఛైర్పర్సన్ ఓగురి భాగ్యశ్రీ, నాగిడి నాగేశ్వరరావు గ్రంథి నానాజీ తదితరులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరమన్నారు. కాట్రేనికోన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2420 మందికి , పల్లంకుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1893 మంది 0-5 సంవత్సరాల లోపు పిల్లలు అందరకి ఈ చుక్కలా మందు వేయడం జరిగినధని వైద్యులు డా.లిఖిత, నీలిమ తెలిపారు. మిగిలిన పిల్లలకు సోమవారం, మంగళవారం వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పూర్తి స్థాయిలో పిల్లలందరికి ఈ చుక్కలా మందు వేస్తారని తెలిపారు.

## ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ కూటమి లక్ష్యం

### రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శివ



శంఖవరం జూన్ 28 ప్రభాతవార్త రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ పేర్కొన్నారు. మండలంలోని కత్తిపూడి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వైద్యాధికారులు ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన చిన్నారు నుండి ఐదు సంవత్సరాల వయసు వరకు పిల్లలకు పోలియో చుక్కలు విధిగా వేయించాలని, పోలియో రహిత సమాజ నిర్మాణానికి పిల్లల తల్లిదండ్రులందరూ సహకరించాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి ఆరోగ్యం విద్య వంటి సర్వ మూలిక సదుపాయాలపై దృష్టి సారించి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తుందని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గాబు కృష్ణ మూర్తి కేలంగి జనార్ధన్ కంచిపోయిన శ్రీను నక్క శ్రీను సాధనాల లక్ష్మీ బాబు దేశ లింక వెంకటరమణ కొయ్య రమణ కర్రీ బుజ్జి ఆకుల పాపారావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## పాఠశాలకు రూ.50 వేలు ఆర్థిక సహాయం



మామిడికుదురు.జూన్ 28(ప్రభాతవార్త) మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ జూన్ 30వ.తేదీన పదవీవిరమణ పొందనున్న వన్నెంరెడ్డి సాయిబాబా దంపతులను ప్రధానోపాధ్యాయుడు బి. చిరంజీవి అధ్యక్షతన ఆదివారం జరిగిన సభలో ఘనంగా సత్కరించారు.సాయిబాబా ఉపాధ్యాయ వృత్తిలో నాలుగు దశాబ్దాలుగా ఉత్తమ సేవలు అందించారని ఎంఈఓ లు మోకా వెంకన్నబాబు, ఒ.శ్రీనివాస్ కొనియాడారు.సాయిబాబా తాను పనిచేసిన పాఠశాలకు తల్లి తండ్రుల స్మారకార్థం రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తాన్ని ఫిక్సుడ్ డిపాజిట్ గా జమ చేసి దానిపై వచ్చే వడ్డీని ఇంగ్లీష్ సబ్జెక్టులో ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలుగా అందించాలని కోరారు. ఈ సభలో ఎస్ఎంసీ చైర్మన్ వేగి శ్రీనివాస్, ఎంపిటీసీలు వర్ధినేని రాము,నయినాల సీతామహాలక్ష్మి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొలుపు జాతరలో స్వాములను దర్శించుకున్న తహసీల్దార్ సరస్వతి




వి.ఆర్.పురం,జూన్ 28, ప్రభాతవార్త మండలం కేంద్రం రేఖపల్లిలో జరుగుతున్న నాయకపోడు గిరిజనులు, గిరిజన కొండరెడ్ల ఇలవేల్పు దేవతలు చిన్న సార్లమ్మ, పెద్ద సార్లమ్మ, కొర్రాజుల కొలుపుల జాతరను ఆదివారం తహసీల్దార్ సరస్వతి సందర్శించారు. స్వాములను దర్శించుకున్నారు. ఇక్కడ ప్రతీ మూడేళ్ల ఒకసారి ఆదివాసీ నాయకపోడు గిరిజనులు, గిరిజన కొండరెడ్ల ఆచార సంప్రదాయాలతో జరిగే రాజులు కొలుపుల జాతరకు విశిష్టత ఉంది. ఈ నెల 20 న ప్రారంభమైన రాజుల కొలుపు జాతర 30 వ తేది మంగళవారం అత్యంత వైభవంతో ముగియనుంది. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకపోడు సేవా సంఘం పెద్దలు, కుల పెద్దలు, రాజుల కొలుపు కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## మండలంలో 44 కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమం




కె.గంగవరం,జూన్ 28,( ప్రభాత వార్త): కె గంగవరం మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి నట్లు వైద్య అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 44 పల్స్ పోలియో కేంద్రాలను, మొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేసి, ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేయించారు. పామర్రు ఆరోగ్య కేంద్రం ద్వారా 1455, దంగేరు 1325, కుందూరు 1389, పేకేరు ఆరోగ్య కేంద్రం క్యాంపుల ద్వారా 1325 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయించినట్లు అంచనా, ఈ కార్యక్రమాలను ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు హర్షిత, సత్య ఆమని, హేమ సుధీర్,శ్రీ లక్ష్మీ ,రేఖవాణి లు తమ వైద్య సిబ్బందితో నిర్వహించారు. సుందరపల్లి గ్రామంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఎంపీటీసీ తాడాల జానకిరామ్ (రాజు) పాల్గొనగా, పేకేరు గ్రామంలో పేకేటి బాబ్జి పాల్గొన్నారు. ఆరోగ ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తుందని పలువురు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎం పి హెచ్ ఈ ఓ లు, సూపర్వైజర్లు, ఎం ఎల్ హెచ్ పి లు, ఆశా కార్యకర్తలు, ఏ డబ్ల్యు డబ్ల్యు లు, అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పని చేశారు. గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## గొల్లప్రోలు లో విజయవంతమైన పల్స్ పోలియో



గొల్లప్రోలు, జూన్ 28,(ప్రభాతవార్త) గొల్లప్రోలు పట్టణ,మండల పరిధిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైద్యులు,ఆరోగ్య సిబ్బంది అత్యంత విజయవంతంగా నిర్వహించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలలో 5 సంవత్సరాలలోపు చిన్న పిల్లలందరికీ సిబ్బంది పోలియో చుక్కలు వేశారు.ఆయా ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది ఈ కార్యక్రమాన్ని ఉదయం నుండి సాయంత్రం వరకు నిరంతరాయంగా కొనసాగించారు.పోలియో కేంద్రాలకు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించారు.చిన్న పిల్లలను పోలియో మహమ్మారి నుండి రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి గొల్లప్రోలు పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు,జనసేన నాయకులు, బిజెపి నాయకులు తదితరులు పల్స్ పోరియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయగా మండల పరిధి చేబ్రోలులో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జయకృష్ణ, ఫైవ్ మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్,జడ్పిటిసి ఉలవకాయల నాగ లోవరాజు పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో వైద్యులు,ఆరోగ్య శాఖ సిబ్బందితో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో


తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


# పోలియో రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా పల్స్ పోలియో



కాకినాడ రూరల్, జూన్ 28 (ప్రభాతవార్త): పోలియో రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని రూరల్ మండలం లో ఆయా ప్రాంతాలలో పోలియో మహమ్మారిని తరిమి కొట్టడానికి చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆదివారం సర్పవరం గ్రామంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు జనసేన పార్టీ నాయకులు, మాజీ డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మాసేపల్లి బాబ్జి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి, ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు. తద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి, పోలియో వ్యాధి ను అరికట్టవచ్చు అన్నారు. పంచాయతీ కార్యదర్శి పద్మినీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పోలియో నిర్మూలన లక్ష్యంగా వైద్య సిబ్బంది ఆయా కేంద్రాలలో పని చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది,ఎ ఎన్ ఎమ్ శ్రీవాణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# 99శాతం పూర్తైన పల్స్ పోలియో



యు.కొత్తపల్లి, జూన్ 28 (ప్రభాతవార్త) : మండలంలో ఉన్న 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం 99శాతం పూర్తయినట్లు వైద్యాధికారులు సుష్మ, సౌజన్య, రాజ్ కుమార్ తెలిపారు. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 3,039 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయవలసి ఉండగా 3,001మందికి (98.76 శాతం), కొమరగిరి ఆరోగ్య కేంద్రం పరిధిలో 1032 మంది పిల్లలకు గాను 1045మంది (103 శాతం), నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2633 పిల్లలకు గాను 2577 మందికి (98శాతం) పిల్లలకు పోలియో చుక్కలు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వేశారు. మిగిలిన పిల్లలకు సోమవారం, మంగళవారం ఇంటింటికీ సర్వే చేసి చుక్కలు వేయడం జరుగుతుందని వైద్యులు తెలిపారు.

# చిన్నారుల భవిష్యత్తుకు రెండు చుక్కల రక్షణ..

**ఎమ్మెల్యే సత్యప్రభ -?ఉత్తరకంచిలో పల్స్ పోలియో కార్యక్రమం**

**చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన వైద్యులు, కూటమి నాయకులు**



ప్రత్తిపాడు, జూన్ 28 ( ప్రభాతవార్త) పోలియో మహమ్మారి లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఉత్తరకంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యశస్వి కొండంపూడి పర్యవేక్షణలో వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ఎమ్మెల్యే సత్యప్రభ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 0 నుండి 5 సంవత్సరాల లోపు ఉన్న పలువురు చిన్నారులకు ఆమె స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్య పరిరక్షణకు పోలియో చుక్కలు ఎంతో అవసరమన్నారు. సమాజం నుండి పోలియోను పూర్తిగా తరిమికొట్టడానికి ఈ రెండు చుక్కలు మందు ఎంత కీలకమో ప్రజలకు, ముఖ్యంగా తల్లులకు వివరించారు. నియోజకవర్గంలో ఏ ఒక్క చిన్నారి కూడా ఈ వ్యాక్సినేషన్‌కు దూరం కాకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు కూటమి నేతలు, ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త , రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, (బాబి) సుబ్బారెడ్డి సాగర్ (ప్రాజెక్ట్ చైర్మన్ ఇట్ల అప్పారావు, మండెల శ్రీను, జనసేన మండల వైస్ ప్రెసిడెంట్ శీరం శ్రీను, డాక్టర్ ఎం జి కొండయ్య, హెల్త్ సూపర్వైజర్ రామిశెట్టి రాంబాబు, హెల్త్ అసిస్టెంట్ జువ్వల రాజా, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎం లు, అంగన్వాడీ టీచర్లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న వైసీపీ నేత మురళీ రాజు..

**రాచపల్లిలో వధువుకు ఆశీస్సులు, రూ.20 వేలు ఆర్థిక సాయం**



ప్రత్తిపాడు, జూన్ 28 (ప్రభాతవార్త) మండలంలోని రాచపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన ఒక వివాహ వేడుకలో వైసీపీ నేత మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన భీమవరపు సత్తిబాబు కుమార్తె భవాని వివాహ వేడుకకు ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నేత, నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అతిథిగా హాజరయ్యారు. ?కళ్యాణ వేదికపై వధువు భవానీని ఆశీర్వదించిన ఆయన, ఆ నిరుపేద కుటుంబ పరిస్థితిని తెలుసుకొని పెళ్లి ఖర్చుల నిమిత్తం తన వంతు సహాయంగా రూ.20 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణం రాజు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా ఎంఎంఆర్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు అందిస్తున్నామని తెలిపారు. భవాని వివాహానికి తమ వంతు సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలం ఉపాధ్యక్షులు కిల్లాడి బాబ్జి, మాజీ ఎంపిటిసి కోలా తాతబాబు, కోన బాబ్జి, గోనగాని రామకృష్ణ, భీమవరపు వారి కుటుంబ సభ్యులు, స్థానిక ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ముదునూరి మురళీకృష్ణం రాజుకు వధువు కుటుంబ సభ్యులు, కృతజ్ఞతలు తెలిపారు.

# అమరావతి రైతులకోసం మాట్లాడే హక్కు వై ఎస్ ర్ సి పి కి లేదు. మాజీ ఎంఎంసి చైర్మన్ దొరబాబు



ముమ్మిడివరం జూన్ 28 (ప్రభాతవార్త ) ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా మాజీ ఏఎంసీ చైర్మన్ గొలకోటి దొరబాబు పాల్గొని మాట్లాడుతూ గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లో అయిదు సంవత్సరాలు రాజధానిని విధ్వంసనికి గురిచేసి మూడు రాజధానులు అంటూ మాట్లాడి రాజధాని రైతులు మీద అనేక కేసులు పెట్టి చివరకు వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి తీసుకొచ్చి రాజధానిలో రోడ్లని బద్దలు కొట్టి, కేబుల్ వైర్లు తగలబెట్టి అనేక విధ్వంశాలు, రౌడీలు, గుండాలు తో విధ్వంశాలు సృష్టించి పారిశ్రామికవేత్తలను భయపెట్టి పెట్టుబడులను పెట్టకుండా భయభ్రాంతులకు గురిచేసి చేసిన వైసిపి ఈ రోజు రాజధాని సందర్శించే హక్కు లేదని దొరబాబు అన్నారు ఈ కార్యక్రమంలో అర్ధాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణ కుమార్, కట్ట సత్తిబాబు, చిక్కాల అంజిబాబు,దంగేటి శ్రీనివాస్, మిమ్మితి చిరంజీవి, యాళ్ల ఉదయ్,గొల్లపల్లి గోపి, అడబాల సతీష్ కుమార్, కొరసాల శివ బాబు, గోదసి గణేష్, సబ్బతి డేవిడ్ రాజులు పాల్గొన్నారు

# దేవాంగ గౌరవ పురస్కారం అందుకున్న తాత మనవలు



ఆత్రేయపురం, జూన్,28,(ప్రభాత వార్త). డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి కి చెందిన తాత మనవలు శ్యామ్ జాదూగర్ రవిశేఖర్ లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా గన్నవరంలోని సన్ సిటీ హోటల్‌లో నిర్వహించిన దేవాంగ ప్రముఖుల సత్కార కార్యక్రమంలో దేవాంగ గౌరవ పురస్కారాన్ని మాజీ మంత్రివర్యులు నిమ్మల కృష్ణప్ప మరియు మాజీ ఐఏఎస్ అధికారి తోగర చిరంజీవులు చేతుల మీదుగా అందుకున్నారు.శ్యామ్ జాదూగర్ కుటుంబం తమ విన్యాస్య ఇంద్రజాల ప్రదర్శనలతో దేశ విదేశాల్లో విశేష గుర్తింపు సాధించడమే కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాలు, విద్యా సేవలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా దేవాంగ సమాజానికే కాకుండా భారతదేశానికి కూడా విశేషమైన పేరు ప్రతిష్టలు తీసుకొస్తున్నారని కొనియాడారు. శ్యామ్ కుటుంబం నేటి సమాజానికి ఆదర్శప్రాయంగా నిలుస్తోందని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శివ శంకరయ్య, కోశాధికారి కొండపల్లి పరమేశ్వరరావుతో పాటు రాష్ట్రంలోని పలువురు దేవాంగ ప్రముఖులు, పెద్దలు పాల్గొని శ్యామ్ జాదూగర్ కుటుంబానికి అభినందనలు తెలియజేశారు.

# యోగాకి రాణీ శ్రీనివాస్ చేయూత ఆదర్శనీయం దువ్వూరి సుబ్బలక్ష్మి



అమలాపురం కలక్టరేట్, జూన్ 28 ప్రభాతవార్త అమ్మమ్మ ఉచిత యోగా కేంద్రానికి మార్గదర్శకురాలైన శ్రీమతి దువ్వూరి సుబ్బలక్ష్మి గారు ఎనిమిది దశాబ్దాల జీవనానుభవంతో అమలాపురం తారకరామ నగర్ లో నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులను నిర్వహించుకొనుటకు స్థలం సరిపోక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం గమనించిన బొడ్డు సౌభాగ్యవతి రాణీ శ్రీనివాస్ తన వంతు చేయూతగా ఇంటిలోని హాలు ఇవ్వడానికి ముందుకు రావడంతో యోగా కేంద్రం వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాణీ శ్రీనివాస్ మాట్లాడుతూ యోగా కేంద్రం నిర్వహించుకొనుటకు మా హాలు కొద్ది మందికే వీలవుతుందని, ఎక్కువమంది వచ్చినా అనువుగా ఉండే స్థలం లభించేవరకు తన వంతు సహకారం ఉంటుందని అన్నారు. అమ్మమ్మ యోగా ఉచిత కేంద్రం వ్యవస్థాపకురాలు దువ్వూరి సుబ్బాలక్ష్మీ ఆధ్వర్యంలో సహాయసహకారాలు అందించిన బొడ్డు సౌభాగ్యవతి రాణి శ్రీనివాస్ ( శ్రీకాంత్ స్పోర్ట్ ) కు అమ్మమ్మ యోగా కేంద్రం వారు కృతజ్ఞతలు తెలుపుతూ చిరు సత్కారంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యోగా అభ్యాసకులు రాంపల్లి కామేశ్వరి, శ్రీమంతుల వీర వేణి, బొల్లం కనక సుందరి, బొల్లం మంగ,పి. లోహిత, బి. ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పోలియో చుక్కల కార్యక్రమంలో జర్త రమణారెడ్డి



అడ్డతీగల,జూన్ 28,ప్రభాతవార్త అడ్డతీగల మండలం కొత్తపాలెం గ్రామంలో పోలియో చుక్కల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు జర్త వెంకటరమణ రెడ్డి పాల్గొని,చిన్నారులకు స్వయంగా పోలియో డ్రాప్స్ వేశారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.పోలియో రహిత సుస్థిర దేశంగా మార్చడమే కూటమి ప్రభుత్వం ప్రధానధ్యేయమని చిన్నారులను పోలియో వ్యాధి నుంచి రక్షించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. అలాగే మారుమూల ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్య సిబ్బందిని ఆయన అభినందించారు. ?ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయగా, గ్రామస్తులు తమ పిల్లలకు చుక్కలు వేయించి పూర్తి స్థాయిలో సహకరించారు.


# మగవారిలో మహిళా సాధికారతపై శిక్షణ



రావులపాలెం, జూన్ 28 (ప్రభాతవార్త) : వేజ్ ఎన్జీఓ, నవోదయ మాక్స్, లిటిల్ ఫ్లవర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రావులపాలెం మండలం పారా సంస్థ ప్రాంగణంలో "ట్రైనింగ్ ఫర్ మెన్ లీడర్స్" శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బీఎస్‌కే రాష్ట్ర కోఆర్డినేటర్ సోడబత్తిన అంబేద్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత, లింగ సమానత్వం, మహిళల అభివృద్ధిలో పురుషుల పాత్ర, బాధ్యతాయుత నాయకత్వం వంటి అంశాలపై శిక్షణ అందించారు. వేజ్ ఎన్జీఓ డైరెక్టర్ పోతుమూడి శేషారత్నం, లిటిల్ ఫ్లవర్ సొసైటీ కోఆర్డినేటర్ వీరవల్లి శేషారత్నం, నవోదయ మాక్స్ ప్రతినిధి ప్రియాంక, ఉయ్ లీడ్ ఫీల్డ్ కోఆర్డినేటర్ దుర్గ పాల్గొన్నారు. మహిళా సాధికారతకు పురుషుల సహకారం కీలకమని పలువురు పేర్కొన్నారు. ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట మండలాలకు చెందిన గ్రామ పెద్దలు అర్జున్, రమాబాయి తదితరులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజం కోసం సమిష్టిగా కృషి చేద్దాం.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు: గంగ సూర్యనారాయణ.**



తాళ్లరేవు జూన్ 28 (ప్రభాతవార్త): పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు సమిష్టి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు మండల గంగ సూర్యనారాయణ అన్నారు.జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి పేట లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మందాల గంగ సూర్యనారాయణ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి ప్రతి పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కామేశ్వరి అంగన్వాడీ వర్కర్లు, ధోనం శేషుకుమారి, గంజా విజయకుమారి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# వైద్య సేవలు బేస్.. ఎంపీపీ దొమ్మేటి..

**పోలియో రహిత దేశంగా "భారత్"..**



అంబాజీపేట, జూన్ 28, (ప్రభాతవార్త): భారత్ ను పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వాల సహకారం, వైద్యాధికారులు,సిబ్బంది కృషి ఎంతో ఉందని,ఇందుకోసం సుదీర్ఘ సమయం పట్టిందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట, ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు వి.గౌతమి,డి.హేమారెడ్డి, టి.దివ్యశ్రీ,ఎం.సిద్ధార్థరాయ్ ల పర్యవేక్షణలో "పల్స్ పోలియో ఆదివారం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 2424 మంది చిన్నారులకు గాను 2348 మందికి, ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 2345 మంది చిన్నారులకు గాను 2328 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు.మండలంలో 31 మంది పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని సుమారు 150 మంది వైద్య సిబ్బంది విధులు నిర్వహించారన్నారు. మండలంలో 98 శాతం పల్స్ పోలియో చుక్కలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూదాబత్తుల లక్ష్మీభార్గవి, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్చార్జి మలేరియా వైద్యాధికారి కె.ఎన్.శ్రీనివాస్, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి వెంకటేశ్వరరావు, సూదాబత్తుల రాము, సి హెచ్ ఓ రవికుమార్, హెల్త్ సూపర్వైజర్ ఎ.రాధానరసింహం, పీహెచ్ఎం భూలక్ష్మి, రెవెన్యూ, పంచాయతీ, విద్యాశాఖ, ఐ సి డి ఎస్ సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పేదల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు

**77 మందికి రూ44 లక్షల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు**



కొత్తపేట, జూన్ 28,(ప్రభాతవార్త) నిరంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షపాతిగా నిలుస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు ఆదివారం వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు కొత్తపేట మండలానికి చెందిన 77మందికి రూ44 లక్షల 82 వేల రూపాయల విలువైన చెక్కులను (4 ఎల్వోసీలు) అందజేశారు ప్రధాని మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అటు సంక్షేమం ఇటు అభివృద్ధి చేస్తూ పేదల పక్షంగానే ఉంటుందన్నారు నాలుగవసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న చంద్రబాబు ఎప్పుడు పేద ప్రజల కోసమే ఆరాటపడతారన్నారు మిగిలిన మూడు మండలాలకు చెందిన వారికి సోమ మంగళ బుధవారాల్లో చెక్కులు అందిస్తామని తెలిపారు

# 98%తో పల్స్ పోలియో విజయవంతం

**మండల వైద్యాధికారి రాజీవ్ కుమార్**




శంకవరం జూన్ 28 ప్రభాతవార్త శంకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం జరిగిన నేషనల్ ఇమ్యూనైజేషన్ డే పల్స్ పోలియో కార్యక్రమం 98%తో విజయవంతమైందని మండల వైద్యాధికారి శెట్టి బత్తుల శ్రీరామ్ రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మండలంలో 22 బూతుల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, మొత్తం 3391 పిల్లలుగాను 3320 మందికి ( 0- 5 సంవత్సరాల్లోపు) పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని పేర్కొన్నారు. శంఖవరం బస్టాండ్ సమీపంలో గల శివాలయం పోలియో బూతును ఎంపీపీ పర్వత రాజబాబు ప్రారంభించగా మధ్య వీధి రామాలయం బూత్ ను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి పర్వత సురేష్ ప్రారంభించారని వైద్యాధికారి తెలిపారు పల్స్ పోలియో పర్యవేక్షణ అధికారి జిల్లా ఎయిడ్స్ లప్రసి టీబీ అధికారి డాక్టర్ చలమయ్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచ్చేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని పై సమీక్షించడం జరిగింది. పల్స్ పోలియో కార్యక్రమంలో 80 మంది వైద్య ఆరోగ్య సిబ్బంది 20 మంది అంగన్వాడీ సిబ్బంది 10 మంది వాలంటరీలుగా పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని, మిగిలి చిన్నారులను డోర్ టు డోర్ లో పూర్తి చేస్తామని మండల వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శెట్టిబత్తుల శ్రీరామ్ రాజీవ్ కుమార్ తెలిపారు

# పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి...



ఆత్రేయపురం, జూన్ 28,(ప్రభాత వార్త) పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసమే పల్స్ పోలియో కార్యక్రమం ఉందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు పేర్కొన్నారు .ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆత్రేయపురం, తాడిపూడి, వేలిచేరు గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు. ఆయన వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ లతో కలసి హై స్కూల్ వద్ద ఏర్పాటుచేసిన పల్స్ పోలియో కేంద్రం వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్ల వయస్సు గల చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, ప్రతి గ్రామంలోనూ, బస్ స్టేషన్లు, ప్రధాన రాకపోకల ప్రాంతాల్లోనూ అనేక కేంద్రాలను ఏర్పాటు చేసిందని, అలాగే ఇంటింటికి వెళ్లి వేసేందుకు పోలియో చుక్కలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు హైమశ్రీ, సౌమ్య, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం వైద్యాధికారి రాజీవ్ కుమార్



శంకవరం జూన్ 28 ప్రభాతవార్త పల్స్ పోలియో కార్యక్రమం మూడు రోజుల పాటు కొనసాగుతుందని శంకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శెట్టి బత్తుల శ్రీరామ్ రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మొదటి రోజున కేంద్రాల వద్ద, తరువాతి రెండు రోజులు ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ వర్కర్లు బృందాలు ఇంకా మిగిలిన చిన్నారులు ఇంటింటికీ వెళ్లి పోలియోచుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలో మిగిలిన రెండు శాతం చిన్నారులను పూర్తి చేస్తామని , మండలంలోని అన్నవరం ,కత్తిపూడి, శంఖవరం బస్ స్టాండ్లు, అన్నవరం రైల్వే స్టేషన్ల లో ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేసి, ప్రయాణంలో ఉన్న చిన్నారులకు కూడా వ్యాక్సిన్ అందుబాటులో ఉంచామని, భక్తుల సౌకర్యార్థం అన్నవరం దేవస్థానం కొండపై కూడా పోలియోకేంద్రాన్ని ఏర్పాటు చేశామని, మండల వైద్యాధికారి వెల్లడించారు. పల్స్ పోలియో పర్యవేక్షణ అధికారి జిల్లా ఎయిడ్స్ లప్రసి టీబీ అధికారి డాక్టర్ చలమయ్య మండలం పల్స్ పోలియో 98%తో విజయవంతం పై వైద్య సిబ్బందిని ఆశ వర్కర్లను అభినందించారు .

# చిన్నారుల ఆరోగ్య భవిష్యత్తుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి.. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



రాజవొమ్మంగి, జూన్ 28, ప్రభాతవార్త చిన్నారుల ఆరోగ్య భవిష్యత్తుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండల కేంద్రంలో ఆదివారం పోలియో వ్యాక్సిన్ కార్యక్రమం పి. హెచ్. సి డా. సుష్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో వారికి పోలియో రాకుండా వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు.. పోలియో వ్యాక్సిన్ పట్ల ఎలాంటి అపోహలు వద్దని ఆమె అన్నారు. రాజవొమ్మంగి పి. హెచ్. సి పరిదిలో 1,125 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేయాలన్నారు. ఇప్పటికే మన దేశం పోలియో రహిత దేశం అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్య రక్షణకు చేసే ఈకార్యక్రమంలో ఆశలు, అంగన్వాడీలు, వైద్య సిబ్బంది ఉదయం ఆరు గంటలు నుండే విధులను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఈకార్యక్రమంలో ఏ. పి. ఐ. ఐ. సి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన సావిత్రి, టిడిపి నాయకులు గణజాల తాతారావు, జెట్టి మధు, పెదిరెడ్ల సత్యనారాయణ, అప్పన్న, చెక్కా లోవరాజు, వెచ్చం వీరబాబు, డా. సుష్మ, హెచ్. వి. అప్పలనర్స, అంగన్వాడీ వర్కర్ సుందరమ్మ, ఆశలు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు. సి. ఐ. సన్యాసినాయుడు, ఎస్. ఐ. వెంకట్రావు, సిబ్బంది విధులను నిర్వహించారు.

# జూలై 3 న ర్యాలి శ్రీ జగన్మోహునుడి శ్రవణా నక్షత్ర మాస కళ్యాణం...

**నిత్యాన్నదాన పథకానికి విరాళాల వెల్లువ.**




ఆత్రేయపురం, జూన్ 28,(ప్రభాత వార్త) ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా విరాజల్లుతున్న ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ,గోపాల స్వామి వారి శ్రవణా నక్షత్ర మాస కళ్యాణం జూలై 3. తేదీన జరగనున్నట్లు ఈఓ దారాపురెడ్డి సురేష్ బాబు తెలిపారు. భక్తులు వివాహం, సంతానం, విద్య, ఉద్యోగం, బదిలీ, పదోన్నతి, విదేశీయానాం, ఆరోగ్యం, వ్యాపారం మొదలగు కోరికల కొరకు శ్రీ స్వామి వారి మాస కళ్యాణంలో పాల్గొవాలని. కావున భక్తులు ఈ మొబైల్ నెంబర్ కు 99113 34733 సంప్రదించి ఆన్లైన్ ద్వారా రుసుము రూ.750/- లుఏ చెల్లించి పూజనందు పాల్గొవాలని ప్రసాదం పోస్టు ద్వారా పంపిస్తామని. ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు తెలిపారు. రావులపాలెం చెందిన సోమిరెడ్డి, సుధ దంపతులు, శ్రీ స్వామి వారిని దర్శించుకుని శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.10,116/- వేలు, హైదరాబాద్ చెందిన వెంకట నాగ కామేశ్వరరావు, శైలజ దంపతులు, శ్రీ స్వామి వారిని దర్శించుకుని శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.10,116/- వేలు, హైదరాబాద్ చెందిన మాయ కృష్ణమూర్తి, విజయ దంపతులు, శ్రీ స్వామి వారిని దర్శించుకుని శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.5,000/- వేలు విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, శ్రీ స్వామి వారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేశారు .వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

# పోలియో చుక్కలు వేయించండి... అంగవైకల్యాన్ని పారద్రోలండీ...!

**... ఆత్మ కమిటీ చైర్మన్ : ఆర్ నాగు**



పెదపూడి.ప్రభాతవార్త ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించండి అంగవైకల్యాన్ని పారద్రోలండీ అంటూ కాకినాడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ రావాడ నాగు పిలుపునిచ్చారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని పల్స్ పోలియో కేంద్రంలో కాకినాడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ ఆర్ నాగు, అనపర్తి నియోజకవర్గం ఏఎంసీ చైర్మన్ జుత్తుక సూర్య కుమారిలు పల్స్ పోరియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. చిన్నారుల భవిష్యత్తుకు భద్రత చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని దీనిని ప్రజలంతా సద్వినియోగం చేసుకొని పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆరోగ్యవంతమైన భారతదేశ నిర్మాణానికి, రాబోయే తరాలను పోలియో మహమ్మారి బారిన పడకుండా కాపాడుకోవడానికి పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమైనదని తెలిపారు. ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి ఒక్క చిన్నారికి తల్లిదండ్రులు బాధ్యతగా పోలియో చుక్కలు వేయించాలని తద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగి, పిల్లల భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కాప్స్ రాక్స్ చేయూత




కాకినాడ రూరల్ జూన్ 28(ప్రభాతవార్త): సమాజం అభివృద్ధి చెందాలంటే కేవలం విద్య మాత్రమే పునాది గా భావించి కాపు పేద విద్యార్థులకు గత పదేళ్ల నుంచి నిర్విరామంగా వాళ్ల చదువు నిమిత్తం ప్రతి సంవత్సరం ఇచ్చే ఉపకార వేతనాలను 2026కు గాను 134 మందికి 13 లక్షల రూపాయలను చెక్కుల రూపంలో ఆర్థిక సహాయాన్ని కాప్స్ రాక్స్ ఎడ్యుకేషనల్ చారిటీ తరపున ఫౌండర్ పెద్దిరెడ్డి శివ భాస్కర్ చేయూత ను అందించారు. 2017లో కాపులకు మంచి చేయాలని ఉద్దేశంతో తలపెట్టి ప్రారంభించిన కాపు రాక్స్ ట్రస్టు వ్యవస్థాపకుడు తెలంగాణలో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న పెద్దిరెడ్డి శివ భాస్కర్ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కాప్స్ రాక్స్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ మహోత్సవం ఆదివారం శుభం కాపు కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండర్ పెద్దిరెడ్డి శివ భాస్కర్ మాట్లాడుతూ కాపు కులంలో పుట్టి పేదలుగా ఉన్నవారికి ఏదో విధంగా సహాయం అందజేయాలని ఉద్దేశంతో ఈ కాపు రాక్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ , ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, కుడా చైర్మన్ తలాటం సత్య, కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు, దుగ్గన బాబ్జి పలువురు మాట్లాడుతూ పేరుకు కాపులు తప్ప ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని ,అటువంటి వారికి అండగా కాపు రాక్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చాలా ఉపయోగకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చిట్ల కిరణ్, కొండమూరి సత్యనారాయణ, పప్పుల మసేను, నల్లా పవన్, అనిశెట్టి రామకృష్ణ, దొడ్డిపట్ల అప్పారావు, కాపు రాక్స్ అడ్మిన్లు, కోఆర్డినేటర్లు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పోలియో చుక్కలు వేద్దాం, పోలియో మహమ్మారిని నిర్మూలిద్దాం



కడియం:28( ప్రభాతవార్త) పిల్లలను పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో కడియం మండలం జేగురుపాడు గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీటీసీ నాగిరెడ్డి సూర్య రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి, ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో మందు వేయించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ నాగిరెడ్డి సూర్య రామకృష్ణ మాట్లాడుతూ, పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పాతూరు రాజేష్, దేవస్థాన చైర్మన్ కర్రి చినబాబు, శివ సుబ్రహ్మణ్యం, వల్లూరి మోహనరావు, ఎన్నమని నరేష్, మాన్యం చంద్రమోహన్, వనమాలి వెంకట బాలాజీ, నాగిరెడ్డి వెంకటేష్, వందే ధర్మరాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps